ప్రతిపక్షం
www.prathipaksham.in
ఆదివారం 16.11.2025 | Published from: Hyderabad | సంపుటి: 18 సంచిక: 236 పేజీలు:12 వెల రూ. 5/-
@prathipaksham | prathipaksham tv telugu



కోల్‌కతా టెస్టులో టీమిండియా దూకుడు 12

వ్యూహం ఫలించింది

సమన్వయం గెలిపించింది

'జూబ్లీ'లో చరిత్రాత్మక విజయం వచ్చింది



- రాహుల్ గాంధీకి వివరించిన సీఎం రేవంత్
- మంత్రులు, నేతల సమష్టి కృషి ఫలితమని వెల్లడి
- పని చేసిన సీఎం, డీసీఎం, పీసీసీ చీఫ్ వ్యూహాలు
- పటిష్టంగా అమలు చేసిన మంత్రులు, నేతలు
- మొదటిసారి క్రమశిక్షణతో నడిచిన శ్రేణులు
- రాష్ట్రవ్యాప్తంగా పార్టీలో సమరోత్సాహం
- ఇదే ఊపుతో స్థానిక ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, నవంబర్15 : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి ఊపిరి పోశాయి. బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాన్ని చేజిక్కించుకోవడానికి రాష్ట్ర నాయకత్వం చేసిన యత్నాలు ఫలించాయని పార్టీ అగ్రనేత, పార్లమెంటరీ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీకి సీఎం వివరించినట్లు సమాచారం. ఉప ఎన్నికలో అఖండ విజయం సాధించడంతో శనివారం నాడు ఆయన విజేత నవీన్ యాదవ్ ను తీసుకుని ఢిల్లీలో రాహుల్ గాంధీని కలిశారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వారి వెంట ఉన్నారు. మూడు నెలలుగా క్షేత్ర స్థాయిలో ముగ్గురు మంత్రులు, పార్టీ నాయకులు చేసిన కృషి ఫలితం జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విజయంగా చెప్పవచ్చు. కాంగ్రెస్ విజయ పతాకాన్ని ఎగురవేయడంతో పార్టీ శ్రేణులలో నూతన ఉత్సాహం నెలకొంది. ఇదే ఊపుతో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లే యోచనలో రాష్ట్ర నాయకత్వం ఉంది. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ వ్యూహాలకు అనుకూల ఫలితం వచ్చింది. ఉప ఎన్నిక ఫలితాన్ని ఆ పార్టీ చారిత్రాత్మక విజయంగా పరిగణిస్తోంది. ఈ గెలుపు రాష్ట్రంలో ప్రజాభిమానాన్ని ప్రతిబింబిస్తోందని పీసీసీ వర్గాలు

..:: మిగతా 2లో

పార్టీ తరపున ఎన్నికైన కార్పొరేటర్లలో సీఎన్ రెడ్డి శాసనసభ ఎన్నికలకు ముందు, బాబా ఫసియుద్దీన్, సంగీతా యాదవ్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాగంటి గోపీనాథ్‌తో విభేదాలతోనే పలువురు నేతలు పార్టీని వీడినట్లు చెబుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రచార పర్వాన్ని ఇతర ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు, సీనియర్ నేతలు ముందుండి నడిపించారు. ప్రచార గడువు ముగిసిన అనంతరం వారు వెళ్లిపోవడంతో, ప్రభావవంతంగా పోల్ మేనేజ్‌మెంట్ చేసేవారు లేకుండా పోయారని, ఆ లోటు కనిపించిందని పార్టీ వర్గాలు అంటున్నాయి. అధికార పార్టీ వ్యూహాలను తగిన విధంగా ఎదుర్కోలేకపోయారని చెబుతున్నారు.



కలిసిరాని సెంటిమెంట్

గులాబీ పార్టీకి తప్పని ఓటమి

బీఆర్ఎస్ నేతల యత్నాలు విఫలం

- అన్నీ తానై శ్రేణులను నడిపించిన కేటీఆర్
- అంత బలంగా లేని స్థానిక నాయకత్వం
- ప్రభావవంతంగా సాగని పోల్ మేనేజిమెంట్
- గోపీనాథ్ సంస్మరణ సభల నుంచే ప్రచారం షురూ
- డివిజన్లవారీగా వివిధ నేతలకు ఎన్నిక బాధ్యతలు
- 'బాకీకార్డులు', అమలు కాని పథకాలంటూ సందడి
- ప్రజలకు విస్తృతంగా వివరించినా దక్కని ఫలితం
- పార్టీ నేతల మాటలను అంతగా నమ్మని జనం
- వరుసగా రెండో సీటును కోల్పోయిన బీఆర్ఎస్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, నవంబర్15 : బీఆర్ఎస్ పరాజయాల పరంపర కొనసాగుతోంది. శాసనసభ ఎన్నికలలో ఓటమి నాటి నుంచి ఇప్పటివరకు ఒక్కటి మినహా ఏ ఎన్నికలోనూ గులాబీ పార్టీ గెలుపొందలేదు. విజయం ఖాయమనుకున్న ఉపఎన్నికలోనూ ఓడిపోయి మరో సిట్టింగ్ అసెంబ్లీ స్థానాన్ని కోల్పోయింది. ప్రచార పర్వంలో ముందంజలో ఉన్నా, పోల్ మేనేజ్‌మెంట్‌లో విఫలమై భారీ తేడాతో జూబ్లీహిల్స్‌లో చతికిలపడింది. మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో వచ్చిన ఉప ఎన్నికలో ఆయన భార్య సునీతను బీఆర్ఎస్ బరిలోకి దింపింది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నీ తానై ఉపఎన్నిక బాధ్యతను భుజానికెత్తుకున్నారు. సీనియర్ నేత హరీశ్ రావు సహా మాజీ మంత్రులు, పార్టీ యంత్రాంగం అంతా ఉపఎన్నికలో పని చేశారు. మిగిలిన పార్టీల కన్నా ముందుగానే బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించింది. మాగంటి గోపీనాథ్

..:: మిగతా 2లో





జమ్మూకశ్మీర్‌లో భారీ పేలుడు

- 9 మంది మృతి: పలువురికి గాయాలు
- నమూనాలు సేకరిస్తుండగా భారీ విస్ఫోటనం
- ముందు ఉగ్రవాదుల కుట్ర అని అనుమానం
- కాదని తేల్చేసిన జేకే రాష్ట్ర డీజీపీ నళినీ ప్రభాత్
- ఘటన ప్రమాదవశాత్తూ జరిగిందని వెల్లడి

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

శ్రీనగర్ , నవంబర్ 15 : జమ్ము కశ్మీర్‌లోని నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం అర్ధరాత్రి సంభవించిన భారీ పేలుడులో తొమ్మిది మంది మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. ఈ పేలుడు వెనుక ఉగ్రవాద కుట్ర ఉందన్న ప్రచారాన్ని డీజీపీ నళినీ ప్రభాత్ తోసిపుచ్చారు. ఇది ప్రమాదవశాత్తు జరిగిందని వెల్లడించారు. హర్యానాలోని ఫరీదాబాద్‌లో ఉగ్ర మాడ్యూల్‌ను ఛేదించిన అధికారులు, అక్కడి నుంచి పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. వాటి నుంచి నమూనాలు (శాంపిల్స్)

..:: మిగతా 2లో

ఐబొమ్మ నిర్వాహకుడు రవి అరెస్టు



ఫ్రాన్స్ నుంచి రాగానే పట్టుకున్న పోలీసులు

- తనను ఎవరూ పట్టుకోలేరని గతంలో సవాల్
- పట్టుకుంటే ఏం చేయాలో తెలుసని హెచ్చరిక
- కరేబియన్ దీవుల నుంచి వెబ్‌సైట్ నిర్వహణ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, నవంబర్15 : సినిమాలను, వెబ్‌సిరీస్‌లను పైరసీ చేస్తూ వెబ్‌సైట్‌లో పెట్టిన ఐ బొమ్మ (ప్రస్తుతం బప్పమ్ టీవీ) నిర్వాహకుడు ఇమ్మడి రవిని పోలీసులు అరెస్టు చేశారు. పైరసీ విషయంలో పోలీసులకు గతంలో అతను సవాల్ చేశాడు. దమ్ముంటే పట్టుకోవాలని, అందరి పర్సనల్ వివరాలు బయటపెడతానంటూ బెదిరించాడు. ఈ బెదిరింపును పోలీసులు సీరియస్‌గా తీసుకొని ఇన్నిరోజులు కాపు కాసి పట్టుకున్నారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా

..:: మిగతా 2లో

తెలంగాణలో మళ్లీ ఎన్నికలు!

- ప్రభుత్వానికి హైకోర్టు కీలక ఆదేశాలు
- 24లోగా 'స్థానిక' ఎన్నికలపై స్పష్టత ఇవ్వాలి
- నిర్వహణపై అభ్యంతరం లేదన్న ధర్మాసనం
- రిజర్వేషన్ మీదే వాదనలు జరిగాయని స్పష్టీకరణ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో



హైదరాబాద్, నవంబర్15 : తెలంగాణలో మళ్లీ ఎన్నికలు రాబోతున్నాయి. లోకల్ బాడీ ఎన్నికలపై ప్రభుత్వానికి హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 24వ తేదీలోపు లోకల్ బాడీ ఎన్నికలపై తేల్చాలని సూచించింది. తాము రిజర్వేషన్ల మీదే అభ్యంతరం చెప్పాం కానీ, ఎన్నికల నిర్వహణపై కాదని హైకోర్టు పేర్కొంది. బీసీ రిజర్వేషన్లపై వివాదం లేనిచోట ఎన్నికలు నిర్వహిస్తామని ఎస్ఈసీ పేర్కొనడంతో, ఎస్ఈసీ తీరుపై హైకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. విభజించి ఎన్నికలు నిర్వహించడం సరి కాదని హైకోర్టు సూచించింది. నవంబర్ 24వ తేదీలోపు ఎన్నికల తేదీలు ప్రకటించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. గతంలో బీసీ రిజర్వేషన్ల వలన స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ నిలిచిపోయింది. ఎస్ఈసీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంతోపాటు ఎన్నికల నోటిఫికేషన్ సైతం జారీ చేసింది. అయితే, బీసీ రిజర్వేషన్లపై కొందరు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులు జోక్యంతో ఎన్నికలు నిలిచిపోయాయి. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల అమలు జీఓపై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానంలో సవాలు చేసిన విషయం విదితమే.

'మిడ్డే మిల్స్'లో చేపల కర్రీ

- మెనూలో పెట్టేలా తగు చర్యలు
- చికెన్, మటన్ తో పాటు చేప కూర
- మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ
- సంతోషంలో గురుకులాల విద్యార్థులు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, హుస్నాబాద్

నవంబర్ 15: తెలంగాణవ్యాప్తంగా కొనసాగుతున్న గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల భోజన మెనూలో చేపల కర్రీ పెట్టేలా చూస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం ఆయన ఉమ్మడి కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలో మంత్రి వాకిటి శ్రీహరి, ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తో కలిసి పర్యటించారు. హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కట్ట సుందరీకరణ పనులను పరిశీలించి, చెరువులో చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మత్స్య శాఖకు తెలంగాణ ప్రభుత్వం రూ. 122.22 కోట్లు కేటాయించిందన్నారు. రాష్ట్రంలో ఉన్న 26 వేల నీటి వనరులలో 84 కోట్ల చేపపిల్లలు, 10 కోట్ల రొయ్య పిల్లలు, ఉచిత చేప పిల్లలను పంపిణీ చేస్తామన్నారు. మత్స్య సంపద పై రాష్ట్రంలో ఐదు లక్షల మంది

..:: మిగతా 2లో





బిహార్ ఫలితాలు 'ఇండి' కూటమికి గుణపాఠం

తమిళనాడు సీఎం స్టాలిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. బిహార్ ఫలితాలు ఇండియా కూటమికి ఓ పాఠం అని పేర్కొన్నారు. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు అభినందనలు తెలియజేశారు. విజయం కోసం తీవ్రంగా కృషి చేసిన ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌కు కూడా అభినందనలు తెలిపారు.

11



ఆర్జేడీకే ఎక్కువ పోలైన ఓట్లు

బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో మహా గఠ్‌బంధన్ కూటమికి నేతృత్వం వహించిన రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ)కే ఎక్కువ ఓట్లు పోలయ్యాయి. అయితే, ఎన్డీయేకు చెందిన బీజేపీ, జేడీ(యు)కు అత్యధిక సీట్లు దక్కాయి. 243 అసెంబ్లీ స్థానాలకుగాను ఎన్డీయే 202 స్థానాలు గెలుచుకున్నది.

11



'మహా' కూటమి ఓటమిలో 'జన సురాజ్'

బిహార్ లో నితీశ్ కుమార్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమైంది. అయితే, మహా గఠ్‌బంధన్ ఘోర ఓటమిలో ప్రశాంత్ కిషోర్ జనసురాజ్ పార్టీ ప్రభావం కీలకంగా కనిపిస్తోంది.

11



ఆర్‌కే సింగ్‌పై బీజేపీ వేటు

క్రమశిక్షణా చర్యలలో భాగంగా బీజేపీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర మాజీ మంత్రి, బిహార్‌కు చెందిన సీనియర్ నేత ఆర్‌కే సింగ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది.

11

రాజకీయం

'మిడ్డే మిల్స్'లో చేపల కర్రీ

మొదటిపేజీ తరువాయి

మత్స్య కారుల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని, వారి అభివృద్ధికి కృషి చేస్తున్నమన్నారు. చేపల ఉత్పత్తి కేంద్రాలు పెంచి గణనీయంగా పెంచి ఇతర ప్రాంతాలకు సరఫరా చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నమని వెల్లడించారు. గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పాలు, గ్రుడ్డు, చికెన్, మటన్ తో పాటు చేపల కర్రీ కూడా పెట్టేలా మెనూ లో మార్పులు తీసుకువస్తామన్నారు.

కరీంనగర్ లోమంత్రి పొన్నం పర్యటన

కరీంనగర్ లో రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. హైదరాబాద్ నుంచి కరీంనగర్ వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ కోతిరాంపూర్ లోని మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పడిశెట్టి భూమయ్య కుమారుడు సాయి చరణ్ రమ్య వివాహం ఇటీవల జరగగా నూతన వధువరులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆశీర్వదించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో బీజిగా ఉండటం వల్ల పలు కార్యక్రమాలు, శుభకార్యాలకు హాజరు కాలేకపోయనని.. కరీంనగర్ లో తన ఆప్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులను కలుసుకున్నానని మంత్రి అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

మోడల్ వర్సిటీలుగా జేఎన్‌టీయూహెచ్, ఓయూ

- మూడేండ్లలో వీటికి రూ.200 కోట్లు కేటాయించాలి
- సిఫారసు చేయనున్న మౌలిక వసతుల కోర్ గ్రూప్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 15 : రాష్ట్రంలో మొదటి విడతగా జేఎన్టీయూహెచ్, ఉస్మానియాను మోడల్ వర్సిటీలుగా తీర్చిదిద్దాలని, మౌలిక వసతుల కోసం మూడేండ్లలో రెండు వర్సిటీలకు ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయించాలని విద్యాసంస్థలలో మౌలిక వసతులపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కోర్ గ్రూప్ సిఫార్సు చేయనుంది. జాతీయ విద్యా విధానం తరహాలో తెలంగాణకూ ప్రత్యేక విద్యా విధానం కోసం ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు చైర్మన్‌గా కమిటీని నియమించిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ అక్టోబరు లోపుగా నివేదిక అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. 2024 జూలైలో రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో సంస్కరణలకు మంత్రి శ్రీధర్‌బాబు ఛైర్మన్‌గా, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించింది. ఆ కమిటీ సైతం నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. తాజాగా ఆ నివేదిక ప్రకటించింది. నివేదికల రూపకల్పనకు ప్రభుత్వం 11 కోర్ గ్రూప్‌లను నియమించింది. మౌలిక వసతులు, డిజిటల్ టెక్నాలజీ, పరిశోధన, సిలబస్ తదితర అంశాలపై సమావేశమైన కోర్ గ్రూప్‌లు, వారంలోగా నివేదికలను అందజేయనున్నారు. తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి నేతృత్వంలోని గ్రూప్ ఆసక్తికర సిఫార్సులను చేయనుంది.

20 నుంచి ఇండియన్ ఫొటో ఫెస్టివల్

- 50 దేశాల నుండి 820 ఎంట్రీలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 15 : దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మక 'ఇండియన్ ఫోటో ఫెస్టివల్ 11వ ఎడిషన్' నవంబర్ 20 నుండి జనవరి 4 వరకు మాదాపూర్ స్టేట్ ఆర్ట్ గ్యాలరీ లో జరుగనుంది. ఫొటో జర్నలిజం నుండి లలిత కళల వరకు, డాక్యుమెంటరీ నుండి ల్యాండ్‌స్కేప్ వరకు ఒక్క భారతదేశం నుంచే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అద్భుత ఫొటో, డాక్యుమెంటరీ, దృశ్యాలను ఇందులో ప్రదర్శించనున్నారు. సోలో ఎగ్జిబిషన్‌లు, గ్రూప్ షోకేస్‌లు, ఆర్టిస్ట్ టాక్స్, వర్క్‌షాప్‌లు, డాక్యుమెంటరీ ఫిల్మ్ స్క్రీనింగ్ ఉంటాయి. ప్రపంచ వ్యాప్తంగా 50 దేశాల నుండి 820 ఎంట్రీలు వచ్చాయి. వీటిని నిష్ణాతులైన జ్యూరీ సభ్యులు నికోల్ తుంగ్ (ఫొటో జర్నలిస్ట్), గురిందర్ ఒసాన్ (ఫొటో ఎడిటర్, ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా), సుకృతి అనా స్టానెలీ (క్రియేటివ్ డైరెక్టర్, ది కారవాన్), మాధవన్ పిళ్లై (ఫొటోగ్రాఫర్, క్యూరేటర్) ఫైనలిస్టులను ఎంపిక చేశారు. 20 వతేదీ సాయంత్రం 5:30 గంటలకు స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఫెస్టివల్ ప్రారంభోత్సవ కార్యక్రమమే ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక ఫెస్టివల్ లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు www.indianphotofest.com అనే వెబ్ సైట్ ను సందర్శించాలని చెప్పారు.

తెలంగాణ హైకోర్టు వెబ్‌సైట్ హ్యాక్

- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఐటీ టీమ్



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 15: సైబర్ నేరగాళ్లు తెలంగాణ హైకోర్టు వెబ్‌సైట్ ను హ్యాక్ చేసినట్లు తెలుస్తోంది. ఆర్డర్ కాపీలు డౌన్‌లోడ్ చేస్తున్న క్రమంలో ఆన్‌లైన్ బెట్టింగ్ సైట్ ఓపెన్ అయినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో హైకోర్టు రిజిస్ట్రార్ పోలీసులను ఆశ్రయించారు. పీడీఎఫ్ ఫైల్స్‌కు బదులు బీడీజీ స్లాట్ అనే బెట్టింగ్ సైట్ ఓపెన్ అవుతోందంటూ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 11వ తేదీన ఈ సంఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. 11వ తేదీనే హైకోర్టు రిజిస్ట్రార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెబ్ సైట్ హ్యాక్ చేసిన వారిని కనుక్కునే పనిలో పడ్డారు. వెబ్‌సైట్ లోని సమస్యను క్లియర్ చేశారు. తెలంగాణ హైకోర్టుకు చెందిన ఈ అధికారిక వెబ్‌సైట్‌లో ప్రతీ కేసుకు సంబంధించిన వివరాలు అందుబాటులో ఉంటాయి. 'ఈ కేసులు' ఎప్పుడు ఉంటాయన్న దానితో పాటు జడ్జిల వివరాలు అందుబాటులో ఉంటాయి. వెబ్ సైట్ హ్యాక్ అయిన విషయం గురించి ఐటీ టీమ్ రిజిస్ట్రార్‌కు సమాచారం ఇచ్చింది. రిజిస్ట్రార్ వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఐపీ అడ్రస్ ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో పడ్డారు.

వారికి రౌడీలకు, పహిల్వాన్లకు తేడా తెల్వదు

- కుమారుడి గెలుపు అనంతరం చిన్న శ్రీశైలం యాదవ్



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 15 : అమెరికాలో బాత్రూంలు కడిగి వచ్చినోనికి హైదరాబాద్ లో రౌడీలకు, పహిల్వాన్లకు తేడా తెల్వదని నవీన్‌యాదవ్ తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్ విమర్శించారు. కుమారుడి గెలుపు అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రచారం సమయంలో ఎమ్మెల్యే అభ్యర్థి అయిన నవీన్ యాదవ్‌పైనా, తనపైనా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై చిన్న శ్రీశైలం యాదవ్ స్పందించారు. తాము 48 యేండ్లుగా ప్రజలలో ఉన్నామని చెప్పారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలపై పూర్తి స్థాయిలో అవగాహన ఉందన్నారు. నవీన్ యాదవ్ భవిష్యత్ కార్యాచరణ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా వృద్ధి చేయడమేనని, ముఖ్యంగా యువత గురించి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఎన్నో యేండ్ల పోరాట ఫలితమే ఈ విజయమని భావోద్వేగానికి గురయ్యారు.



శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప స్వాములు

ప్రతిపక్షం, షాద్ నగర్, నవంబర్ 15: గడ్డి అన్నారం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం నుంచి తొమ్మిది మంది స్వాములు ఇరుముడి కట్టుకుని శనివారం నాడు శబరియాత్రకు భయలుదేరారు. వక్కలంక శ్రీనివాస్ రావు గురుస్వామి, నాయకి విజయ్ స్వామి, రాజా స్వామి, సతీశ్ స్వామి, గోవింద్ స్వామి, హనుమంతు స్వామి, రవి స్వామి, సురేశ్ స్వామి, కార్తికేయ అయ్యప్ప స్వాములు శబరిమలకు బయలుదేరినవారిలో ఉన్నారు.

కలిసిరాని సెంటిమెంట్

మొదటిపేజీ తరువాయి

సంస్మరణ సభల నుంచే ఉప ఎన్నిక ప్రచారానికి శ్రీకారం చుట్టింది. డివిజన్లవారీగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నేతలను ఇన్‌చార్జులుగా నియమించి ఎన్నిక బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత క్లస్టర్ల వారీగా కూడా బాధ్యులనునియమించారు. వారి ద్వారా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బాకీ కార్డుల పేరిట కాంగ్రెస్ అమలు చేయని ఎన్నికల హామీలు, గ్యారెంటీలను ప్రజలలోకి తీసుకెళ్లారు. హైడ్రా, ఆటో డ్రైవర్లు, తదితర అంశాలను విస్తృతంగా ప్రచారం చేశారు.

ఎన్ని చెప్పినా సరే, ఎందుకో మరి!

పదేండ్ల అభివృద్ధి, రెండేండ్ల అరాచకం మధ్య పోటీ అంటూ చెబుతూ వచ్చిన బీఆర్ఎస్ పార్టీ నేతలు, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి జూబ్లీహిల్స్ నాంది కావాలని పిలుపునిచ్చారు. ఓటర్లను అధికార పార్టీ ప్రలోభ పెడుతోందని, దొంగ ఓట్లు వేయిస్తున్నారని పోలింగ్ రోజు ఆందోళన చేశారు. అవేవీ బీఆర్ఎస్ పార్టీనిగెలుపు తీరాలకు చేర్చలేదు. ఫలితంగా భారీ తేడాతో ఓటమి చవిచూసింది. కొద్ది రోజుల ముందు వరకు జూబ్లీహిల్స్‌లో విజయం ఖాయమన్న ధీమా గులాబీ పార్టీ కనిపించింది. సర్వేలు తమకు పూర్తి అనుకూలంగా ఉన్నాయని, విజయం ఖాయమన్న విశ్వాసంతో నేతలు కనిపించారు. ప్రచారపర్వం ముగిసే వరకు కాస్త పైచేయిగా ఉన్న గులాబీపార్టీ, ఆ తర్వాత ఢీలా పడిందని చెప్పుకోవచ్చు. పోల్ మేనేజ్‌మెంట్‌లో బీఆర్ఎస్ విఫలమైందన్న వాదన బలంగా ఉంది. నియోజకవర్గంలో బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నేతలు బలంగా లేకపోవడం, సంస్థాగత నిర్మాణం లేని లోటు స్పష్టంగా కనిపించింది.

బీఆర్ఎస్ నేతల తీరు కూడా కారణం

పార్టీ తరపున ఎన్నికైన కార్పొరేటర్లలో సీఎన్ రెడ్డి శాసనసభ ఎన్నికలకు ముందు, బాబా ఫసియుద్దీన్, సంగీతా యాదవ్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాగంటి గోపీనాథ్‌తో విభేదాలతోనే పలువురు నేతలు పార్టీని వీడినట్లు చెప్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రచార పర్వాన్ని ఇతర ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు, సీనియర్ నేతలు ముందుండి నడిపించారు. ప్రచార గడువు ముగిసిన అనంతరం వారు వెళ్లిపోవడంతో, ప్రభావవంతంగా పోల్ మేనేజ్‌మెంట్ చేసేవారు లేకుండా పోయారని, ఆ లోటు కనిపించిందని పార్టీ వర్గాలు అంటున్నాయి. అధికార పార్టీ వ్యూహాలను తగిన విధంగా ఎదుర్కోలేకపోయారని చెబుతున్నారు. సైలెంట్ ఓటింగ్‌పై బీఆర్ఎస్ భారీగా ఆశలు పెట్టుకొంది. అందుకే, కాంగ్రెస్ పార్టీ నేతలు ఇచ్చే డబ్బులు తీసుకొని తమకు ఓటు వేయాలని కేటీఆర్ ప్రజలను కోరారు. కానీ, సైలెంట్ ఓటింగ్ కూడా అంతగా లేదని తేలిపోయింది. 2018లో మాగంటి గోపీనాథ్ 16,004 ఓట్ల మెజారిటీతో, 2023లో 16,337 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. తాజా ఉప ఎన్నికలో ఆయన భార్య సునీత 24,729 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. సాధారణ ఎన్నికలలో పోలైన ఓట్లలో 43.94 శాతం ఓట్లు బీఆర్ఎస్‌కు రాగా, తాజా ఉప ఎన్నికలో మాత్రం 38.13 శాతం ఓట్లే వచ్చాయి. తాజా ఓటమితో బీఆర్ఎస్ మరో సిట్టింగ్ స్థానాన్ని కోల్పోయింది. 2023లో గులాబీ పార్టీ 39 స్థానాలు గెల్చుకొంది. లాస్య నందిత మరణంతో జరిగిన కంటోన్మెంట్ ఉప ఎన్నిక, తాజాగా జూబ్లీహిల్స్‌లో పరాజయం పాలైంది. దీంతో అసెంబ్లీలో పార్టీ బలం 37కు పడిపోయింది. పది మంది బీఆర్ఎస్ శాసనసభ్యులు కాంగ్రెస్ లో చేరారు. వారిపై దాఖలైన అనర్హతా పిటిషన్లపై విచారణ కొనసాగుతోంది. నికరంగా పార్టీ తరఫున 27 మంది ఎమ్మెల్యేలు ఉన్నట్లుగా పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

సానుభూతి కలిసి రాలేదు

శాసనసభ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ పరాజయాల ఖాతాలో మరొకటి చేరింది. ఒక్క మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో మాత్రమే గెలుపొందిన గులాబీ పార్టీ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక, లోక్‌సభ ఎన్నికలు, రెండు ఉప ఎన్నికలలోనూ ఓటమి చవిచూసింది. సిట్టింగ్ శాసనసభ్యుడు మరణిస్తే ఉప ఎన్నికలో కుటుంబసభ్యులకు టికెట్ ఇవ్వడం ద్వారా సానుభూతి కలిసి వస్తుందన్న సెంటిమెంట్ బీఆర్ఎస్‌కు పెద్దగా కలిసి రావడం లేదనే చెప్పుకోవచ్చు. నాగార్జునసాగర్‌లో నోముల నర్సింహయ్య కుమారుడు నోముల భగత్ మాత్రమే ఈ తరహాలో గెలుపొందారు. దుబ్బాక, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్‌లోనూ సానుభూతి కలిసి రాలేదు.





వ్యూహం ఫలించింది

మొదటిపేజీ తరువాయి

అభిప్రాయపడుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదట జరిగిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉపఎన్నికలో అధికార పార్టీ విజయం సాధించింది. పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ గౌడ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిన మొదటి ఉప ఎన్నికలో పార్టీకి గ్రాండ్ విక్టరీ అందింది. సీఎం రేవంత్ రెడ్డితో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సమన్వయ నాయకత్వానికి నిదర్శనంగా నిలిచింది.

నిరంతరం సమీక్షలు చేస్తూ

మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, పార్టీ ఆఫీస్ బేరర్స్‌తో నిరంతరం సమీక్షలు చేస్తూ, స్పష్టమైన దిశా నిర్దేశంతో విజయం దిశగా నడిపించారు. ఏడు డివిజన్ల పర్యవేక్షణ మంత్రులకు అప్పగించారు. షెడ్యూల్ వచ్చిన తర్వాత రంగంలోకి దిగిన సీఎం, పీసీసీ అధ్యక్షుడు రాత్రీపగలు కష్టపడ్డారు. బూత్, డివిజన్ స్థాయిలో సమీక్ష చేశారు. పర్యవేక్షణతో పాటు పోల్ మేనేజ్‌మెంట్‌ను కచ్చితమైన శైలిలో మలిచారు. ఏఐసీసీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ సమన్వయం, సీఎం, పీసీసీ చీఫ్, డిప్యూటీ సీఎం భట్టి కలిసి తరచూ జూమ్ సమావేశాలు నిర్వహించారు. ఒక్కో డివిజన్‌కు ఇద్దరు మంత్రులను బాధ్యులుగా నియమించడంతో పాటు వాళ్ల పరిధిలో ప్రతి నాలుగు, ఐదు పోలింగ్ బూతులకు ఒకరి లెక్కన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలను, కార్పొరేషన్ చైర్మన్‌లను, పార్టీ సీనియర్లను రంగంలోకి దించారు. దీంతో క్షేత్రస్థాయిలో బూతుల వారీగా ఓటర్లపై నిఘా పెంచారు. ఆయా పోలింగ్ బూతుల పరిధిలో ఉన్న ఓటర్లలో ఏఏ సామాజిక వర్గాలకు చెందిన ఓటర్లు ఎంతమంది ఉన్నారు? వారిలో ఎంతమంది అందుబాటులో ఉన్నారు? లేని వారు ఎంతమంది? తదితర వివరాలను పూర్తిగా జల్లెడ పట్టారు.

అధికార పార్టీ వైపు ఆకర్శించేందుకు

బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన ఓటర్లు ఎంతమంది? పార్టీలకు సంబంధం లేని ఓటర్లు ఎంతమంది ఉన్నారనే అంశాలను అధ్యయనం చేశారు. దీంతో ఓటర్లను అధికార పార్టీ వైపు ఆకర్షించేందుకు సులువు అయింది. ప్రధానంగా బస్తీలలో ఉన్న చిన్న చిన్న సమస్యలను పరిష్కారం చేసుకుంటూ స్థానికులకు దగ్గరవుతూ వచ్చారు. వీధి లైట్లు, తాగునీరు తదితర అంశాలు మంత్రుల దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. బాధ్యతలు తీసుకున్నవారు ప్రతి ఒక్కరూ విధిగా నిర్దేశించిన ప్రదేశంలో ఉంటూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశలో ముందుకెళ్లాలని సూచించారు. పార్టీ వ్యూహాలు, అటు క్షేత్రస్థాయిలో కేడర్‌కు ఇచ్చిన దిశానిర్దేశం అన్నీ కలిసి పని చేయడంతో జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించగలిగింది. పోల్ మేనేజ్‌మెంట్‌లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంలో పీసీసీ చీఫ్ పాత్ర అత్యంత కీలకంగా నిలిచింది. రాబోయే రోజులలో కూడా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగంగా అమలు చేయడానికి ఈ ఫలితం ప్రేరణగా నిలుస్తుందని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఏదేమైనా తాజా విజయంతో జోరుమీదున్న కాంగ్రెస్, ఇదే ఊపులో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. న్యూఢిల్లీలో రాహుల్ గాంధీని కలిసినవారిలో సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్, ఏఐసీసీ తెలంగాణ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రోహిన్ రెడ్డి ఉన్నారు. వారంతా అనంతరం ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గేను కూడా కలుసుకున్నారు.

జమ్మూకశ్మీర్‌లో భారీ పేలుడు

మొదటిపేజీ తరువాయి

సేకరిస్తుండగా భారీ విస్ఫోటనం జరిగింది. ఇది ప్రమాదవశాత్తు జరిగిందని భావించినప్పటికీ, జైషేకు అనుబంధ సంస్థ అయిన పీపుల్స్ యాంటీ ఫాసిస్ట్ ఫోర్స్ ఈ దాడి తమ పనేనని ప్రకటించింది. అయితే, డీజీపీ దీనిని ఖండించారు. ఫరీదాబాద్ నుంచి స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలను ఫోరెన్సిక్ పరీక్షకు పంపించేందుకు సిద్ధం చేశామని, ఫోరెన్సిక్ సిబ్బంది అత్యంత జాగ్రత్తగా ఉన్నప్పటికీ, దురదృష్టవశాత్తు పేలుడు సంభవించిందని తెలిపారు. మృతి చెందిన తొమ్మిది మందిలో ముగ్గురు ఫోరెన్సిక్ సిబ్బంది, రాష్ట్ర వైద్య సంస్థకు చెందిన ఒకరు, ఇద్దరు క్రైమ్ ఫోటోగ్రాఫర్లు, ఇద్దరు రెవెన్యూ అధికారులు, ఒక టైలర్ ఉన్నారని పేర్కొన్నారు. 32 మంది గాయపడగా, వారికి చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు. పేలుడు ధాటికి పోలీస్ స్టేషన్ పూర్తిగా దెబ్బతిన్నదని, సమీపంలోని భవనాలు కూడా ప్రభావితమయ్యాయని తెలిపారు. నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన పేలుడుపై కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ స్పందించింది. ఈ దుర్ఘటనలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారని, 27 మంది పోలీసులు, ఇద్దరు రెవెన్యూ అధికారులు, ముగ్గురు పౌరులు గాయపడ్డారని పేర్కొంది. నౌగామ్ పేలుడుపై మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ (జమ్ము కశ్మీర్ డివిజన్) ప్రశాంత్ లోఖండే మాట్లాడుతూ, పేలుడు కారణంగా పోలీస్ స్టేషన్ భవనంతో పాటు చుట్టుపక్కల ఉన్న కొన్ని నిర్మాణాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు.

ఐ బొమ్మ నిర్వాహకుడు రవి అరెస్టు

మొదటిపేజీ తరువాయి

విడుదలైన సినిమాలను అదే రోజు వెబ్‌సైట్‌లో పెడుతూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ అంశం ప్రస్తావనకు వచ్చిన ప్రతిసారి కూడా వెబ్‌సైట్ పేరు సినిమా నిర్మాతల మధ్య చర్చకు వచ్చేది. పోలీసులకు నిర్మాతల మండలి ఫిర్యాదులు చేసేది. కానీ, ఇంత వరకు సీరియస్‌గా యాక్షన్ తీసుకున్నది లేదు. ఈ మధ్యకాలంలో సినిమా పరిశ్రమ నుంచి ఒత్తిడి రావడంతో పోలీసులు గట్టి చర్యలు ప్రారంభించారు. అందులో భాగంగా నెల రోజుల క్రితం కీలక ఓ ముఠాను అరెస్టు చేశారు. ఐదుగురు సభ్యులు ఉన్న ముఠాను అరెస్టు చేసిన సందర్భంగా అప్పటి సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ పైరసీ వెబ్‌సైట్‌లు ఎలాంటి టెక్నాలజీ ఉపయోగించినా సరే పట్టుకుంటామన్నారు. ముఖ్యంగా ఐ బొమ్మ వంటి సంస్థలను వదిలిపెట్టేదేలేదని హెచ్చరించారు. పోలీసులు ఈ హెచ్చరిక జారీ చేసిన వెంటనే ఐ బొమ్మ పోలీసులకు సవాల్ చేసింది. దమ్ముంటే తమను పట్టుకోవాలని ఛాలెంజ్ చేసింది. తమను పట్టుకుంటే ఎవరిని ఎక్కడ ఫోకస్ చేయాలో తమకు తెలుసని చెప్పుకొచ్చింది. తమ దగ్గర చాలా మంది ప్రైవేటు డేటా ఉందంటూ బెదిరింపులకు దిగింది. మొత్తాన్ని పోలీసులు కీలక వ్యక్తిని అరెస్టు చేశారు. కరేబియన్ దీవులలో ఉంటూ అక్కడి నుంచి ఈ పైరసీ సినిమాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తూ వచ్చారు.

ఫ్రాన్స్‌లో ఉంటూ చుక్కలు చూపించి

ఫ్రాన్స్ నుంచి వచ్చిన వెంటనే రవిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. థియేటర్లలో లేదా ఓటీటీలో సినిమా రిలీజ్ అయిన వెంటనే అప్‌లోడ్ చేస్తున్నాడు. దీనివల్ల సినిమా నిర్మాతలు భారీగా నష్టపోతున్నారు. ఇప్పటికే ఈ వెబ్‌సైట్‌పై వందల ఫిర్యాదులు ఉన్నాయి. వీళ్లంతా కూడా విదేశాలలో ఉంటూ సినిమాలు పైరసీ చేస్తుండటంతో పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నారు. అలాంటి వాళ్లు దేశానికి వచ్చినప్పుడు మాత్రమే అరెస్టు చేయగలుగుతున్నారు. పైరసీ ఈ స్థాయిలో పెరిగిపోవడానికి ఇది కూడా కారణమని పోలీసులు చెబుతున్నారు. రవి భార్య నుంచి విడాకులు తీసుకొని ఒంటరిగా ఉంటున్నాడు. ఫ్రాన్స్‌లో ఉంటూ వివిధ దేశాలలో తన నెట్‌వర్క్‌ను విస్తరించాడు. ముఖ్యంగా కరేబియన్ దీవుల నుంచి వెబ్‌సైట్‌ను మేనేజ్ చేస్తూ వచ్చాడు. ఈ విషయాలు తెలిసినప్పటికీ పోలీసులు ఏం చేయలేని పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ఆయన్ని అరెస్టు చేసిన తర్వాత కీలక విషయాలు తెలుసుకున్నారు. అతని వద్ద లెటెస్ట్ సినిమాలకు సంబంధించిన వివరాలు, ప్రింట్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఆయన అకౌంట్‌లో ఉన్న 3 కోట్ల రూపాయలను కూడా అధికారులు ఫ్రీజ్ చేశారు.

ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలపై ఫోకస్



- రాబోయే రోజులలో వేల ఉద్యోగాలు
- 'గ్లోబల్' సమ్మిట్ లో ఐటీ మంత్రి శ్రీధర్ బాబు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 15 : ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలలో ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న వేగవంతమైన మార్పులను తెలంగాణ తనకు అనుకూలంగా మార్చుకునే దిశగా పని చేస్తుందని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. గచ్చిబౌలి ఐఎస్బీ లో కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్, ఐఎస్‌బీ, ముంజాల్ ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ శనివారం నిర్వహించిన సమ్మిట్ లో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో గ్లోబల్ సప్లై చెయిన్ ఒత్తిడికి గురవుతున్న సందర్భంలో నమ్మకమైన తయారీ కేంద్రాల కోసం ప్రపంచం భారత్ వైపు చూస్తోందని, ఇది తెలంగాణకు పెద్ద అవకాశమని అన్నారు. నిరుడు దేశ రక్షణ ఉత్పత్తుల విలువ రూ.1.5 లక్షల కోట్లను దాటడం, రక్షణ ఎగుమతులు 12 శాతం వృద్ధి నమోదు చేయడం దేశ శక్తిని సూచిస్తోందని వివరించారు. 2047 నాటికి తెలంగాణను త్రీ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంలో ఏరోస్పేస్, డిఫెన్స్ రంగం కీలక భాగం కానుందని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో 25కి పైగా అంతర్జాతీయ, జాతీయ ఏరోస్పేస్ డిఫెన్స్ కంపెనీలు, 1,500కి పైగా ఎంఎస్ఎంఈలు తెలంగాణ బ్రాండ్‌ను ప్రపంచానికి తీసుకెళ్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ఏరోస్పేస్ ఎగుమతుల విలువ 2023-24లో రూ.15,900 కోట్లుగా ఉండగా, 2024-25లో తొలి తొమ్మిది నెలల్లోనే రూ.30,742 కోట్లకు పెరగడం ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల విజయాన్ని చూపిస్తోందని మంత్రి చెప్పారు.



వారణాసి సినిమా తన డ్రీమ్ ప్రాజెక్ట్. ఈ సినిమా కోసం ఎంత కష్టపడాలో అంత కష్టపడతాను. అందరూ గర్వపడేలా చేస్తాను. ముఖ్యంగా రాజమౌళిని. ఇది విడుదలైన తరవాత దేశమంతా గర్వంగా ఫీలవుతుంది. పౌరాణికం చేయమని నాన్న అడుగుతుండేవారు. ఆయన మాటలు ఎప్పుడూ వినలేదు. ఇప్పుడు ఆయన నా మాటలు వింటుంటారు.

- హీరో మహేశ్ బాబు



బీఆర్ఎస్ ను అధోగతిపాలు చేస్తున్నారు

- కాంగ్రెస్ పట్ల ప్రజలలో తీవ్ర వ్యతిరేకత ఉంది
- 'జనం బాట'లో మండిపడిన జాగృతి కవిత

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 15 : జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం చూశాక బీఆర్ఎస్ ప్రతిపక్షంగా సరైన పాత్ర పోషించటం లేదని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఎక్కడ చూసినా కాంగ్రెస్ పై ప్రజలలో వ్యతిరేకత ఉందని, అయినా, కాంగ్రెస్ ఎలా గెలిచిందని ప్రశ్నించారు. అనుకున్నంతగా ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పార్టీ పనిచేయకపోవడంతో, జాగృతి సంస్థ ప్రశ్నించే శక్తిగా, ప్రజల వజ్రాయుధంగా మారుతుందని అన్నారు. శనివారం నాడు మెదక్ జిల్లాలో జాగృతి జనంబాట సందర్భంగా కవిత మాట్లాడారు. బీఆర్ఎస్ వారు సోషల్ మీడియాలోనే యుద్ధం చేస్తున్నారు కానీ, ప్రజలలోకి రావటం లేదన్నారు. కృష్ణార్జునులు అనుకునేవాళ్లు ఒకరి జబ్బలు ఒకరు చరుచుకుంటున్నారని, కానీ పెద్ద ఎత్తున ప్రజల కోసం వారి సమస్యల కోసం పనిచేయటం లేదని చురకలంటించారు. హరీశ్ రావు తండ్రి మరణించినా కూడా పార్టీ కోసం టెలి కాన్ఫరెన్స్ లో మాట్లాడుతూ పని చేశారని అంటున్నారని, జూబ్లీహిల్స్‌లో ఓడిపోవటంతో హరీశ్ రావు ఉంటే ఫలితం వేరేలా ఉండేదని ప్రచారం చేస్తున్నారని అన్నారు. హరీశ్ రావు లేకపోతే కేసీఆర్ లేరని, తెలంగాణ ఉద్యమమే లేదన్నట్లుగా ప్రచారం చేస్తారని ధ్వజమెత్తారు. హరీశ్ అవినీతిని బయటపెట్టినా సరే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని అడిగారు. జిల్లా ఏర్పడి 12 యేండ్లు అయినప్పటికీ అభివృద్ధి ఫలాలు ఎందుకు దక్కడంలేదని ప్రశ్నించారు.

సోషల్ మీడియాలోనే కృష్ణార్జునల యుద్ధం

- రైతులు ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు
- పెద్దాయనకు కండ్లకు గంతలు కట్టి అరాచకాలు
- బీఆర్ఎస్ పార్టీపై మండిపడిన జాగృతి కవిత



ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ నవంబర్ 15 :- జాగృతి అధ్యక్షురాలు కవిత బీఆర్ఎస్‌పై, ముఖ్యంగా అగ్ర నాయకులపై తీవ్ర విమర్శలు ఎక్కుపెట్టారు. మెదక్ లో మీడియాతో మాట్లాడుతూ "మెదక్ నెక్స్ న్యూయార్క్ అవుతుందని అనుకున్నా కానీ, ఇక్కడి పరిస్థితులు చూసి ప్రజలు పడుతున్న ఇబ్బందులు చూస్తే ఇది ఏ నాయకుల పాలనో అర్థమైంది' అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ అధోగతికి కారణం కేసీఆర్‌ను చుట్టుముట్టిన కొందరు నాయకులేనని ఘాటుగా దుయ్యబట్టారు. తాను ఆరేండ్లు జాగృతిని నడిపానని, 20 యేండ్లు బీఆర్ఎస్ కోసం పని చేశానని గుర్తు చేశారు. తనను మోసం చేసిందే అరాచక నేతలని చెప్పా. 'ప్రతిపక్షం అన్న గుర్తింపు మాత్రమే ఉన్న నాయకులు' అని ఎద్దేవా చేశారు. కృష్ణార్జునులమంటూ ఒకరి జబ్బలు ఒకరు చరుచుకోవడం తప్ప ప్రజల కోసం ఒక్క అడుగు కూడా వేయని నాయకులతో పార్టీ ఎలా బాగుపడుతుందని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో 'ఫలానా అభ్యర్థిని పెడితే సైలెంట్ ఉంటాను' అని కాంగ్రెస్‌తో హరీశ్ రావు మాట్లాడారని కూడా ఆమె బహిర్గతం చేశారు. హరీశ్ రావు పై అవినీతి ఆరోపణలు వచ్చినా సీఎం చర్యలు తీసుకోకపోవడంపై, 'ఇద్దరి మధ్య ఏ అండర్ స్టాండింగ్ ఉందో ప్రజలకు చెప్పాల్సిందే' అన్నారు.

బలముంటే అజార్ కు టికెట్ ఎందుకివ్వలేదు?

- సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ప్రశ్న



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, నవంబర్15 : కాంగ్రెస్ పార్టీకి నిజంగా బలముంటే అజారుద్దీన్‌కు టికెట్ ఎందుకివ్వలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. శనివారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఉప ఎన్నిక సర్వేలలో రేవంత్ రెడ్డి నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రాబల్యం కంటే నవీన్ యాదవ్‌కు ప్రాబల్యం ఎక్కువ అని తేలిందన్నారు. కానీ, తానే గెలిచినట్లు రేవంత్ ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. ఒకవేళ నిజంగా ఆయన నేతృత్వంలో పని చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి బలముంటే అజారుద్దీన్‌కు ఎందుకు టికెట్ ఇవ్వలేదో చెప్పాలన్నారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికలో కూడా బీజేపీ గణేశ్‌ను పట్టుకొచ్చి టికెట్ ఇచ్చారని, గద్దర్‌ను వాడుకుని ఆయన బిడ్డకు టికెట్ నిరాకరించారన్నారు. సొంత పార్టీలో ఉన్నవారిని ఖతం చేస్తూ బీజేపీ, ఎంఐఎంకు కొమ్ముకాస్తున్నారన్నారు. పథకాలు అమలు చేయకున్నా గెలిచానని రేవంత్ రెడ్డి అనుకుంటే పొరపాటని అన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు మీద రేవంత్ రెడ్డి దాడి చేశారని, మీడియాను కూడా బెదిరింపులకు గురి చేశారని పేర్కొన్నారు. బండి సంజయ్‌తో కుమ్మక్కై బీజేపీ ఓట్లన్నీ బదిలీ చేసుకుని, బోగస్ ఓట్లతో గెలిచారని దాసోజు ధ్వజమెత్తారు.



నకిలీ సర్టిఫికెట్ల ముఠా అరెస్టు

- జిరాక్స్ కేంద్రంగా నకిలీ దందా

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, నవంబర్15 : నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న ముఠా గుట్టును మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు రట్టు చేసారు. ఈ సందర్భంగా మాదాపూర్ ఏసీపీ శ్రీధర్ మాట్లాడుతూ గచ్చిబౌలిలోని ఇందిరానగర్ లో ముగ్గురు వ్యక్తులు జిరాక్స్ కేంద్రంగా దందా నడుపుతున్నారు. పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్, నకిలీ పే బిల్స్, నకిలీ ఎక్స్పీరియన్స్ సర్టిఫికెట్, మార్క్స్ మెమోస్, పాన్ కార్డు లను సైతం నకిలీ తయారు చేస్తున్నారు. మహమ్మద్ సజీద్, గంట రాజీవ్ ను అరెస్ట్ చేసామని చెప్పారు. నిందితుల నుంచి కంప్యూటర్, సీపీయూ, మొబైల్స్, ఫేక్ మెమోలు, థెరపీ సర్టిఫికెట్స్, మెడికల్ రిపోర్ట్స్, ఫేక్ హోమ్ గార్డ్ ఐడి కార్డ్స్, జాబ్ ఎక్స్ పీరియన్స్ సర్టిఫికెట్స్ స్వాధీనం చేసుకున్నాం. వారి వద్ద సర్టిఫికెట్స్ పొందిన తొమ్మిది మంది వ్యక్తులను సైతం అదుపులోకి తీసుకొని విచారిస్తున్నాం. గచ్చిబౌలి పరిధిలో భారీగా పీజీ హాస్టల్స్, ఐటీ కంపెనీలు ఉండడంతో భారీగా డిమాండ్ వుంది. ఫేక్ సర్టిఫికెట్స్ పట్ల ప్రజలు జాగ్రత్త గా ఉండాలని అన్నారు.



సీఎం రేవంత్ తో విన్ గ్రూప్ ఆసియా సీఈఓ భేటీ

- రాష్ట్రంలో కీలక పెట్టుబడుల గురించి ఆసక్తి

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్15 : తెలంగాణ ముఖ్యమంత్రితో విన్ గ్రూప్ ఆసియా సీఈఓ ఫామ్ సన్ చౌ శనివారం ఢిల్లీలో భేటీ అయ్యారు. ఈవీ తయారీ, పునరుత్పాదక ఇంధనం, భారత్ ఫ్యూచర్ సిటీలలో భారీ పెట్టుబడులపై ఆసక్తి చూపారు. రాష్ట్రంలో కీలక ప్రాజెక్టులను స్థాపించడం గునించి ఆరా తీశారు. తెలంగాణలో ఎలక్ట్రిక్ వెహికల్ తయారీ యూనిట్లు, బ్యాటరీ స్టోరేజ్ సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్న విన్ గ్రూప్ తపనను తెలియజేశారు. సుస్థిర, స్వచ్ఛ ఇంధన విస్తరణ దిశగా తెలంగాణ స్టేట్ చేస్తున్న కృషికి అనుగుణంగా, సౌర, పవన ఇంధన ప్రాజెక్టులలో అవకాశాలను అన్వేషించడంపై కూడా ఆయన ఆసక్తి కనబరిచారు. ప్రతిపాదిత 'భారత్ ఫ్యూచర్ సిటీ'పై సీఈఓ ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. దాని దార్శనిక సామర్థ్యాన్ని అభినందిస్తూ, దాని అభివృద్ధిలో పెట్టుబడి పెట్టడానికి విన్‌గ్రూప్ సిద్ధంగా ఉందని ఆయన తెలియజేశారు. డిసెంబర్ 89 తేదీలలో జరగనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025'లో పాల్గొనాల్సిందిగా ఫామ్ సన్ చౌ, విన్‌గ్రూప్ చైర్మన్ శ్రీ ఫామ్ నట్ వుహోంగ్‌లను ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

రాష్ట్రవ్యాప్తంగా వేగంగా ఓటరు జాబితా సవరణ

- సీఈఓ సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, నవంబర్15 : రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సి. సుదర్శన్ రెడ్డి శనివారం నాడు తెలంగాణలోని అందరు ఈఆర్ఓలు, ఏఆర్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఓటరు జాబితా ప్రత్యేక తీవ్ర సవరణ కార్యక్రమం పురోగతి, పెండింగ్‌లో ఉన్న అంశాలను సమీక్షించారు. ఓటర్ జాబితా నవీకరణ, క్లెయిమ్-అభ్యంతరాల పరిష్కారం, ఫీల్డ్ ధ్రువీకరణ, డేటా ఎంట్రీ ఖచ్చితత్వం వంటి ముఖ్య అంశాలపై అధికారులు నివేదికలు సమర్పించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కట్టుబడి అమలు చేయాలని, ప్రతి దశలోనూ ఖచ్చితత్వం, జాగ్రత్త, సమయపాలన పాటించాల్సిందే అని సూచించారు. సిర్ కు సంబంధించిన పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేసి, ఓటర్ జాబితా నాణ్యతను మరింత మెరుగుపర్చే దిశగా శ్రద్ధగా పనిచేయాలని ఆదేశించారు. ఖచ్చితమైన, లోపరహిత ఓటర్ జాబితా ఎన్నికల నిర్వహణకు అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఈఓ హరి సింగ్, ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



చేయి చేయి కలుపుతాం అవినీతిని అరికడతాం

- హౌసింగ్ కార్పొరేషన్ సిబ్బంది ప్రతిన

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, నవంబర్15 : తెలంగాణ ప్రభుత్వ జీరో టాలెరెన్స్ విధానానికి అనుగుణంగా విధులు నిర్వహించాలన్న సంకల్పంతో హౌసింగ్ కార్పొరేషన్ లో పలు వినూత్న కార్యక్రమాలను చేపట్టారు. అవినీతి, లంచం అనేవి లేకుండా పూర్తి పారదర్శకంగా గృహ నిర్మాణ పథకాల లబ్ధి చేకూరుతుందనే అంశంపై ప్రజలకు కూడా అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో హైదరాబాద్ లోని కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో శనివారం నాడు సంస్థ ఎండీ వీపీ గౌతం నేతృత్వంలో దీనికి అనుగుణంగా ప్రతిజ్ఞ చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రాజెక్టు డైరక్టర్లు, మేనేజర్లు అసిస్టెంట్ మేనేజర్లు ప్రధాన కార్యాలయంలోని ఉన్నతాధికారులు, సిబ్బంది అందరూ కలిసి సాయంత్రం అవినీతికి వ్యతిరేకంగా లిబర్టీ సమీపంలో మానవహారం నిర్వహించారు. కాల్ సెంటర్, హెల్ప్ డెస్క్ తదితర వివరాలతో కూడిన కార్యక్రమాల పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లాలలోనూ హౌసింగ్ ప్రాజెక్టు డైరక్టర్ల ఆధ్వర్యంలో కూడా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ పాదయాత్ర, మానవహారం కార్యక్రమంలో కార్పొరేషన్ ఉన్నతాధికారులు ఈశ్వరయ్య, చైతన్య కుమార్, భాస్కర రెడ్డి, విజయకుమార్, మమత, శ్రీదేవి పాల్గొన్నారు.



అద్భుతంగా కాలిఫోర్నియా వీక్షణం

- 159వ అంతర్జాల సాహితీ సమావేశం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, నవంబర్15 : కాలిఫోర్నియా వీక్షణం 159వ అంతర్జాల సాహితీ సమావేశం శనివారం ఉదయం 630కు నిర్వాహకురాలు డాక్టర్ గీతామాధవి స్వాగత వచనాలతో ప్రారంభమైంది. పారుపల్లి కోదండరామయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు భాషను రక్షించుకోవాలంటే పాఠశాల విద్య ప్రాథమిక స్థాయినుండి ఉన్నత స్థాయి సాంకేతిక విద్యవరకూ తెలుగు మాధ్యమంలోనే ఉండాలన్నారు. ముందుగా తలిదండ్రులు పిల్లలకు తెలుగు భాషే నేర్పాలన్నారు. తెలుగు భాషలో మాట్లాడడం అవమానంగా భావించే దుస్థితి పోవాలన్నారు. జనంలో కదలిక రావాలని, ఉద్యమం చేయాలని చెప్పారు. అనంతరం రాజేంద్ర ప్రసాద్, బిటవరం శ్రీమన్నారాయణ కవిసమ్మేళనం నిర్వహించారు. డా.గీతామాదవి 'క్రిమి సంహారం' అనే చక్కని కవితను చదివి ఆకట్టుకున్నారు. తరువాత ప్రముఖ కవి కొండ్రెడ్డి నాగిరెడ్డి కవితను పాడి అలరించారు. గంటా మనోహర రెడ్డి ఘంటారావం మినీ కవితలను భావస్ఫోరకంగా చదివారు. వైరాగ్యం ప్రభాకర్ జననిమించిన దైవం తెలుగు మించిన భాష ఏమిటంటూ తెలుగుభాషా ప్రాశస్త్యాన్ని తెలిపారు. రామకృష్ణ చంద్రమౌళి ఇటీవల స్వర్గస్తులైన లోకకవి అందేశ్రీకి అక్షర నివాళులు సమర్పించారు. ఇంకా చాలా మంది తమ కవితలను వినిపించారు.

గెలిచి 24 గంటలు గడవకముందే రౌడీయిజం

- గాయపడిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త రాకేశ్
- పరామర్శించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, నవంబర్15 : జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితాలు వచ్చి 24 గంటలు గడవకముందే కాంగ్రెస్ పార్టీ రౌడీయిజం, గుండాయిజం మొదలు పెట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తపై జరిగిన దాడిని ఖండించారు. తాము పదేండ్లు అధికారంలో ఉన్నామని, ఎన్నో ఉప ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపొందినా ఎప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ వలే ప్రతిపక్షాలపై దాడులు చేయలేదన్నారు. జూబ్లీహిల్స్ రహమత్‌నగర్‌లో కాంగ్రెస్ గూండాల దాడిలో గాయపడిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త రాకేశ్‌ను కేటీఆర్ పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కార్యకర్తలు ఎవ్వరూ దిగులు చెందొద్దని, కాంగ్రెస్ చేస్తున్న రౌడీయిజాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీలోని ప్రతి కార్యకర్తను కంటికిరెప్పలా కాపాడుకుంటామని చెప్పారు. ఆపదొస్తే అన్నివేళలలో అండగా ఉంటాని తెలిపారు. తమ కార్యకర్తపై జరిగిన దాడికి కాంగ్రెస్ బాధ్యత తీసుకోవాలన్నారు. దొంగ ఓట్లు, గూండా గిరి చేసి, డబ్బులు పంచి కాంగ్రెస్ పార్టీ గెలిచిందని చెప్పారు. తమకు గతంలో 80 వేలు ఓట్లు వస్తే ఉప ఎన్నికలో 75 వేల ఓట్లు వచ్చాయని, ఇన్ని కుట్రలు, రిగ్గింగ్ చేసినా మా ఓట్లు కేవలం ఐదు వేలు మాత్రమే తగ్గాయన్నారు. కచ్చితంగా భవిష్యత్తులో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరవేసి తీరుతామని స్పష్టం చేశారు. తాను అహంకారం తగ్గించుకోవాలన్న రేవంత్ వ్యాఖ్యలపై స్పందిస్తూ శుక్రవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ చేసిన విజయోత్సవ ఊరేగింపుతోనే ఎవరిది అహంకారమో తేలిపోయిందని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ గుండాయిజం మానుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

ఫెడరేషన్ పేరు వాడితే న్యాయపర చర్యలు

- టీడబ్ల్యూజేఎఫ్ నేతలు పి రాంచందర్, బి. బసవపున్నయ్య

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, నవంబర్15 : తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) పేర శనివారం హైదరాబాద్ లోని ఎల్బీ నగర్ లో సమావేశం ఏర్పాటు చేసి వర్కింగ్ జర్నలిస్టులను మోసం చేసిన మామిడి సోమయ్య చర్యలను టీడబ్ల్యూజేఎఫ్ మహాసభల అడ్ హాక్ కమిటీ కన్వీనర్, సీనియర్ ఉపాధక్షులు పి రాంచందర్, ప్రధానకార్యదర్శి బి. బసవపున్నయ్య ఖండించారు. నాన్ వర్కింగ్ జర్నలిస్టులకు వర్కింగ్ జర్నలిస్టుల పేర సమావేశం పెట్టడాన్ని తప్పుబట్టారు. ఫెడరేషన్ పేరు వాడితే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. దొంగ సభ్యత్వం చేయడం, సభ్యత్వ రుసుం సొంత అవసరాలకు వాడుకోవడం, లెక్కలు చెప్పమంటే సంఘాన్ని చీల్చేందుకు యత్నించడాన్ని ఖండించారు. అసలైన ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఈనెల 12న, విస్తృత స్థాయి సమావేశం ఈనెల 13న ఇప్పటికే జరిగాయని అన్నారు. ఇందులో వందలాది మంది వర్కింగ్ జర్నలిస్టులు పాల్గొన్నారని గుర్తు చేశారు. మామిడి సోమయ్య, పులిపల్పుల ఆనందం, బండి విజయ్ కుమార్, వల్లాల జగన్, తన్నీరు శ్రీనివాస్, కుడితూడి బాపూరావు రాష్ట్ర విస్తృత సమావేశం ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దుచేస్తూ వారిని శాశ్వతంగా బహిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. మరోసారి ఫెడరేషన్ పేరు వాడితే సివిల్, క్రిమినల్ చర్యలకు మెనుకాడబోమని హెచ్చరించారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.



మహేశ్ బాబుతో తెరకెక్కిస్తున్న 'వారణాసి' సినిమా మొదలు పెట్టేటప్పుడు రామాయణంలో ముఖ్యమైన ఘట్టం తీస్తున్నానని అస్సలు అనుకోలేదు. కానీ ఒక్కొక్క డైలాగ్, ఒక్కో సీన్ రాస్తుంటే నేను నేల మీద నడవడం లేదు, గాల్లో ఉన్నానని అనిపించింది. మహేశ్‌కు రాముడి వేషం వేసి, ఫొటో షూట్ చేస్తుంటే గూస్‌బంప్స్ వచ్చాయి.
- దర్శకుడు ఎస్ఎస్‌రాజమౌళి

ఒక ఎన్నిక .. వంద ప్రశ్నలకు జవాబు

సీదీ బాత్



ఎస్ కే జకీర్
9052631212

కొత్త యేడాదిలో సీఎం రేవంత్‌రెడ్డి తన మార్కు పాలన చూపించబోతున్నారని పార్టీ వర్గాలలో ప్రచారం జరుగుతోంది. విజన్ 2047 అమలుపైన సీఎం రేవంత్ నిశిత దృష్టి సారించనున్నారు. అభివృద్ధి ప్రణాళికలతో ప్రభుత్వ ఆదాయాన్ని పెంచి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని ఎన్నికల వేళ ప్రకటించిన రేవంత్ దానికి అనుగుణంగా మూసీ రివర్ ఫ్రంట్, ఫోర్త్ సిటీ ప్రాజెక్టులను చేపట్టారు. అన్ని వర్గాల నుంచి సరైన సహకారం లేకపోవడంతో ఆ రెండు ప్రాజెక్టులూ ప్రణాళికల వద్దే ఆగిపోయాయి. ఇప్పడు రేవంత్ వాటిని పట్టాలెక్కించనున్నారు.

ఒక అరుదైన దృశ్యమిది. ఒక ఎన్నిక, వంద ప్రశ్నలకు జవాబు అయ్యింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని పటిష్ఠపరచింది. దాదాపు రెండేండ్లుగా ఎదుర్కుంటున్న అనేక ప్రశ్నలకు ఒక ఉపఎన్నికతో ఆయన సమాధానమిచ్చినట్లయ్యింది. పార్టీ లోపలా, వెలుపలా చెలరేగుతున్న సవాలక్ష సందేహాలను ఒక్క ఫలితంతో తుడిచి పెట్టగలిగారు. రాజకీయాలలో చాకచక్యం,చాణక్యం ఎవరికీ సొంతం కాదని, సుదీర్ఘ రాజకీయ అనుభవంతోనే అవి రావని రేవంత్ రెడ్డి పని తీరు రుజువు చేసింది. కేసీఆర్ ను మించిన వ్యూహకర్తగా రేవంత్ రుజువు చేసుకున్నారు. సొంత పార్టీ కాంగ్రెస్ లో తనపై అసూయా ద్వేషాలతో రగిలిపోతున్నవారికి, ఇటు, తరచూ పార్టీ హైకమాండ్ కు లేఖలు రాస్తున్నవారికి, పదవులు రాక అసమ్మతివాదంతో ఊగిపోతున్నవారికి, తమ నియోజకవర్గాలలో తామే సామంతరాజులుగా వెలిగిపోవాలనుకుంటున్న వారికి, అటు కాంగ్రెస్ ను కబళించాలని, సీఎం పదవి నుంచి తనను తొలగించాలని కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతున్న ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ నాయకులు కేటీఆర్, హరీశ్ రావు తదితరులకు రేవంత్ గట్టి జవాబు ఇచ్చారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ను ఏమీ అనకుండానే గాలి తీసిపారేశారు.'పాపం ఆయన ఆరోగ్యం అంతంత మాత్రంగానే ఉంది.పైగా క్రియాశీల రాజకీయాలలో లేరు. ఆయన గురించి మాట్లాడడం సబబు కాదు' అని జాలి చూపారు.

బీఆర్ఎస్ పుంజుకునే అవకాశాలూ తక్కువే

తెలంగాణ రాజకీయ రంగస్థలంపై కనిపిస్తున్న రెండు ప్రతిపక్షాలలో ఒకటి ఇంచుమించు మైదానాన్ని వదిలిపెట్టింది. రెండో పార్టీ జీవన్మరణ సమస్యతో కొట్టుమిట్టాడుతోంది. మొదటి పార్టీ బీజేపీ. రెండవది బీఆర్ఎస్. తమ ప్రత్యర్థులు ఇద్దరు ఉన్నప్పుడు ముందుగా ఒకరిని నిర్మూలిస్తే, మరొకరిని సులభంగా నిర్వీర్యం చేయవచ్చునని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. బీజేపీ ఇప్పుడప్పుడే కోలుకోదు. బీఆర్ఎస్ పుంజుకునే అవకాశాలూ తక్కువే. పైగా ఇపుడు మరో పది, పదిహేను మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరేందుకు సన్నాహాలలో ఉన్నట్టుగా నవంబర్ 15 న ఒక పత్రిక ఒక కథనాన్ని ప్రచురించింది. త్వరలో కాంగ్రెస్ లో బీఆర్ఎస్ శాసనసభాపక్షం విలీనం తథ్యమనే సూచనలు కనిపిస్తున్నట్టుగానూ ఆ కథనంలో పేర్కొన్నారు.

'బండి' వ్యాఖ్యల కలకలం

'ఈ ఎన్నిక మొలతాడు ఉన్నోళ్లకు, మొలతాడు లేనోళ్లకు పోటీ. ఈ ఎన్నికలో 80 శాతమున్న హిందువులు గెలుస్తరా? లేక 20 శాతమున్న ముస్లింలు గెలుస్తరా? హిందువుల పక్షాన బీజేపీ, ముస్లింల పక్షాన కాంగ్రెస్ ఉన్నది. తలనైనా నరుక్కుంటా కానీ ముస్లిం టోపీ పెట్టుకోను. నేను హిందువును, నమాజ్ చేస్తూ నటించను' అంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ జూబ్లీహిల్స్ ప్రజలను విభజించి పారేశారు. దేశవ్యాప్తంగా ఉన్న విద్వేషపూరిత వాతావరణానికి ఆయన ఈ ఉప ఎన్నిక ప్రచారం సందర్భంగా మరింత ఆజ్యం పోశారు. ఒక వర్గాన్ని రెచ్చగొట్టేలా బీజేపీ నాయకుడు చేసిన వ్యాఖ్యలు సహజంగానే నియోజకవర్గంలోని ముస్లింలను ఆందోళనకు గురి చేసాయి. ముస్లింలంతా కాంగ్రెస్‌కు ఓటు వేసే విధంగా బండి సంజయ్ వ్యాఖ్యలు పరోక్షంగా ప్రేరేపించాయన్నది బీఆర్ఎస్ విశ్లేషణ.'దీంతో కాంగ్రెస్‌కు అనుకోని విజయం వరించింది. బీజేపీ తాను ఆత్మహత్య చేసుకొని, కాంగ్రెస్‌ను గెలిపించింది' అంటూ బీఆర్ఎస్ మీడియా దుమ్మెత్తి పోస్తున్నది.

బీజేపీ గల్లంతైందన్న బీఆర్ఎస్

ఉప ఎన్నిక ఫలితంతో తెలంగాణలో బీజేపీ గల్లంతైందని బీఆర్ఎస్ చెబుతోంది. రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీకి తామే ప్రత్యామ్నాయమని చెప్పుకునే అర్హతను బీజేపీ కోల్పోయిందనే చర్చ జరుగుతోంది. ఉపఎన్నికలో డిపాజిట్ కోల్పోవడం బీజేపీకి దారుణ పరాభవమే. గత ఎన్నికలో 25,866 ఓట్లు పొందిన దీపక్‌రెడ్డి ఈ సారి 17,061 ఓట్లే సాధించగలిగారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధి జూబ్లీహిల్స్ లో ఇలాంటి ఫలితం ఆ పార్టీ ఊహించిందే. ఎన్నిక ఫలితం తర్వాత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, కిషన్ రెడ్డి తదితరులు ఇదే విషయం చెబుతున్నారు. 'తెలంగాణలో బీజేపీ పని దాదాపు ఖతమైంది. నగర పరిధిలో పట్టున్న ఆ పార్టీకి జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో మాత్రం చావుదెబ్బ తగిలింది. తెలంగాణలో అధికార కాంగ్రెస్‌కు అసలైన ప్రత్యామ్నాయం బీఆర్ఎస్సేనని ఈ ఫలితం రుజువు చేసింది. లోక్ సభ ఎన్నికలలో ఏదో ఊపుతో వచ్చిన ఫలితాలను చూపించి ఇన్నాళ్లూ గప్పాలకుపోయిన నేతలకు గర్వభంగం తప్పలేదు. జూబ్లీహిల్స్ పరిధిలో ఎంపీ ఎన్నికలలో వచ్చిన ఓట్లలో మూడోవంతైనా ఇప్పుడు లభించలేదు' అంటూ బీఆర్ఎస్ అవహేళన చేస్తోంది.



కాంగ్రెస్ లోనూ శక్తిమంతుడిగా

అయితే, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నవీన్ యాదవ్ గెలుపుతో రేవంత్ తెలంగాణ ప్రభుత్వాధినేతగానే కాకుండా, కాంగ్రెస్ లోనూ శక్తిమంతుడిగా మారిపోయారు. బిహార్‌లో కాంగ్రెస్ చావు దెబ్బ తిన్న నేపథ్యంలో, రేవంత్ నేతృత్వంలో తెలంగాణలో ఆ పార్టీ అభ్యర్థి భారీ ఆధిక్యంతో విజయం సాధించడం సీఎంకు సానుకూల అంశం. రేవంత్ రెడ్డి నిర్ణయాలకు, ఆయన ప్రతిపాదించిన విజన్ 2047కు కాంగ్రెస్ అధిష్ఠానం మద్దతివ్వక తప్పని పరిస్థితి నెలకొన్నది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రభుత్వ పని తీరుకు రెఫరెండం అంటూ ప్రకటించిన కేటీఆర్ బోల్తా పడ్డారు. అధిష్ఠానం అండతో మంత్రివర్గంలో పెద్ద ఎత్తున ప్రక్షాళనకు సీఎం రేవంత్ ఉపక్రమించనున్నట్లు ఏఐసీసీ వర్గాలు చెబుతున్నాయి. డిసెంబర్ లేదా జనవరి మొదటి వారంలో కేబినెట్ పునర్వ్యవస్థీకరణ ఉంటుందన్న ప్రచారం జరుగుతోంది. మంత్రుల శాఖల పని తీరుపై ఇప్పటికే సమీక్షించిన హైకమాండ్ పలువురు సీనియర్ మంత్రులు తమ శాఖల నిర్వహణలో వెనుకబడినట్లుగా భావిస్తోంది. కీలక శాఖలలో పనితీరు బాగా లేకపోవడంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందన్న అభిప్రాయాన్నీ వ్యక్తం చేసింది. దీంతో, రేవంత్ ఆయా మంత్రుల నుంచి కీలక శాఖలను తప్పించనున్నట్లు చెబుతున్నారు. అలాగే, కొందరు మంత్రుల శాఖల పని తీరుతో పాటు ఆయా మంత్రుల వ్యవహార శైలిపైనా విమర్శలున్నాయి. వారి స్థానంలో కొత్త మంత్రులను నియమించేందుకూ ఆస్కారం ఉంది.

రెండేళ్లు పూర్తి చేసుకోబోతున్నారు

కాగా, డిసెంబరులో ముఖ్యమంత్రిగా రేవంత్ రెండేళ్లు పూర్తి చేసుకోబోతున్నారు. ఒక జాతీయ పార్టీ ప్రభుత్వాధినేతగా మంత్రులు, పాలనపైన పట్టు సాధించడానికే ఆయనకు ఈ సమయం సరిపోయింది. అటు అధిష్ఠానాన్ని, ఇటు పార్టీని, సీనియర్ మంత్రులనూ అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సి వచ్చింది. ఈ క్రమంలో పలు విషయాలలో సీఎం రేవంత్ తగ్గవలసి వచ్చింది. పలు శాఖలలో మంత్రుల పనితీరుతో ప్రభుత్వానికి ఇబ్బందులు ఏర్పడినా భరించాల్సి వచ్చింది. మరోవైపు, ప్రతిపక్ష నేతలు సీఎం రేవంత్‌రెడ్డిపై ఇష్టమొచ్చినట్లు ఆరోపణలు చేస్తున్నా తిప్పి కొట్టడానికి ఆయా మంత్రులు ముందుకు రావడం లేదు. ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పి కొట్టడంలో,ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన ప్రచారాన్ని ప్రజలదాకా తీసుకెళ్లడంలో పార్టీ యంత్రాంగం సహకారం ఆశించిన మేరకు లేదు. సహకారం అందించక పోగా ఫెయిల్యూర్ సీఎం అన్న ప్రచారాన్ని పలువురు మంత్రులు, నేతలు అధిష్ఠానం దాకా తీసుకెళ్లారన్న వార్తలూ వచ్చాయి. అధికారంలోకి వచ్చే నాటికే రాష్ట్ర అభివృద్ధిపై తన విజన్ ఏమిటో ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డికి ఈ పరిణామాలు అడ్డంకులుగా మారాయి.

అభ్యర్థి ఎంపిక నుంచీ గెలుపు దాకా

అభ్యర్థి ఎంపిక నుంచీ గెలుపు దాకా సీఎం వ్యూహాత్మకంగా వ్యవహరించారు. బీసీ నేత, స్థానికంగా పట్టున్న నాయకుడు నవీన్‌యాదవ్‌ను అభ్యర్థిగా అధిష్ఠానానికి సిఫార్సు చేశారు. షెడ్యూల్ విడుదలకు ముందే మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, వివేక్ వెంకటస్వామికి బాధ్యతలు అప్పగించారు. కార్పొరేషన్ల చైర్మన్లను డివిజన్ల వారీ ఇన్‌చార్జులుగా నియమించి వారికి అటాచ్ చేశారు. బూత్ స్థాయి ఏజెంట్లను నియమించి పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేసారు. స్థానికులను విస్తృతంగా కలిసిపోతూ సమస్యలు తెలుసుకుని పరిష్కరించే ప్రయత్నం చేశారు. ఒకట్రెండు సర్వేలు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపడంతో రేవంత్ రెడ్డి అప్రమత్తమయ్యారు.మంత్రులు, పార్టీ నేతలనూ అలర్ట్ చేశారు. డివిజన్ల వారీగా మంత్రులకు బాధ్యతలు అప్పగించి ప్రచార ఉధృతిని పెంచారు. తానూ స్వయంగా రంగంలోకి దిగి ప్రచారాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లారు. కొత్త యేడాదిలో సీఎం రేవంత్‌రెడ్డి తన మార్కు పాలన చూపించబోతున్నారని పార్టీ వర్గాలలో ప్రచారం జరుగుతోంది. విజన్ 2047 అమలుపైన సీఎం రేవంత్ నిశిత దృష్టిసారించనున్నారు. అభివృద్ధి ప్రణాళికలతో ప్రభుత్వ ఆదాయాన్ని పెంచి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని ఎన్నికల వేళ ప్రకటించిన రేవంత్ దానికి అనుగుణంగా మూసీ రివర్ ఫ్రంట్, ఫోర్త్ సిటీ ప్రాజెక్టులను చేపట్టారు. అన్ని వర్గాల నుంచి సరైన సహకారం లేకపోవడంతో ఆ రెండు ప్రాజెక్టులూ ప్రణాళికల వద్దే ఆగిపోయాయి. ఇప్పుడు రేవంత్ వాటిని పట్టాలెక్కించనున్నారు.

నాటి నుంచి నేటి దాకా

2001-02లో టీఆర్ఎస్ తో తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన రేవంత్ రెడ్డి అనూహ్యంగా తెలంగాణలో కాంగ్రెస్ విజయానికి కారకుడయ్యారు. ఆయన ఏబీవీపీ మాజీ కార్యకర్త. తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే. 2008లో టిడిపిలో చేరారు. తొమ్మిదేండ్ల తరువాత కాంగ్రెస్ లో చేరారు. 'బయటి వ్యక్తి' అని ముద్ర పడినప్పటికీ, సోనియాగాంధీ కుటుంబం మద్దతు లభించింది. 'ఇక నుంచి నా జీవిత లక్ష్యం కేసీఆర్‌ను అధికారం నుంచి దింపడమే' అని రేవంత్ రెడ్డి గర్జించారు. తెలంగాణ హైకోర్టు 2015 జూలైలో చర్లపల్లి జైలు నుంచి బెయిల్ మంజూరు చేసిన తర్వాత హైదరాబాద్‌లో జరిగిన రోడ్ షోలో ఆయన ఈ మాట అన్నారు. లక్ష్యాన్ని సాధించడానికి ఆయనకు ఎనిదేండ్ల ఐదు నెలలు పట్టింది. రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కాకలుతీరిన రాజకీయ నాయకుడు కేసీఆర్ ను గద్దె దింపడం సులభమైన వ్యవహారం కాదు. కేసీఆర్ కన్నా వేగంగా ఆలోచించి, అంతకన్నా వేగంగా వాటిని అమలు చేయడం వల్లనే రేవంత్ సక్సెస్ అయ్యారు.


(వ్యాస రచయిత సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్)

మూడో వంతు కూడా రాలేదు

2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో కిషన్‌రెడ్డికి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 64,673 ఓట్లు వచ్చాయి. కానీ, ఇప్పుడు 17 వేల ఓట్లే వచ్చాయి. మూడో వంతు కూడా రాలేదు.'బీజేపీ-కాంగ్రెస్ మధ్య కుదిరిన రహస్య ఒప్పందం ఫలితంగా ఈ ఓట్లన్నీ కాంగ్రెస్‌కే మళ్లినవి. అందుకే కాంగ్రెస్‌కు ఊహించని విజయం వరించింది' అన్నది బీఆర్ఎస్ ఆరోపణ. అభ్యర్థి ప్రకటన మొదలు, ప్రచారం, పోలింగ్ వరకు బీజేపీ పని తీరులో అసలు పస లేదు. ప్రస్తుత అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి గతంలోనూ పోటీచేశారు.అభ్యర్థి ప్రకటన విషయంలో బీజేపీ అగ్రనాయకులు జాప్యం చేశారు. బీసీ అభ్యర్థిని నిలబెట్టకపోవడం, ఆలస్యంగా అభ్యర్థిని ప్రకటించడం తెలిసిందే. బీసీ అభ్యర్థికి టికెట్ ఇచ్చి ఉంటే ఫలితం మరోలా ఉండేదని, కావాలనే రెడ్డి అభ్యర్థిని నిలబెట్టారనే వాదన వినిపిస్తున్నది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మినహా ముఖ్యనేతలెవరూ ప్రచారానికి రాలేదు.ఎంపీ ధర్మపురి అర్వింద్ జూబ్లీహిల్స్ వైపే చూడలేదు. స్టార్ క్యాంపెయినర్లను ప్రకటించినా ఒక్కరూ వచ్చింది లేదు. కిషన్‌రెడ్డి గల్లీ గల్లీ తిరిగి ప్రచారం చేసినా ప్రజలు ఖాతరు చేయలేదు.'బీఆర్ఎస్‌కు పరిస్థితి అనుకూలంగా ఉన్నదన్న టాక్ వినిపిస్తున్న దశలో పోలింగ్‌కు నాలుగు రోజుల ముందు కేంద్ర మంత్రి బండి సంజయ్ మణిపూర్ నుంచి అకస్మాత్తుగా వచ్చి ప్రచారం చేశారు. ముస్లిం ప్రాబల్యప్రాంతంలో వివాదస్పద వ్యాఖ్యలు చేసి కాంగ్రెస్‌కు పరోక్షంగా సహకరించారు' అని కేసీఆర్ పార్టీ విశ్లేషణ.



ఉద్యమాలతో కొత్త దోపిడీదారులు...



బీఎస్. రాములు
83319 66987

ఒక ఉద్యమకారుడిగా అనేక ఉద్యమాలు చూసాను. అనేక ఉద్యమాలు చేసాను. ప్రజల అభివృద్ధి కోసం అంటూ ప్రారంభమైన ఉద్యమాలు ప్రజలకు అభివృద్ధి అందించలేదు. రాజ్యాధికారం కోసం అంటూ ఉరికించిన ఉద్యమాలతో అటు రాజ్యాధికారం రాకపోగా వేలాది మంది చావులకు లక్షలాది మంది నిర్బంధాలకు, కేసులకు అత్యాచారాలకు బలయ్యారు. మతం పేరు చెప్పి మంటలలోకి తోసి రాజ్యానికెక్కి అభివృద్ధి ఏది? అని అడుగితే భజనలు చేసి బతకండని ప్రబోధిస్తున్నారు. 'ఏ ఉద్యమం చూసినా ఏమున్నది గర్వకారణం? సమస్తం అగ్రకులాలు , దోపిడీదారులు రాజ్యాలు ఏలుతున్నారు, ఏ మత ప్రజలైతేనేం పేదరికంతో కునారిల్లుతున్నారు.' ఈ మధ్య కాలంలో దేశవ్యాప్తంగా తిరిగి ఉద్యమాలు తలెత్తుతున్నాయి. అలా రాయలసీమ తనను తాను తెలుసుకోవాలని సమీక్ష ఒకటి నవంబర్ 16న 'దగా పడ్డ రాయలసీమకు వందేళ్లు' పేరిట కర్నూలులో సదస్సు తలపెట్టారు. మద్రాసు రాష్ట్రంలోని ప్రాంతాలైన ఆంధ్ర, రాయలసీమ ఒక రాష్ట్రం గా ఏర్పడాలనుకున్నారు. రాయలసీమవారు మద్రాసులోనే వుండాలనుకున్నారు. 'మనం వేరే రాష్టంగా కలిసి వుందామని' కోస్తాంధ్రవారు రాయలసీమవారితో చర్చలు చేసి అలా కలిసి వందేళ్ల క్రితం ఒక ఒప్పందం కుదుర్చుకున్నారు. నాడు, కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు ఆంధ్ర పత్రిక, అమృతాంజన్ యజమాని తన ఇంటికి ముంగట శ్రీబాగ్ అని రాసుకున్నాడు. 'శ్రీబాగ్ ఒప్పందం' అని ఉండాలని పట్టు పట్టాడు. అలా అది 'శ్రీబాగ్ ఒప్పందంగా' ప్రచారంలోకి వచ్చింది.



రాయలసీమవారు వ్యతిరేకించారు

మద్రాసు నుండి విడివడి ఆంధ్రరాష్ట్రం కావాలని ఆంధ్రులు కోరితే రాయలసీమవారు వ్యతిరేకించారు. వారు మద్రాసులోనే ఉండదలిచారు. అందువల్ల రాయలసీమవారికి రక్షణలు కల్పిస్తూ చేసుకున్న ఆ ఒప్పందం జరిగి వందేళ్లయింది. ఈ సందర్భంగా రాయలసీమవారు సదస్సు ఏర్పాటు చేసుకున్నారు. ఇలాంటి ఒప్పందాలను ఎవరికి వారు ఎప్పటికప్పుడు సమీక్షించడం అవసరం. రాయలసీమ వారు గత వందేళ్లలో హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, రాయచూర్, బళ్లారి, ముంబై విజయవాడ వలస వెళ్లి లక్షలాది మంది బాగుపడ్డారు. బతుకు గెలుచుకున్నారు. గత వందేళ్లలో ఇన్ని అవకాశాలు తెలంగాణవారికి రాలేదు. తెలంగాణవారికి హైదరాబాద్ కూడా వందేళ్లలో వారిది కాకుండా పోయింది. తెలంగాణ వందేళ్లుగా నిరంతర వలసల ముంపుకు గురైంది. పొట్ట చేత పట్టుకొని వలస వెళ్లిన తెలంగాణ ప్రజలు కూలీలుగా బతుకులు బతుకుతున్నారు. 1955 పెద్ద మనుషుల ఒప్పందం కాశ్మీర్ 371 ఆర్టికల్ వంటిది. తెలంగాణ భూములు ఇతర ప్రాంతాలవారు కొనడానికి వీల్లేదనేది అందులో ఒకటి. దానిని పూర్తిగా ఉల్లంఘించారు. 1969 నాటి ఉద్యమాల ఒప్పందాలతో రాష్ట్రాన్ని ఐదు జోన్లుగా చేసారు. హైదరాబాద్ యూనివర్సిటీ అని పెట్టారు. అది తెలంగాణ భూమిలో తెలంగాణ విద్యార్థులకు చొరలేని సంస్థగా మారింది. ఐదు జోన్ల పద్ధతి పెట్టి ఉద్యోగాలు జోన్ లవారీగా నియామకాలన్నారు. దాన్ని వమ్ము చేస్తూ ప్రభుత్వాలు అనేక కార్పోరేషన్లు ఏర్పాటు చేసి జోన్ విధానం వర్తించదని ఇతర ప్రాంతాల వారితో నింపారు. పాలమూరు ప్రజలు 170 కిలో మీటర్లు తమ జిల్లాలో కృష్ణా నది ప్రవహిస్తున్నా ప్రాజెక్టులు కట్టక ఆంధ్రకు నీరు తరలించుక పోవడంతో దేశవ్యాప్తంగా పాలమూరు లేబరుగా వలసలు సాగించారు. తెలంగాణ ప్రజలు స్థానికంగా ఉండి పని చేసుకొని బతుకుదామంటే బిల్డర్లు కాంట్రాక్టర్లు, కూలీలు పెరగకుండా బిహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా పేద ప్రజల వలసలు పెరిగాయి. ఇలా కూలీల రంగంలో కూడా తెలంగాణ మరింత వంచనకు గురైంది.

నక్సలైట్ నిర్బంధాల పేరిట అరిగోస

తెలంగాణ ప్రజలు గల్ఫ్ వలసల బాట పట్టారు. గల్ఫ్ వలసలతో బావుకున్నదెంతో వారికే తెలియదు. కుటుంబాలు మాత్రం విచ్ఛిన్నమయ్యాయి. కోస్తాంధ్ర ప్రజలు ఎక్కడికి వలస పోయినా చక్కగా జీవితాలు గెలుచుకున్నారు. నెల్లూరువారు విశాఖను ఆక్రమించారు. ఉత్తరాంధ్ర కోస్తాంధ్రులచే ఆక్రమించబడింది. కోస్తాంధ్రవారు తెలంగాణలో భూములు గెలిచారు. పరిశ్రమలు గెలిచారు. పదవులు గెలిచారు. ఉద్యోగాలు గెలిచారు. ఉపాధి గెలిచారు. తెలంగాణకు రాజులయ్యారు. స్థానికుల అవకాశాలు లాగేసుకుని రాజ్యాధికారులయ్యారు. పరిశ్రమలు, ఉద్యోగ, రవాణా, విద్య , వైద్య . సినిమా రంగాలు కాంట్రాక్టర్లు సాహిత్య కళా, సమస్త రంగాలను ఆధిక్యత అవకాశాలను ఆక్రమించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 యేండ్లయినా రాజకీయాలలో తప్ప మిగతా రంగాలు మునుపటిలాగే సాగుతున్నాయి. తెలంగాణ ప్రజలు బాగుపడిదేమీ కనిపించడం లేదు. ఏదైనా ఉంటే, అధికారంలో వున్నవాళ్లు, అగ్రకులాలవాళ్లు అందుకున్నారు. బీసీలు అధికారం కోసం ఆందోళన మొదలు పెట్టారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రత్యేక రాష్ట్రాలుగా ఏర్పడితే ఈ పరిణామంలో ఏమైనా మార్పు జరిగేనా? తెలంగాణ పరిస్థితి చూస్తే కొందరు లేదా కేసీఆర్ వంటి కొన్ని కుటుంబాలు బాగుపడడానికి, అధికారంతోనూ దోచుకు తినడానికి పనికివస్తాయి. కోట్లాది ప్రజలు దశాబ్దాల ఉద్యమాలు ఇలాటి నీచ రాజకీయ నాయకుల పదవులు సంపాదనల కోసం చేయాలా?

రాజకీయ ఉద్యమాలు ప్రజలకు మేలు

రాజకీయ ఉద్యమాలు ప్రజలకు మేలు చేయలేవని తెలంగాణ అనుభవం తెలుపుతున్నది. కనుక రాయలసీమ, ఉత్తరాంధ్ర ఉద్యమాలు ఉచిత విద్య, వైద్యం, ఉద్యోగ కల్పన, ఉపాధి కల్పన , ప్రభుత్వ పరిశ్రమల ద్వారా అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రధాన నినాదాలుగా తాత్విక భూమిక సంతరించుకుంటే మంచిదేమో ఆలోచించడం అవసరం. తెలంగాణ ఉద్యమాలు చేసి కేసుల పాలయ్యారు. ఉద్యమకారులకు హామీనిచ్చారు. ఒక్క హామీ ఆచరణకు రాలేదు. వయసుపోయింది. చదువులు పోయాయి. ఐదు లక్షల ఉద్యోగాలొస్తాయనుకుంటే రాలేదు. ఔట్ సోర్సింగ్‌తో పని నడిపిస్తున్నారు. ఈ అనుభవాలు దేశవ్యాప్తంగా ఉద్యమ కారులకు గుణపాఠాలు కావాలి. ఉద్యమాలను పునర్ నిర్వచించుకోవాలి. స్థానికులతో, స్థానిక అభివృద్ధి అనేదే ప్రధాన నినాదం కావాలి. ఇవాళ తెలంగాణ ప్రజలు 'ఇరవై యేండ్లు ఉద్యమాలు చేస్తే మాకేమి వచ్చింది? ప్రభుత్వం మాకేమీ ఇచ్చింది? అవినీతి పెరిగింది' అని ప్రశ్నిస్తున్నారు. ఇపుడు తెలంగాణ, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రజలు మాత్రమే కాదు దేశవ్యాప్తంగా తెలంగాణ ఉద్యమ కారులకు, ఉద్యమాలకు పట్టిన దుర్గతిని గుణపాఠంగా తీసుకొని ఉద్యమాల విషయంలో ఇలా పునరాలోచిస్తే మంచిదేమో!

(నేడు కర్నూలులో 'దగా పడ్డ రాయలసీమకు వందేళ్లు' పేరిట సదస్సు జరుగుతున్న సందర్భంగా)

(వ్యాస రచయిత -సామాజిక తత్వవేత్త, యుగకర్త)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

ప్రాంతీయం





హైడ్రా అంటే అభయం.. వద్దు ఎలాంటి భయం

- హైడ్రాను ఆశ్రయించిన బోడుప్పల్ సుద్దకుంట చెరువు ప్రాంత నివాసితులు
- ఎఫ్‌టీఎల్ పేరు చెప్పి భయపెడుతున్నారంటూ వివిధ విభాగాల అధికారులపై ఫిర్యాదు
- అక్రమంగా ఇళ్లకు మార్కింగ్ వేసిన అధికారులపై చర్యలకు సిఫార్సు
- కమిషనర్ హామీతో ఎంతో ఊరట కలిగిందని స్థానికుల హర్షం

ప్రతిపక్షం, సిటీబ్యూరో, నవంబర్ 15: హైడ్రా అంటే అభయమని, హైడ్రా పేరుతో అపోహలు సృష్టించడం, ప్రజలను భయాందోళలనకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండలం బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ కుంట (సుద్దకుంట చెరువు) చెంత ద్వారకానగర్ నివాసితుల ఫిర్యాదుల మేరకు కమిషనర్ శనివారం క్షేత్ర స్థాయి పరిశీలన జరిపారు. సుమారు గంటపాటు అక్కడ పర్యటించి స్థానికులతో మాట్లాడి ప్రతి అంశాన్ని నివృత్తి చేశారు. అదే సమయంలో నిబంధనలకు విరుద్ధంగా చెరువుల పేరిట ఆందోళనలు కలిగించే వివిధ శాఖల అధికారులకు గట్టి ఆదేశాలు జారీ చేశారు. చెరువుల కబ్జాదారులపై చర్యలకు ఎట్టి పరిస్థితుల్లో వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. హైడ్రా పేరు చెప్పి వసూళ్లు చేస్తున్న ఘటనలు కూడా తమ దృష్టికి వస్తున్నాయని, అలాంటి విషయాలను సహించేది లేదన్నారు. ''సుద్దకుంట చెరువు చెంత తాము 30 ఏళ్ల క్రితం నుంచి ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నామని.. ఇప్పుడు మా నివాసాలు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తున్నాయని హైడ్రా పేరు చెప్పి బెదిరిస్తున్నారు. హెచ్ఎండీఏ, మున్సిపల్ స్థానిక అధికారులు ఎఫ్‌టీఎల్ మార్కింగ్ చేసి ఇనుప కడ్డీలు పాతి.. ఇళ్లపై నంబర్లు వేసి ఈ ఏడాది జులైలో మార్కింగ్ చేశారు. ఇదేమని అడిగితే హెచ్ ఎండీఏ, మున్సిపల్ అధికారులు మరింత భయాందోళనలు కలిగిస్తున్నారు. ఈ చెరువుకు 2014లో డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇచ్చి సర్వే చేసి ఎఫ్‌టీఎల్ హద్దు రాళ్లు పాతారు. వాటిని పట్టించుకోకుండా అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ఎఫ్‌టీఎల్ హద్దులు మార్చివేశారు. నివాసాలలో చెరువు ఎఫ్‌టీఎల్ ఉన్నట్లుగా చూపించి ప్రజలను భయపెడుతున్నారు. దీనివల్ల నెలల తరబడిగా నిద్రలేని రాత్రులు గడుపుతున్నాం. ఎంతమంది అధికారులను కలిసినా సరైన సమాధానం రాలేదు.. దీంతో హైడ్రాకు వచ్చి ఫిర్యాదు చేస్తున్నాము'' అని హైడ్రా కమిషనర్ ముందు పలువురు స్థానికులు వాపోయారు. 1990లో ఈ చెరువుకు నివాసాలకు మధ్య రోడ్డు వేసిన విషయాన్ని కూడా గుర్తు చేశారు. అయినప్పటికీ రోడ్డును కూడా ఎఫ్‌టీఎల్ లో చూపించి ప్రజలలో భయం కలిగించారని అధికారులపై ఫిర్యాదు చేశారు.

సుద్ధకుంటను పరిశీలించిన హైడ్రా కమిషనర్

స్థానికుల ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం సుద్ధకుంటను పరిశీలించారు. ఇళ్లపై వేసిన మార్కింగ్ లను కమిషనర్ చూశారు. అక్రమంగా ఇళ్లపై మార్కింగ్ వేసి భయభ్రాంతులకు గురి చేసిన హెచ్ఎండీఏ, మున్సిపల్ అధికారులపై చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు. చెరువు చెంత ఉన్న నివాసాల వారికి ఎలాంటి చింత అవసరం లేదని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. ఈ చెరువుకు 2014లోనే 3.16 ఎకరాల మేర చెరువుందని హెచ్ ఎం డీ ఏ వాళ్లు ప్రిలిమనరీ నోటిఫికేషన్ ఇచ్చారని గుర్తు చేశారు. దాని ప్రకారమే చెరువు హద్దులు నిర్ణయించి కాపాడతామని హామీ ఇచ్చారు. చెరువు హద్దులు మార్చివేసి వేరొక వైపు చెరువు ఉన్నట్లుగా చూపించి ఇళ్లపై మార్కింగ్ వేసిన అధికారులపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తాయంటూ దాదాపు 48 ఇళ్లపై స్థానిక అధికారులు మార్కింగ్ చేయడాన్ని తప్పుబట్టారు. 30 ఏళ్ల నుంచి నివాసాలు ఉంటున్న వారి జోలికి వెళ్లడం ఏంటని ప్రశ్నించారు. ఇళ్లపై వేసిన మార్కింగులు వెంటనే తొలగించాలని ఆదేశించారు. హెచ్ఎండీఏ, మున్సిపల్ అధికారులు ప్రతిపాదించిన ఫైనల్ నోటిఫికేషన్ ప్రతిపాదనలు పక్కన పెట్టి, డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ప్రకారమే ముందుకు వెళతామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు.

నివాసాల జోలికి హైడ్రా వెళ్లదు

2024 వ సంవత్సరం జులై 19వ తేదీన హైడ్రాను ప్రభుత్వం తీసుకు వచ్చిందని.. ఈ తేదీకి ముందు నిర్మించి.. నివాసం ఉంటున్న ఇళ్ల జోలికి వెళ్లమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మరో సారి స్పష్టం చేశారు. ప్రభుత్వ విధానం కూడా అదే అని పేర్కొన్నారు. చెరువుకు నివాస ప్రాంతాలకు మధ్య 1990లోనే రహదారి నిర్మించినట్టు స్థానికులు చెబుతున్న విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకున్నట్టు కమిషనర్ తెలిపారు. ఎవరైనా లేనిపోని గందరగోళం సృష్టించి హైడ్రా పేరిట బెదిరింపులకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు. ప్రస్తుతం చెరువుల వద్ద మిగిలిన భూమిలోనే వాటి పునరుద్ధరణ, అభివృద్ధిని చెపడుతున్నామని స్పష్టం చేశారు. సుద్ధకుంట చెరువు పునరుద్ధరణ, బాక్స్ డ్రెయిన్ నిర్మాణానికి సంబంధిత అధికారులకు సిఫారసు చేస్తామని తెలిపారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇచ్చిన ఆదేశాలమేరకు ఇళ్లపై వేసిన మార్కింగులను హెచ్ఎండీఏ సంబంధిత అధికారులు తొలగించారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తూ హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ధన్యవాదాలు చెప్పారు.



విద్యకు నైపుణ్యాలు తోడైతేనే ఉజ్వల భవిష్యత్తు

- వ్యక్తిత్వ వికాస నిపుణులు డా. బుర్ర మధుసూదన్ రెడ్డి

ప్రతిపక్షం కరీంనగర్ బ్యూరో, నవంబర్ 15: మనం నేర్చుకునే విద్యకు తగిన నైపుణ్యాలు తోడైనపుడు మాత్రమే ఆకర్షణీయ వేతనం కలిగిన ఉద్యోగాలు లభిస్తాయని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. సిద్దిపేట సమీప శ్రీకృష్ణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ప్రథమ సంవత్సరం బి ఫార్మసీ, ఎం ఫార్మసీ, ఫార్మ్ డి విద్యార్థుల ఇండక్షన్ ప్రోగ్రామ్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. నేటి డిజిటల్ యుగంలో నైపుణ్య విద్య కలిగిన యువతకు ఉజ్వల భవితతో పాటు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. మనలో దాగిన బలహీనతలను తగ్గించుకుంటూ, బలాలను పెంచుకుంటూ పరిపూర్ణ వ్యక్తిత్వం కలిగిన ఉత్తముడిగా ఎదగాలన్నారు. అర్హత కలిగిన యువతకు ఉద్యోగ ఉపాధుల అవకాశాలు మెండుగా ఉన్నాయని, వాటి సాధనకు నిరంతర కృషి చేయాలన్నారు. మన జీవనశైలిని బట్టి మన ఉన్నతి ఆధారపడి ఉంటుందని గుర్తు చేశారు. కళాశాల చైర్మన్ ఆచార్య వి మల్లా రెడ్డి మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందని, హైదరాబాద్ నగరం భారత దేశానికే ఫార్మసీ హబ్‌గా మారిందని తెలియజేశారు. ప్రిన్సిపల్ డా మంజునాథ్, డైరెక్టర్లు డా ఏడెల్లి మల్లారెడ్డి, కె. శశిధర్ రెడ్డి, కె. రామచంద్రమ్, కె రమేష్, బైరయ్య, అధ్యాపక బృందం, 200 విద్యార్థినులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ముఖ్య అతిథి ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డిని కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది.





కన్నుల పండువగా అయ్యప్ప స్వామి మహాపడిపూజ

ప్రతిపక్షం,మొయినాబాద్,నవంబర్ 15 : మండల పరిధిలోని కనకమామిడి గ్రామంలో అయ్యప్ప గుట్టపై గురుస్వామి రామచందర్ సమక్షంలో కనకమామిడి గ్రామానికి చెందిన కుంటి సంపూర్ణ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో 25వ మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అయ్యప్ప స్వామికి ప్రత్యేపూజలు, పంచామృతాల అభిషేకాలు ఘనంగా జరిపించారు. ఇతర ప్రాంతాల మాలాదారణ స్వాములు ఈ పడిపూజ మహోత్సవానికి వచ్చి స్వామి వారి ఆటపాటలతో తిలకించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. అనంతరం స్వాములకు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సీడీ ఆవిష్కరణ

అలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బేగరి రాజు నిర్మాతగా రచన గానం తలారి శ్రీనివాస్ ఏర్పాటు చేసిన సిడి ఆడియో ఆవిష్కరణ చేయడం జరిగింది. ముఖ్య అతిధిగా విచ్చేసిన కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ కార్తీక మాసంలో ప్రతిఏటా అయ్యప్పమాల ధరించి నిష్ఠ నియమాలతో అంకిత భావంతో 41 దీక్షలు పూర్తిచేసుకుని శబరిమలలో కొలువుదీరిన మణికంఠుని దర్శనం చేసుకుంటారు ఈ సందర్భంగా అయ్యప్ప చరిత్రను ఒక పాట రూపంలో చిత్రీకరించి భక్తులకు అర్థం అయ్యేవిధంగా రూపొందించిన నిర్మాత బేగరి రాజు రచన గానం తలారి శ్రీనివాస్ కళాకారులను అందరూ ప్రశంసించారు ఈ కార్యక్రమంలో కుమ్మరి జనార్దన్, రాజు గౌడ్, కొట్టం సంపత్, అవుసుల శేఖర్ చారి, చాకలి యాదయ్య,రాజు నాయక్ పాల్గొన్నారు.

ఓవర్సీస్ మొబిలిటీ బిల్ పై 20న సదస్సు

- తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ సమావేశం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, నవంబర్15 : విదేశాలకు వలస వెళ్లే భారతీయుల కోసం1983లో అమలులోకి వచ్చిన వలస చట్టానికి (ఎమిగ్రేషన్ యాక్టు) సమూల మార్పులు చేయడానికి, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఓవర్సీస్ మొబిలిటీ బిల్లు, 2025 ముసాయిదాను విడుదల చేసింది. ఈనెల 24 లోగా ఈ బిల్లుపై అభిప్రాయాలు, సూచనలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం కోరింది. ఈ నేపథ్యంలో, తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ ఆధ్వర్యంలో ఈ బిల్లుపై ఈనెల 20న హైదరాబాద్ లో సదస్సు నిర్వహిస్తున్నట్లు కమిటీ చైర్మన్, అంబాసిడర్ డా. బీఎం వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హైబ్రిడ్ విధానంలో జరిగే సమావేశంలో తెలంగాణ ప్రవాసులు తమ వీలునుబట్టి వ్యక్తిగతంగా లేదా ఆన్‌లైన్ ద్వారా పాల్గొనవచ్చు. మరింత సమాచారం కోసం, తెలంగాణ ప్రభుత్వ నియమిత ఎన్నారై అడ్వయిజరీ కమిటీ మెంబర్లు నంగి దేవేందర్ రెడ్డి +91 96661 23419 స్వదేశ్ పరికిపండ్ల +91 94916 13129 సిస్టర్ లిజీ జోసెఫ్ +91 94416 75817 ను సంప్రదించవచ్చు.



వర్గీకరణ రద్దుకు జాతీయస్థాయి ఉద్యమం

- డిసెంబర్ 12 13 తేదీలలో 'హలో మాల ఛలో ఢిల్లీ'
- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డా. పసుల రాంమూర్తి

ప్రతిపక్షం ప్రతినిధి, హన్మకొండ, నవంబర్ 15: 'మాలమహానాడు ఆఫ్ ఇండియా' ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం హన్మకొండ సంఘం కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షులు మన్నే కరుణాకర్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు డా. పసుల రాంమూర్తి మాట్లాడుతూ ఈ డిసెంబర్ 12 13 తేదీలలో రాజ్యాంగ హక్కుల సాధన కోసం ఢిల్లీలోని జంతర్ మంతర్ లో 'హలో మాల ఛలో ఢిల్లీ' పేరిట నిరసన ఉంటుందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మాలలు రాజకీయ పార్టీలకు అతీతంగా తరలిరావాలని పిలుపు ఇచ్చారు. 'రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి ఎంతకైనా పోరాటం చేయాలన్నారు. వర్గీకరణ రద్దు, రోస్టర్ విధానం రద్దు, 20 శాతం రిజర్వేషన్ పెంపు, పార్లమెంట్ కు అంబేద్కర్ పేరు, మాల, మహర్ అనుబంధ కులాల సర్వతోముఖాభివృద్ధికి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి. శాస్త్రీయ లెక్కలు లేకుండా చేసిన వర్గీకరణ, రోస్టర్ జీఓ నెం. 99, జీవో నెం. 29 రాజ్యాంగ వ్యతిరేకం తక్షణమే పునఃసమీక్షించాలి' అనే డిమాండ్లతో ఈ కార్యక్రమం ఢిల్లీలో నిర్వహిస్తున్నామన్నారు. ప్రైయివేటు రంగంలోనూ రిజర్వేషన్ల చట్టం తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో ఉసిల్ల ఆంజనేయులు, బందెల రాజేశ్, మన్నే శ్రీనివాస్, మన్నే నర్సింగ్, ఉసిల్ల మహేందర్, ఉసిల్ల శివ ప్రసాద్, మన్నే కుమారస్వామి, మన్నే నారాయణ తదితరులు పాల్గొన్నారు.





బతుకమ్మకుంట బాగుందా..!

- వాకర్లతో మాట్లాడిన హైడ్రా కమిషనర్
- సంతృప్తి వ్యక్తం చేసిన వాకర్లు

ప్రతిపక్షం, సిటీబ్యూరో, నవంబర్ 15: హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం బతుకమ్మకుంటను సందర్శించారు. సాయంత్రం 6 గంటల సమయంలో బతుకమ్మ కుంట చుట్టూ వాకర్లతో కలసి నడిచారు. బతుకమ్మ కుంట అభివృద్ధి పట్ల వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఎంత మంది వాకింగ్ కు వస్తున్నారు.. ఎలా ఉపయోగపడుతోంది.. ఈ పరిసర ప్రాంత ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. బతుకమ్మ కుంట యిప్పుడు మాకందరికీ విహార కేంద్రం అయ్యిందని స్థానికులు కమిషనర్ కు చెప్పారు. బతుకమ్మ కుంట అందుబాటులో రావడంతో ఈ పరిసర ప్రాంతాల రూపురేఖలే మారిపోయాయని... వాకింగ్ చేసుకుంటూ ఆరోగ్యాలు కాపాడుకుంటున్నామని అన్నారు. ఒకప్పుడు దుర్గంధంతో వ్యాధులు భారిన పడేవాళ్ళమని యిప్పుడు ఆరోగ్యాలు కాపాడుకు తున్నామన్నారు. పిల్లలకు మంచి క్రీడా స్థలంగా మారిందని చెప్పారు. ఈ చెరువును సెప్టెంబర్ 28న ప్రారంభించామని... చెరువు చుట్టూ వేసిన మొక్కలు పెద్దవైతే మరింత ఆరోగ్యవంతంగా పరిసరాలు మారుతాయని కమిషనర్ చెప్పారు. చెరువును యింతే శుభ్రంగా కాపాడుకోడానికి హైడ్రాతో కలసి పని చేయాలని అక్కడి వాకర్లను కమిషనర్ కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ తో ఫోటోలు దిగి చాలా మంది పదిలపరచుకున్నారు. చిన్నారులు థాంక్ యూ సార్ అంటూ కమిషనర్ కు కృతజ్ఞతలు తెలిపారు.



బస్సు జాతను విజయవంతం చేయాలి

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె. రామస్వామి

ప్రతిపక్షం,మొయినాబాద్, నవంబర్ 15 : భారత కమ్యూనిస్టు పార్టీ బస్సు జాతను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె. రామస్వామి అన్నారు. మండల కేంద్రంలో మండల పార్టీ కార్యదర్శి కె. శ్రీనివాస్ అధ్యక్షతన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కె. రామస్వామి హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత కమ్యూనిస్టు పార్టీ భారత గడ్డ పై 1925 డిసెంబర్ 26వ తేదీన ఉత్తరప్రదేశ్ లోని కాన్పూర్ పట్టణంలో ఏర్పడిందన్నారు.కార్మిక, కర్షక, రైతుల, పేద ప్రజల కోసం ఎండిన డొక్కల కోసం సమసమాజ స్థాపన కోసం ఏర్పడిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. ఈ 100 వసంతాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మూడు బస్సు జాతలు ఈ నెల 15వ తేదీ నుండి ప్రారంభం అవుతున్నాయని దీనిలో భాగంగా ఒక బస్ జాత సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘ ప్రధాన కార్యదర్శి పాశ్య పద్మ ఆధ్వర్యంలో 18 వ తేదీ సాయంత్రం 4 గంటలకు బస్సు జాత మొయినాబాద్ మండల కేంద్రానికి చేరుకుంటుందని తెలిపారు. కావున పార్టీ శ్రేణులు శ్రేయోభిలాషులు రైతులు కార్మికులు కర్షకులు ప్రజలు ఈ బస్సు జాతకు ఘనంగా స్వాగతం పలకాలన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహము నుండి ఇంద్రారెడ్డి విగ్రహం వరకు ర్యాలీ ఉంటుందని ఇంద్రారెడ్డి విగ్రహం దగ్గర కార్నల్ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. ప్రభు లింగం, జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్ల సత్యనారాయణ, జిల్లా కౌన్సిల్ సభ్యురాలు వడ్ల మంజుల తదితరులు పాల్గొన్నారు.



హిందూపురంలోని వైసీపీ కార్యాలయంపై టీడీపీ నేతలు, బాలకృష్ణ అభిమానులు దాడి చేశారు. ఈ అనాగరిక చర్యను మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. రాజకీయ పార్టీల కార్యాలయాలను ధ్వంసం చేయడం, ఫర్నీచర్, అద్దాలను పగలగొట్టడం, కార్యకర్తలపై దాడి చేయడం వంటి చర్యలు ప్రజాస్వామ్య విలువల పతనాన్ని సూచిస్తాయి. ఈ ఘటనపై పోలీసులు చర్యలు తీసుకోకపోవడం మరింత ఆందోళన కలిగిస్తుంది.

- వైసీపీ అధినేత వైఎస్ జగన్

ప్రాంతీయం



వృద్ధులు మన సమాజానికి అమూల్యమైన సంపద

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 15 : మహిళా శిశు వయోవృద్ధులు దివ్యాంగుల ట్రాన్స్ జెండర్ శాఖ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం లో భాగంగా శనివారం సంగారెడ్డి జిల్లా సీనియర్ సిటిజెన్సీ వాగ్దాన్ కార్యక్రమం కొనసాగింది . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు . ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడారు... వృద్ధులు మన సమాజానికి అమూల్యమైన సంపదని, వారి అనుభవం, జీవన జ్ఞానం భవితరాలకు దారి చూపే మార్గదర్శకం. స్థిరమైన ప్రగతికి సీనియర్ సిటిజెన్స్ యొక్క ఆలోచనా పటిమ, అనుభవం బలమైన ఆధారంగా నిలుస్తాయి అని , సమాజ అభివృద్ధికి తోడ్పడతాయని అన్నారు. వృద్ధుల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తీసుకురావడం, పెన్షన్ పథకాలు, ఆస్తిహక్కుల రక్షణ, వృద్ధాశ్రమాల ఏర్పాటు వంటి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నదని తెలిపారు. కొంతమంది ఎన్జీవోలు కూడా వృద్ధుల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండటం ప్రశంసనీయం అని అన్నారు. తల్లిదండ్రుల మరియు వయోవృద్ధుల పోషణ-సంక్షేమ చట్టం గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని సూచించారు. వృద్ధుల సంరక్షణలో ఎక్కడైనా సమస్యలు ఉంటే మహిళా-శిశు సంక్షేమ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కే. లలిత కుమారి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య అధికారి డాక్టర్ వసంత రావు , డాక్టర్, నాగ నిర్మల ,ప్రోగ్రాం ఆఫీసర్ మదర్ అండ్ చైల్డ్ కేర్ డాక్టర్ శశాంక్, ప్రోగ్రామ్ ఆఫీసర్ ఇమ్యునైజేషన్ అండ్ వ్యాక్సిన్, యూత్ అండ్ స్పోర్ట్స్ వెల్ఫేర్ ఆఫీసర్ కాసిం బేగ్, డి ఆర్ డి ఓ పెన్షన్ విభాగం షహవర్ బేగం , బాలల సంరక్షణ అధికారి రత్నం, వయోవృద్ధులు దివ్యాంగులు శాఖ సీనియర్ అసిస్టెంట్ వెంకటేశం, ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి సతీష్, మహిళా సాధికారత సమన్వయకర్త పల్లవి కమ్యూనిటీ ఎడ్యుకేటర్ ఉమెరా సహిష్ట, తదితర శాఖ అధికారులు పాల్గొన్నారు.





దేవదాయ శాఖ భూముల్లో ఏం జరుగుతోంది?

- ముున్సిపల్ కమిషనర్ ఉన్నట్టా లేనట్టా
- ఉంటే అక్రమ షెడ్డుల నిర్మాణలను ఎందుకు ఆపడం లేదంటూ మున్సిపాలిటీ ప్రజల ఆరోపణ
- కాసుల వర్షం కురిపించి అక్రమాలకు పాల్పడుతున్న షెడ్డు నిర్వాహకులు
- మున్సిపల్ ముఖ్య అధికారి శ్రీదేవి దృష్టి సారించాలి

ప్రతిపక్షం. ప్రతినిధి. మేడ్చల్, నవంబర్ 14: అక్రమ కట్టడాల నార్మూలనను అరికట్టే విషయంలో తుంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి విఫలమవుతున్నారని మున్సిపల్ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దేవదాయ శాఖ భూములలో అక్రమ కట్టడాలను నిర్మిస్తున్నారని మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు. దేవదాయ శాఖ భూములకు ముఖ్య అధికారిగా జిల్లా కలెక్టర్ మను చౌధరిని నిర్మించిన మున్సిపల్ అధికారులు మాత్రం అక్రమాలను ఆపడంలో విఫలమవుతున్నారని కమిషనర్ జ్యోతి ఆరోపణలు ఎదురుకుంటున్నారు. అక్రమాలకు అడ్డాగా మారిన తుంకుంట పట్టణంలో దానిని నిర్మూలించడానికి ప్రయత్నం చేయకపోవడంపై పలు అనుమానాలకు దారి తీస్తున్నాయి. కాంగ్రెస్ బడా నాయకులు కలిసి అధికారులకు కాసుల వర్షం కురిపించి అడ్డగోలుగా దేవదాయ శాఖ భూముల్లో అక్రమ కట్టడాలు నిర్వహిస్తున్నారా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కమిషనర్ మాత్రం చూసి చూడనట్టు వ్యవహిస్తున్నారని జోరుగా ఇకనైనా పై అధికారులు స్పందించి ఈ అక్రమ కట్టడాలను నిర్మూలించండంలో విజయం సాధిస్తారని కోరుతున్నారు.

మున్సిపల్ ప్రత్యేకధికారి శ్రీదేవి దీనిపై ఎందుకు స్పందించడం లేదు

మున్సిపల్ ప్రత్యేకధికారి శ్రీదేవి ఈ అక్రమ షెడ్డు నిర్వాహణపై చర్యలు తీసుకువాలని తుంకుంట బీజేపీ నాయకుడు





రవీందర్ గౌడ్ కోరారు. దేవదాయ శాఖ భూముల్లో ఎలాంటి కట్టడాలు నిర్మించవద్దని కోర్టు ఆదేశించిన అలాంటి ఆదేశాలను దిక్కరించి అక్రమదారులకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. నేనే స్వయంగా పదిసార్లు మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాను. కానీ అధికారులు పాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేరు. మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సహకారంతో ఈ నిర్మాణాలు కొనసాగుతున్నాయా?? రెవెన్యూ శాఖ మంత్రిని పక్కకు పెట్టి ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో లోకల్ కాంగ్రెస్ నాయకులు ఈ వ్యవహారాన్ని కొనసాగిస్తున్నారు. యాంజాల్ కాంగ్రెస్ నాయకులందరూ కలిసి ప్రస్తుతమున్న కమిషనర్ జ్యోతిని తుంకుంట మున్సిపల్ కార్యాయంలో కమిషనర్ గా పోస్టింగ్ ఇప్పించి



బీజేపీ నాయకుడు రవీందర్ గౌడ్

అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇక్కడ ఇంత జరుగుతున్న మంత్రుల నుండి అధికారుల వరకు అందరూ ఎందుకు చూసి చూడకుండా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రజల ఫిర్యాదులపై మున్సిపల్ కమిషనర్ జ్యోతి వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలి.

2021 లో నలుగురు ఐఏఎస్ లను ప్రత్యేకంగా నిర్మించిన బీఆర్ఎస్ ప్రభుత్వం

2021 లో దేవదాయ శాఖ భూములపై ప్రత్యేక దృష్టి సారించాలని తుంకుంట ప్రజలు అధికారులకు ఫిర్యాదులు చేయడంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నలుగురు ఐఏఎస్ అధికారులను ప్రత్యేకంగా నిర్మించారు. అనంతరం వారు కలిసి యంజాల్ లో ప్రత్యేక సర్వేలు నిర్వహించి అక్రమాలకు పాల్పడుతున్నావారిపై చర్యలు తీసుకున్నారు. ఇప్పుడున్న కలెక్టర్ మను చౌధరి రంగంలోకి దిగి అక్రమార్కులకు అడ్డుగట్ట వేస్తారా వేచి చూడాల్సిందేనని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు

దేవదాయ శాఖ భూములలో అక్రమ షెడ్డులు నిర్మిస్తున్న వారిపై దృష్టి సారిస్తామని మున్సిపల్ కమిషనర్ జ్యోతి అన్నారు. పట్టణ ప్రజలు అక్రమ షెడ్డుల నిర్మానాలపై ఇస్తున్న ఫిర్యాదులను స్వీకరించామని, ఈ నిర్మాణలను అరికట్టి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



స్వాతంత్ర పోరాటానికి బిర్సా ముండా ప్రేరణాత్మక చిహ్నం

- భగవాన్ బిర్సా ముండా జయంతి వేడుకలు
- కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహణ

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 15 : తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భారతదేశ అటవీ జాతుల స్వాతంత్ర సమరయోధుడు, జానపద నాయకుడు భగవాన్ శ్రీ బిర్సా ముండా జయంతి వేడుకలు శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రశేఖర్, బిర్సా ముండా చిత్రపటానికి పూలమాల వేసి ఆయన చేసిన మహోన్నత పోరాటాన్ని స్మరించుకుంటూ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భారత అటవీ జాతుల స్వాతంత్ర పోరాటానికి బిర్సా ముండా ప్రేరణాత్మక చిహ్నమని, ఆయన జయంతి దేశవ్యాప్తంగా గౌరవంతో జరుపుకుంటున్నామన్నారు. ఆధునిక శాస్త్ర విజ్ఞానాన్ని ఆకళింపు చేసుకుని బ్రిటిష్ పాలనలో జరిగిన దోపిడీని బిర్సా ముండా అర్థం చేసుకున్నారని వివరించారు. ఆరోజుల్లో నేటి బీహార్-జార్ఖండ్ ప్రాంతాల్లో జరిగిన మిలీనేరియన్ ఉద్యమానికి ఆయన సారథ్యం వహించారని, కేవలం 22 ఏళ్ల వయసులోనే బ్రిటీషర్లపై యుద్ధాన్ని ప్రకటించి అటవీ జాతుల హక్కుల కోసం అప్రతిహతంగా పోరాడారని గుర్తుచేశారు. అటవీ జాతుల హక్కులు, గిరిజనుల అభ్యున్నతి, స్వాభిమాన రక్షణ కోసం బిర్సా ముండా చేసిన త్యాగాలు నేటికీ ప్రేరణగా నిలుస్తున్నాయని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పద్మజారాణి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు దీపిక, ప్రతిభ , గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



చెరువుల ప్రాముఖ్యతను గుర్తించండి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో చెరువులు, కుంటల గుర్తింపుపై అధికారులతో సమావేశం

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 15: జిల్లాలోని చెరువులు, కుంటల ప్రాముఖ్యతను గుర్తించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సాగునీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా ఫారెస్ట్ అధికారి లావణ్య, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జిల్లాలో తడి నేలలు (వెట్ ల్యాండ్స్)ను గుర్తించి వాటి పరిరక్షణకు త్వరగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం కోసం బుధవారం నాటికి నివేదికను సాగునీటిపారుదల అధికారులు అందజేయాలన్నారు. జియో శాటిలైట్ ఇమేజెస్ ద్వారా జిల్లాలో 267 చెరువులు, కుంటలు గుర్తించబడ్డాయని అన్నారు. జాబితాలో ఉన్న మేరకు 267 చెరువులు, కుంటలను స్థానిక పంచాయతీ కార్యదర్శితో పాటు సాగునీటిపారుదల శాఖ అధికారులు సందర్శించి వివరాల నివేదికను సమర్పించాలన్నారు. ప్రాధాన్యత క్రమంలో వంద ఎకరాల విస్తీర్ణం కలిగిన జిల్లాలోని 11 చెరువులను సాగునీటి పారుదల శాఖ డీఈ లు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం నిర్ణీత ఫార్మట్ లో సమగ్ర వివరాలను అందజేయాలన్నారు. చెరువులు, కుంటలు ఉన్న భూములు ఎలాంటివి, నీటి సామర్థ్యం ఎంత, అక్కడి ప్రత్యేకతలు, తదితర అంశాలను తెలియజేస్తూ నివేదికను అందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి లావణ్య సర్వే కు సంబంధించిన అంశాల గురించి అధికారులకు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, సాగునీటిపారుదల డిఈ రామ్మోహన్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సునీత, మత్స్యశాఖ అధికారి శ్రీపతి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఘనంగా భగవాన్ బిర్సాముండా 150వ జయంతి

ప్రతిపక్షం, గుండాల, నవంబర్ 15: భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా గుండాల మండల కేంద్రంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పూనేం వసంత్ అధ్యక్షతన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ గుండాల మాజీ ఎంపీపీ ముక్తిసత్యం, గుండాల మాజీ సర్పంచ్ కొమరం సీతారాములు పాల్గొని భగవాన్ బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం నాయకులు మాట్లాడుతూ, "ఆదివాసి సమరయోధుడు, దర్తీ ఆబా, ఉల్గులాన్ యుద్ధ వీరుడు భగవాన్ బిర్సా ముండా బ్రిటిష్ వలస పాలనపై, నిరంకుశ దోపిడి భూస్వామ్య వ్యవస్థపై ఏకకాలంలో తిరుగుబాటు జెండా ఎగురవేసిన విప్లవ యోధుడు" అని కొనియాడారు. అడవులపై ఆదివాసీల స్వయంపాలన హక్కు కోసం విప్లవం రగిలించిన వీరి పోరాటం భారత చరిత్రలో అమోఘం అని చెప్పారు.భూమి కోసం, భుక్తి కోసం ఆయుధం పట్టి ఆదివాసీ సమాజంలో స్వాభిమానాన్ని పెంపొందించిన బిర్సా ముండా పోరాటం అన్ని తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిపోతుందని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు ఈసం కృష్ణ, మోకాళ్ల సూర్యనారాయణ, ఊకే వెంకటేశ్వర్లు, పూనేం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగవాన్ బిర్సా ముండా జయంతి వేడుకలు

ప్రతిపక్షం,ప్రతినిధి,ములుగు,నవంబర్ 15: ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామంలో భగవాన్ బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని ఘనతతో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ప్రజలు, గ్రామ పెద్దలు, యువత భారీగా పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో బిర్సా ముండా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సేన ములుగు జిల్లా కన్వీనర్ ఆలం శ్రీను మాట్లాడుతూ "భారతదేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన మహనీయుని 150వ జయంతిని పురస్కరించుకుని మనం ఈ సమావేశమయ్యాము. గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీక, స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా దేశానికి చూపిన దారి నేటికీ ప్రతి తరానికి మార్గదర్శకమే" అని తెలిపారు. నవంబర్ 15న ప్రతి సంవత్సరమూ జరుపుకునే బిర్సా ముండా జయంతిని భారత ప్రభుత్వం జన జాతీయ గౌరవ్ దివస్‌గా ప్రకటించడం గిరిజన సమాజం దేశానికి చేసిన సేవలకు గూర్చిన గౌరవమని ఆయన పేర్కొన్నారు.

బిర్సా ముండా జీవిత పోరాటం


1875లో జార్ఖండ్‌లోని ఉలిహతు గ్రామంలో జన్మించిన బిర్సా ముండా, కేవలం 25 ఏళ్ల చిన్న వయసులోనే బ్రిటిష్ ఆక్రమణకు వ్యతిరేకంగా 'ఉల్గులాన్' అనే మహా ఉద్యమానికి నాయకత్వం వహించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారు. గిరిజనుల భూమి హక్కుల పరిరక్షణ, వారి



సంస్కృతిసంప్రదాయాల కాపాడటం, సమాజానికి నైతిక విలువలతో కూడిన జీవన విధానాన్ని చూపటం ఆయన ప్రధాన లక్ష్యాలు. గిరిజన సమాజం ఆయనను "ధర్తీ ఆబా"గా భావించి పూజించటం ఆయనకు ఉన్న మహోన్నత స్థానం చూపిస్తుంది.

నేటి తరానికి స్ఫూర్తి

బిర్సా ముండా చూపిన ధైర్యం, న్యాయం కోసం చేసిన పోరాటం, గిరిజన తెగలన్నింటినీ ఐక్యం చేసిన నేతృత్వం నేటి యువతకు ఒక శాశ్వత స్ఫూర్తి. ప్రకృతిని కాపాడటం, హక్కుల కోసం నిర్భీతి తో నిలబడటం, ఐక్యతతో ముందుకు సాగడం ఆయన జీవితం అందించే ప్రధాన సందేశాలు. జన జాతీయ గౌరవ్ దివస్ సందర్భంగా ఆయన చూపిన మార్గంలో నడవాలని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పాల్గొన్నవారు సంకల్పం వ్యక్తం చేశారు. ఈ వేడుకల్లో తుడుందెబ్బ జిల్లా డివిజన్ ప్రధాన కార్యదర్శి కొప్పుల జగన్, కళాబ్బందం మధు, గ్రామ పెద్దలు సిద్ధబోయిన నరసింగరావు, తేజమూర్తి, కొప్పుల కృష్ణారావు, యాలం రవి, తిప్పనపల్లి అల్లెం రమేష్, ఎల్లాస్వామి, మడప దేవయ్య, యూత్ నాయకులు కుడుముల రాజు, అల్లెం సతీష్, స్వామి, సమ్మయ్య, నరేష్, మహిళా సంఘాల ప్రతినిధులు కొప్పుల స్వాతి, హేమలతలు తదితరులు పాల్గొన్నారు.



చరిత్ర తిరగరాసేలా విశాఖ సీఐఐ సదస్సు సూపర్ హిట్టయ్యింది. 613 ఒప్పందాల ద్వారా రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 16 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. దేశవిదేశాల నుంచి సమ్మిట్‌లో 5,587 మంది ప్రముఖులు పాల్గొన్నారు. మొత్తంగా 17 నెలల్లోనే రూ.20 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు సాధించాం. విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతాం.

- ఏపీ సీఎం చంద్రబాబు

ప్రాంతీయం

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత
- వరద బాధితులను పరామర్శించి ఎమ్మెల్సీ



ప్రతిపక్షం మెదక్ ప్రతినిధి నవంబర్ 15:- గత రెండు నెలల క్రితం భారీ వర్షాలతో మెదక్ కామారెడ్డి జిల్లాల సరిహద్దు ప్రాంతమైన ధూప్ సింగ్ తాండను వరద ముంచెత్తిందని, రైతులు తీవ్రంగా నష్టపోయారని, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత డిమాండ్‌చేశారు. బ్రిడ్జి లేకపోవడంతో వాగు ఉప్పొంగిపొర్లి తండాకు రాకపోకలు బంద్ అయ్యాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదని కవిత అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత వరద బాధితులను కలిశారు. బ్రిడ్జి నిర్మాణ పనుల ఆలస్యంపై, వరదలతో వాటిల్లిన నష్టం గురించి స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పొలాల వద్ద ఇసుక మెట్టలు పొయ్యి పొలాలు పనికిరాకుండా పోయాయని, దీంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, ఇప్పటి వరకు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించలేదని అన్నారు. ఇప్పటికైనా చెల్లించాలని, లేకపోతే ఉద్యమాన్ని చేపడతామని ఆమె హెచ్చరించారు. అనంతరం చిన్న శంకరంపేటలోని తెలంగాణ అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గతంలో పాలకులు తెలంగాణ అమరవీరులను మర్చిపోయారని అన్నారు.



కామ్రేడ్ కేవల్ కిషన్ సమాధి వద్ద కవిత నివాళులు

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 15: కామ్రేడ్‌కేవల్ కిషన్ సమాధి వద్ద తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నివాళులర్పించారు. మెదక్ జిల్లా చేగుంట మండలం పోలంపల్లి చౌరస్తాలో కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ కేవల్ కిషన్ సమాధి వద్ద పార్టీ నాయకులతో కలిసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ కొట్టాల యాదగిరి ముదిరాజ్, బీసీ యునైటెడ్ ఫ్రంట్ పూలే రాష్ట్ర కోఆర్డినేటర్ హరి, తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి కందుల మధు, యువజన విభాగం కార్యదర్శి ధ్యాని, మహిళా విభాగం మెదక్ జిల్లా అధ్యక్షురాలు రాజేశ్వరి, కార్యదర్శి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటలో డ్రంక్ డ్రైవింగ్ పై కఠిన చర్యలు

- 31 మందికి 3 లక్షల 17 వేల జరిమానా

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 15: సిద్దిపేటలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కఠినంగా చర్యలు తీసుకున్నారు. సిద్దిపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కె. ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో, నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తా, రాజీవ్ రహదారి ప్రాంతాలలో వాహన తనిఖీలు నిర్వహించగా, 31 మంది డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరి మద్యం స్థాయిని బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షించిన తరువాత, కేసులు నేరుగా ఫస్ట్అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కుమారి వి. తరణికి సమర్పించారు. విచారణ అనంతరం, 31 మందికి కలిపి రూ. 3,17,000/ జరిమానాలు విధించారు. సిద్దిపేట ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి ప్రజా రహదారి భద్రత కోసం తీసుకున్న ఈ చర్య ప్రశంసనీయమని అధికారులు తెలిపారు.

మెగా లోక్ అదాలత్‌లో 503 కేసుల రాజీ

- జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు



ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 15: జాతీయ మెగా లోక్అదాలత్ లో భాగంగా మెదక్ జిల్లాలో 503 కేసుల రాజీ అయ్యాయని జిల్లా ఎస్పీ డీవీ. శ్రీనివాస రావు తెలిపారు. జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా, మెదక్ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన రాజీ పడదగిన 503 కేసులను లోక్అదాలత్‌లో సమర్థవంతంగా పరిష్కరించడం జరిగిందన్నారు. ఇరు వర్గాలను సమన్వయం చేస్తూ, పరస్పర రాజీకి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించి కేసులను పరిష్కరించుకోవడం జరిగింది అని అన్నారు. ప్రత్యేకంగా సైబర్ నేరాలకు సంబంధించిన 41 కేసుల్లో, బాధితులు కోల్పోయిన రూ. 11,44,608/ మొత్తాన్ని తిరిగి వారి ఖాతాల్లో జమ చేయునట్లు సంబంధిత బ్యాంకుల నోడల్ అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ లోక్అదాలత్ అనేది క్షణికావేశంలో జరిగే చిన్నపాటి వివాదాలు, గొడవలను శాంతియుతంగా పరిష్కరించుకునే అద్భుత వేదిక అని కోర్టుల్లో సంవత్సరాల తరబడి నిలిచే కేసులను ఇరు వర్గాల రాజీ ద్వారా పరిష్కరించుకోవడం సమాజానికి ఎంతో మేలు చేస్తుందని అన్నారు. రాజీ మార్గమే రాజమార్గం అనే భావన ప్రతి ఒక్కరిలో పెరగాలని తెలిపారు. జిల్లాలో లోక్అదాలత్ విజయవంతం కావడంలో పాత్ర వహించిన పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది, సైబర్ క్రైమ్ యూనిట్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



టీఆర్టీఎఫ్ చేగుంట మండల అధ్యక్షులుగా జగన్ లాల్

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్15: టీఆర్టీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఎన్నికలు శనివారం చేగుంట మండలంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాంపూర్ కరీంనగర్ జిల్లా పరిషత్ హై స్కూల్ కు చెందిన కె, జగన్ లాల్ అధ్యక్షులుగా ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా పులిమామిడి అప్పర్ ప్రైమరీ స్కూల్ కు చెందిన ఆర్, దేవరాజ్ ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఉసిరికాయల వెంకటేష్, అబ్దుల్ రషీద్, శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన కార్యవర్గానికి టీఆర్టీఎఫ్ జిల్లా యూనియన్ అధ్యక్షులు వెంగర్తి ప్రణీత్ కుమార్ హర్షం ప్రకటించి సన్మానించారు.



రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్15: నార్సింగి మండల కేంద్రానికి చెందిన పైతర బాలయ్య(40) వరి ధాన్యం ఆరబెట్టి తిరిగి సైకిల్‌పై ఇంటికి వస్తున్న క్రమంలో లారీ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. మిర్జాపల్లి రోడ్డులోని రైస్ మిల్ వద్ద ఈ సంఘటన జరిగింది. సైకిల్‌పై వెళ్తున్న బాలయ్యను లారీ ఢీకొనడతో మరణించినట్లు పోలీసులు ధ్రువీకరించారు. నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు.



సంకల్ప సిద్ధికి కార్తీకదీపం దోహదం

- మోక్షమార్గానికి దిక్సూచి "పుణ్యక్షేత్రాలు"
- "దీపారాధన"తో పరమేశ్వరుడి ప్రసన్నం
- విద్యాధరి క్షేత్ర వ్యవస్థాపకులు, బ్రహ్మశ్రీ చంద్రశేఖర శర్మ

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 15: సంకల్ప సిద్ధికి కార్తీకదీపం దోహద పడనుండగా, తేజోవంతమైన కార్తీకదీపం వెలిగిస్తే ఆ కుటుంబంలో శాంతి, ధనవృద్ధి, ఐశ్వర్యం, మోక్షం, సకల సంపదలతో తులతూగుతుందని శ్రీ విద్యాధరి క్షేత్ర వ్యవస్థాపకులు, బ్రహ్మశ్రీ, యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి పేర్కొన్నారు. వర్గల్ క్షేత్రం వద్ద శనివారం సాయంత్రం జరిగిన కార్తీక దీపోత్సవం సందర్భంగా భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడారు. పరమేశ్వరునికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీక మాసంలో స్వామివారిని అర్చిస్తే అంతా మంచే జరుగుతుందని, అలాగే కార్తీక వెలుగులతో అజ్ఞానాంధకారం తొలిగి జ్ఞానం సిద్ధిస్తుందని తెలిపారు. ఈ మహిమాన్విత మాసంలో ఈశ్వర ఆరాధన చేస్తే జన్మజన్మల పాపాలు తొలగి అనంతమైన పుణ్య ఫలాలు సిద్ధిస్తాయని, అంతేకాకుండా దీపారాధనతో పరమేశ్వరుడిని ప్రసన్నం చేసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంతాన మల్లికార్జున క్షేత్ర వ్యవస్థాపకులు, బ్రహ్మశ్రీ, డాక్టర్ హరినాథ శర్మ మాట్లాడుతూ చిత్తశుద్ధి, సత్సంకల్పంతో ఆనందమయ జీవితం గడపవచ్చని, ముఖ్యంగా మోక్ష మార్గానికి దిక్సూచిగా పుణ్య స్థలాలు, పురాతన క్షేత్రాలు మార్గదర్శకం కల్పిస్తాయని స్పష్టం చేశారు. లోక కళ్యాణార్థమై నిర్వహించిన ఈ కార్తీకదీపోత్సవంలో పాల్గొన్న భక్తులకు అంతా మంచే జరగనుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమావతి ఆర్డీవో చంద్రకళ పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదం మహిళ మృతి

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్15: మాసాయిపేట మండల కేంద్రంలోని 44 జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో మహిళ అక్కడికక్కడే మరణించారు. తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన పాటి చంద్రం ఆయన భార్య లక్ష్మి కుమారుడు తరుణ్ రామంతపూర్ ప్రైవేట్ పాఠశాలలో ఫీజు చెల్లించి తిరిగి ఇంటికి వెళుతుండగా వెనుక వైపు నుండి లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఇందులో పాటి లక్ష్మి (32) తల మెదడు చితికిపోయి అక్కడికక్కడే మరణించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న పాటి చంద్రం కుమారుడు తరుణ్ లను ఆసుపత్రికి తరలించారు.



యువజన ఉత్సవాలను విజయవంతం చేయండి

- జిల్లా యువజన క్రీడా అధికారి జంగపల్లి వెంకట నరసయ్య

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 15: సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విపంచి కళా నిలయంలో ఈ నెల 18న జరిగే యువజన ఉత్సవాలను విజయవంతం చేయాల్సిందిగా యువజన సంఘాల ప్రతినిధులను జిల్లా యువజన క్రీడా అధికారి జంగపల్లి వెంకట నరసయ్య కోరారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహించే యువజన వారోత్సవాల్లో భాగంగా జిల్లాస్థాయి యువజన వారోత్సవం, సైన్స్ మేళా నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. యువజన సంఘాల భాగస్వామ్యంతోనే ఏ కార్యక్రమం అయినా చేపట్టవచ్చు అని ఆయన అభిప్రాయపడ్డారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని యువకులకు ప్రతిభ పాటలను వెలికి తీసి కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు తదితర పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ ఉత్సవాల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన వారిని అనంతరం రాష్ట్ర జాతీయ స్థాయి పోటీలకు పంపనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పోటీలలో పాల్గొనాలని ఆసక్తిగల ఔత్సాహికులు తమ పేర్లను జిల్లా క్రీడా శాఖలో నమోదు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో యువజన అవార్డు గ్రహీతలు డాక్టర్ నరసింహులు, వలస సుభాష్ అధికం రాజు, తిప్పర్తి కృష్ణ, చేకూరి విజయ్, వంశీ స్వామి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల డాక్టర్డాక్టరేట్ పొందిన నరసింహులుకు క్రీడా శాఖ అధికారి జంగపల్లి వెంకట నరసయ్య యువజన సంఘాల సభ్యులు పక్షాన ఘనమైన సన్మానం చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- సిద్దిపేట సీపీ విజయ్‌కుమార్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 15: రాజీవ్ రహదారిపై పెరుగుతున్న ప్రమాదాలను తగ్గించేందుకు సిద్దిపేట పోలీసు కమిషనర్ విజయ్‌కుమార్ శనివారం మొదటిసారి రోడ్ సేఫ్టీ ఆడిట్ నిర్వహించారు. ఈ ఆడిట్‌లో భాగంగా జిల్లా ప్రవేశ ప్రాంతమైన వంటిమామిడి గ్రామం నుండి దుద్దెడ వరకు రహదారిని విశ్లేషణాత్మకంగా పరిశీలించి ప్రమాదకర ప్రాంతాలపై కీలక సూచనలు చేశారు. ఈ ఆడిట్‌లో సిపి తో పాటు హెచ్కేఆర్ ఇన్‌ఫ్రా డీజీఎం విజయ్ భాస్కర్ రెడ్డి, సైట్ ఇంజనీర్లు శ్రీనివాస్, కిషోర్, హైదరాబాద్ఆర్ అండ్ బీ కన్సల్టెంట్ పీవీ రావు రహదారిపై పగుళ్లు, గుంతలు, దెబ్బతిన్న ప్రాంతాలను, నీటి నిల్వ ప్రాంతాలను గుర్తించి వెంటనే మరమ్మత్తులు చేయాలని సూచించారు. వాహనదారులకు ఆటంకం కలిగిస్తున్న చెట్ల కొమ్మలను వెంటనే తొలగించాలని, రాత్రివేళల్లో ఇవి డ్రైవింగ్ విజిబిలిటీని తగ్గించి ప్రమాదాలకు కారణమవుతున్నాయని సూచించారు. అవసరమైన చోట్ల బస్‌బేలు ఏర్పాటు చేయటం, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు, ప్రమాద సూచనలను ఏర్పాటు చేయడం వంటి చర్యలను హెచ్కేఆర్ ఇంజనీర్లు తక్షణం చేపట్టాలని ఆదేశించారు.



కొమురవెల్లి జాతర పై ప్రత్యేక దృష్టి..

త్వరలో జరగనున్న కొమురవెల్లి జాతర కారణంగా రాజీవ్ రహదారిపై భారీగా భక్తుల రద్దీ పెరుగుతుందని భావిస్తున్నందున, రోడ్డు మరమ్మత్తులు అవసరమైన భాగాల్లో క్లియరెన్స్ వంటి పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. రోడ్డుపై, డివైడర్లపై, విద్యుత్ స్తంభాలపై ఏర్పాటు చేసిన అనధికారిక ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అవి డ్రైవర్ల దృష్టిని అడ్డుకొని ప్రమాదాలకు దారితీస్తున్నాయని హెచ్చరించారు. పోలీసు అధికారులు హైవే అథారిటీతో సమన్వయం చేసుకుని ఫ్లెక్సీలను తొలగించనున్నారు. ఆడిట్ సమయంలో స్థానికులు తమ సమస్యలను వివరించగా, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ నర్సింహులు, సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్, ఇన్స్పెక్టర్లు, ఎస్ఐ లు, సిబ్బంది, హెచ్కేఆర్ ఇంజనీర్లు శ్రీనివాస్, కిషోర్ పాల్గొన్నారు.



మా గ్రామానికి రోడ్డు వేయండి

- దుబ్బాక ఎమ్మెల్యేను కలసిన అందె గ్రామ జేఏసీ నాయకులు

ప్రతిపక్షం, మిడిదొడ్డి, నవంబర్ 15: మిడిదొడ్డి మండల పరిధిలోని మారుముల గ్రామమైన అందే గ్రామానికి మూడు వైపులా ఉన్న రోడ్లు గుంతలుగా మారాయని, అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాల నుండి తమను కాపాడాలని దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభకర్ రెడ్డిని కలిసి జేఏసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. గత ఇరవై సంవత్సరాల కాలంలో వేసిన అందె, మిడిదొడ్డి పంచాయతీ రాజ్ రోడ్డు పూర్తిగా ధ్వంసం అయ్యిందని, అందే నుండి మిడిదొడ్డి వరకు, గుంతలు పడి, కంకర తేలి, ప్రజలు పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారి దృష్టికి తీసుకువచ్చారు. కనీసం ఈ ప్రభుత్వానికైనా మా గోడును తెలియజేసి మా ఊరికి రోడ్లు వేయించాలని, సికింద్రాబాద్కు బస్సు సౌకర్యం కల్పించాలని, మిరుదొడ్డి మండల పరిసర ప్రాంతలలో కూరగాయల విక్రయకేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా కొత్త ప్రభాకర్‌రెడ్డి రోడ్లు వేయించే బాధ్యత తీసుకుంటామని, పంచాయతీ రాజ్ డీఈఈకి ఫోన్ చేసి ఎస్టిమేషన్ పంపాలని కోరారు. డిపో మేనేజర్ తో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమం లో జేఏసీ కన్వీనర్ వారల రాజు కుమార్, అందె ప్రవీణ్, నర్సింహా రెడ్డి, సతీష్, పర్శ రాములు, తరుణ్, కుమార్, అఖిల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్‌లో ఓడిపోయినా కేటీఆర్ కు బలుపు తగ్గలేదు. నువ్వే అభ్యర్థి లాగా తిరిగావ్... మాగంటి సునీతను అభ్యర్థిగా నిలబెట్టినా ఆమెతో కనీసం మాట్లాడనివ్వలేదు. మా అభ్యర్థికి 25వేల మెజారిటీ వస్తే బొటాబొటీతో గెలిచారు అంటున్నావ్... నీకు సిగ్గు లేదా... ఆత్మ పరిశీలన చేసుకో... నీతోనే బీఆర్ఎస్‌పతనం అవడం ఖాయం.

- కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



ఆదివాసీ సమాజానికి మార్గదర్శి బిర్సా ముండా

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 15: ఆదివాసీ సమాజానికి మార్గదర్శిగా బిర్సా ముండా ప్రసిద్ధి చెందారని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. భగవాన్ బిర్సా ముండా 150వ జయంతిని స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్ ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలు వేసి, జ్యోతి వెలిగించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ భారత దేశాలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా గిరిజన హక్కుల కోసం పోరాడిన మహానాయకుడు బిర్సా ముండా త్యాగాలను, ఆదర్శాలను గుర్తుచేశారు. ఆయన జీవితమే ఆదివాసీ హక్కుల సాధనకు, స్వాతంత్ర్య పోరాటానికి స్ఫూర్తి దాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య ట్రైబల్ వెల్ఫేర్ అధికారి నీలిమ, విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌తో పెండింగ్ కేసులను పరిష్కరిస్తున్నాం

- జిల్లా అడిషనల్ న్యామూర్తి జయప్రసాద్

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 15: సిద్దిపేట జిల్లాలోని పలు కోర్టులలో మొత్తం 16,642 కేసులు పెండింగ్లో ఉన్నట్లు జిల్లా అడిషనల్ న్యాయమూర్తి జయప్రసాద్ తెలిపారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టులో స్పెషల్ లోక్ అదాలత్ ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి ప్రారంభించారు. అంతకుముందు జిల్లా కోర్టులో మెడికల్ క్యాంపును జిల్లా అడిషనల్ జడ్జ్ జయప్రసాద్ ప్రారంభించారు. లోక్ అదాలత్ తో పెండింగ్ కేసులను పరిష్కరిస్తున్నట్లు జిల్లా న్యాయమూర్తులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ జడ్జి జయప్రసాద్ మాట్లాడుతూ.. డ్రంక్ అండ్ డ్రైవ్ లో నిందితులకు రూ.10 వేల జరిమానా, జైలు శిక్షలు వేయడం జరుగుతుందని న్యాయమూర్తులు తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కోర్టులో స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందన్నారు.



రైతుల కష్టాలు తెలిసిన వ్యక్తి తుమ్మల నాగేశ్వరరావు

కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కోకన్వీనర్ నాయిని నరసింహారెడ్డి

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 15: రైతుల కష్టాలు తెలిసిన వ్యక్తి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ శాఖ మంత్రిగా ఉండడం తెలంగాణ రైతుల అదృష్టమని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కోకన్వీనర్ నాయిని నరసింహారెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో మంత్రి నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రైతుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాయిని నరసింహారెడ్డి మాట్లాడారు. సిద్దిపేట మార్కెట్ యార్డ్ లో మొక్కల కొనుగోలు సమస్య ఉందని తెలుపగానే వెంటనే స్పందించి నాగేశ్వరరావు కొనుగోలు టార్గెట్ ను పెంచారని గుర్తుచేశారు. ఆయన ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ నాయకులు రాజిరెడ్డి, యాదిరెడ్డి, సత్యనారాయణ, తిరుపతి రెడ్డి, నర్సింగం పలువురు పాల్గొన్నారు.



కొమ్ము కిషన్ మరణం తీరని లోటు

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

ప్రతిపక్షం,తొగుట, నవంబర్ 15 : తెలంగాణ ఉద్యమకారులు ఘనపూర్ కు చెందిన కొమ్ము కిషన్ అకాల మరణం బాధాకరమని, వారి కుటుంబానికి అండగా ఉంటామని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి హామీ ఇచ్చారు ఘనపూర్ లో ఇటీవల మరణించిన కొమ్ము కిషన్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. బీఆర్ఎస్ పార్టీలో మొదటి నుండి పనిచేసిన కొమ్ము కిషన్ జైలుకు సైతం వెళ్లాడని ఆయన గుర్తు చేశారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం అందించారు. అలాగే ఘణపూరులోని యాటెల్లి రాజును ఎమ్మెల్యే పరామర్శించారు. ఇటీవల రాజు తండ్రి మరణించడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఇటీవల ప్రమాదానికి గురైన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త మంగలి యాదగిరిని ఎమ్మెల్యే పరామర్శించారు. అలాగే రాంపూర్ లో ఇటీవల మరణించిన బీఆర్ఎస్ యువ నాయకుడు తోయేటి వెంకటేశం కుటుంబాన్ని అలాగే అప్పనపల్లి రాములు కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు.వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ సొసైటీ చైర్మన్ హరికృష్ణ రెడ్డిని గుడికందులలో ఎమ్మెల్యే పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన ఇటీవల వివాహం చేసుకున్న కొక్కొండ నాగార్జున రెడ్డి అఖిల దంపతులను ఎమ్మెల్యే ఆశీర్వదించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

విద్యార్థినిలు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. రాంపూర్లోని బాలికల గురుకుల కళాశాలను ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో నెలకొన్న విద్యుత్, తాగునీటి, క్రీడాస్థల సమస్యలను ప్రిన్సిపాల్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మండల పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, నాయకులు చిలువెరి మల్లారెడ్డి, సుకూరి లింగం, బాలరాజు, బోధనం కనకయ్య, సుతారి రమేష్, కొమ్ము శరత్, కుర్మ యాదగిరి, బాలరాజు, ఎల్లం,, శ్రీనివాస్ గౌడ్, మంగ నర్సింలు, యాదగిరి, అశోక్, రాజిరెడ్డి, భైరాగౌడ్, బాల్ రెడ్డి, బైరారెడ్డి, జంగిడి బిక్షపతి, రాజశేఖర్, బండారు స్వామి గౌడ్ తదితరులు ఉన్నారు.

కొమురవెల్లి మల్లన్న బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ హైమవతి



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 15: కొమురవెల్లి శ్రీమల్లికార్జున స్వామి వారి కళ్యాణం, జాతర, బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై శనివారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ కే. హైమావతి అధ్యక్షుతన సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొమురవెల్లి లో డిసెంబర్ 14న ఉదయం 10:45 నిమిషాలకు స్వామి వారి కళ్యాణం నిర్వహించబడుతుందన్నారు. 18 జనవరి 2026 నుండి 16 మార్చి 2026 వరకు ప్రతి ఆదివారం, బుధవారంలలో జాతర అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ జాతరకు జిల్లా నుండే కాకుండా హైదరాబాద్, సికింద్రాబాద్ , రాష్ట్రవ్యాప్తంగా ఇతర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు వస్తారు కాబట్టి వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా సంబంధిత శాఖలకు సమన్వయంతో ముందస్తు ఏర్పాటు చేయాలని, జాతర జరిగినన్ని రోజులు శాఖలకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. ఈ సారి మేడారం జాతర కూడా ఉన్నందున అక్కడికి వెళ్లే భక్తులు లేదా అక్కడి నుండి దర్శనం చేసుకొని వచ్చే భక్తులు మల్లన్న దర్శనానికి వచ్చే అవకాశం ఉన్నందున భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నదని, ఎలాంటి అంచనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి మానిటరింగ్ చేయాలని, పార్కింగ్, బ్యారికేడింగ్ చేసి భక్తుల రద్దీని కంట్రోల్ చేయాలని, పోలీస్ కంట్రోల్ రూమ్ లో మైకుల ద్వారా అవసరమైన విషయాలను అనౌన్స్ చేయాలని, లడ్డు కౌంటర్ లను మరింత పెంచి భక్తులు ఒకే చోట గుమి కాకుండా చూడాలని, భక్తుల క్యూ లైన్ ను సరిగా మేయింటైన్ చేయాలని, దర్శనానికి వచ్చే భక్తులకు అన్నదానం సమయంలో రద్దీ కలుగకుండా వివిధ ప్రాంతాలలో అన్నదానం చేయాలని, విధులు నిర్వహించే సిబ్బందికి భోజన వసతి ఎక్కడికక్కడే ఏర్పాటు చేయాలన్నారు. శాశ్వత మరుగుదొడ్ల నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, పంచాయతీరాజ్ ద్వారా నిర్మాణంలో ఉన్న వివిధ నిర్మాణాలను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని, విద్యుత్ సమస్యలు ఎదురుకాకుండా, ప్రమాదాలు జరగకుండా విద్యుత్ లైన్లను ముందస్తుగా సరి చేసుకోవాలని, అదనంగా అవసరమైన ట్రాన్స్ఫార్మర్లను సమకూర్చాలని అన్నారు. మెడికల్ క్యాంప్ లను ఏర్పాటుచేసి వైద్య సిబ్బందిని 3 షిఫ్ట్ లలో 24 గంటలు అందుబాటులో ఉంచాలని, అవసరమైన మందులను, అంబులెన్స్ ను అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. పారిశుద్ధ్యం అతి ముఖ్యమైనదని అవసరమైన సంఖ్యలో సానిటేషన్ సిబ్బందిని నియమించుకొని మూడు షిఫ్టులలో శానిటేషన్ కార్యక్రమాలు పగడ్బందీగా నిర్వహించాలని, త్రాగునీరు సమస్య రాకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, మద్యం అమ్మకాలు జరుగకుండా చూడాలని, ట్రాఫిక్ సమస్య కాకుండా ఆర్టీసీ బస్సులను రూట్ల వారీగా నడపాలని, నిర్దేశిత ప్రాంతాల్లో మాత్రమే పార్కింగ్ చేయాలని, అగ్నిమాపక యంత్రాలు సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ కుశాల్కర్, హుస్నాబాద్ ఏసీబీ సదానందం, ఆలయ ఈవో వెంకటేశ్వర్, కొమురవెల్లి సిఐ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ధన్ రాజ్, డిపిఓ విజయ్ కుమార్, విద్యుత్, ఆర్డబ్ల్యూఎస్, టీజీఎస్ఆర్టిసి, ఆర్ అండ్ బి, అగ్నిమాపక మరియు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కన్నతల్లి లాంటా పార్టీని విమర్శించడం సిగ్గుచేటు

- కాంగ్రెస్ మెప్పు కోసం బీఆర్ఎస్ నేతలను విమర్శిస్తున్న కవిత
- మెదక్ మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 15 :- కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెప్పుకోసం కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత విమర్శించడం సిగ్గుచేటని మెదక్ మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్ అన్నారు. శనివారం మెదక్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున గౌడ్, పట్టణ పార్టీ కన్వీనర్ మామిండ్ల ఆంజనేయులు, న్యాయవాది జీవన్ రావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత మెదక్లో సమాజం తలదించుకునే విధంగా మాట్లాడారని, యావత్ తెలంగాణ సమాజం తీవ్రంగా ఖండిస్తుందని తీవ్ర స్థాయిలో విమర్శించారు. కవిత తిన్నింటి వాసాలు లెక్కించే విధంగా, కన్నతల్లి లాంటి పార్టీని, పార్టీ అధినేత కేసిఆర్, కేటీఆర్, హరీష్ రావును విమర్శిస్తూ మాట్లాడడం సిగ్గు చేటని అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నిక విషయమై కవిత మాట్లాడిన విధానం అవమానకర రీతిలో ఉన్నాయని ధ్వజమెత్తారు. ఎంపీగా ఓడిపోయి తల్లి దగ్గర వెళ్లి ఏడిస్తే కేసీఆర్ ఎమ్మెల్సీ ఇచ్చి పార్టీ ఆదరణ చూపించారని, అలాంటి పార్టీ మీద మెదక్ వచ్చి ఇష్టం వచ్చినట్టు నోరు పారేసుకుంటారా..? అని అన్నారు. ఈ మీడియా సమావేశంలో మెదక్ హవేలీ ఘనపూర్ మండల పార్టీ అధ్యక్షులు యం.అంజయ్య గౌడ్, సీహెచ్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు ఆర్కే శ్రీనివాస్, భీమరి కిషోర్, వంజరి జయరాజ్, మాయ మల్లేశం, నాయకులు ప్రభు రెడ్డి, జుబెర్ అహ్మద్, శ్రీను నాయక్, రంజిత్, లడ్డు తదితరులు పాల్గొన్నారు.



సీఐటీయూ జిల్లా మహాసభలను
జయప్రదం చేయండి

- జిల్లా నాయకుడు దాసరి ప్రశాంత్

ప్రతిపక్షం, నంగునూరు, నవంబర్ 15: సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 16 వ తేదీన సీఐటీయూ సిద్దిపేట జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా నాయకుడు దాసరి ప్రశాంత్ తెలిపారు. నంగునూరులోని హమాలీ సంఘం కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం, హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసే సంఘం సీఐటీయూ అన్నారు. జిల్లా నాలుగవ మహాసభలను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి విజ్ఞప్తి చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మికుల హక్కులను కాలరాసే విధంగా నాలుగు లేబర్ కోడ్ లను తీసుకు వచ్చిందన్నారు. ఆదివారం జరిగే సీఐటీయూ సిద్దిపేట జిల్లా నాలుగో మహాసభలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లయ్య, కనకరాజు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు



భక్తులతో కిక్కిరిసిన నాచగిరి క్షేత్రం

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 15: కార్తీకమాసం చివరి శనివారం పురస్కరించుకొని వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం భక్తులతో కిక్కిరిసిపోయినది, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతములు 225, స్వామి వారి కళ్యాణములు 15 జంటలు ఆచరించి పునీతులైనారు. వేకువజాము నుండే భక్తులు స్వామి వారి దర్శనమునకు భారలుతీరినారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్తా, కార్యనిర్వహణాధికారి విజయ రామారావు ప్రత్యక్షంగా ఏర్పాట్లు పర్యవేక్షించారు. తదుపరి శ్రీ వాగ్దేవి వైదిక కళ నిత్య సంస్కృతి, హైదరాబాద్, వారిచే సుమారు 50 మంది పిల్లలచే భరతనాట్యం, కూచిపూడి మొదలగు నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వారికి దేవస్థానం తరపున చైర్మన్ మరియు కార్వ నిర్వహణాధికారి ప్రశంసా పత్రాలు అందజేసినారు. నిర్వాహకులకు స్వామి వారి శేష వస్త్రంతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేసినారు. సాయంత్రం ఆకాశ దీపారాధన మరియు కార్తీక దీపోత్సవం భక్తులతో జరిపించి కార్తీక పురాణాన్ని వేద పండితులచే పట్టించడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో ధర్మకర్త నాయకం శ్రీనివాస్, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు చెల్లింపులో వేగం పెంచాలి

- ట్యాగ్ చేసిన మిల్లులకే ధాన్యం తరలించాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 15: ధాన్యం డబ్బులు చెల్లింపులలో మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండల కేంద్రంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం తహసిల్దార్ సతీష్ తో కలిసి పరిశీలించారు. ముందుగా కేంద్రానికి ఇప్పటివరకు వచ్చిన ధాన్యం ఎంత, అందులో ఎంత మేరకు కొనుగోలు చేసారు. ఇంకా తేమ శాతం రావాల్సిన ధాన్యం ఎంత ఉంది, కొనుగోలు పూర్తి అయిన ధాన్యం వివరాలు ఆన్లైన్ లో నమోదు చేసారా లేదా, అలాగే కొనుగోలు అయిన ధాన్యం ట్యాగ్ చేసిన మిల్లులకి తరలిస్తున్నారా లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు .ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ ఖరీఫ్ సీజన్ కి సంబందించి ధాన్యం డబ్బుల చెల్లింపులలో మరింత వేగం పెంచి ముందుకు పోవాలని తెలిపారు. తేమ శాతం వచ్చి కొనుగోలుకి సిద్ధంగా ఉన్న ధాన్యం కొనుగోలు వేగవంతం గా జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సతీష్,కొనుగోలు కేంద్ర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యశాలను సందర్శించిన కలెక్టర్

పాపన్నపేట మండలం ఎల్లాపూర్ గ్రామంలోని పశువైద్యశాలను కలెక్టర్ రాహుల్ రాజ్ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. వైద్య సేవలు, మందుల రికార్డులను పరిశీలించారు. పశు వైద్యశాలకు క్రమం తప్పకుండా విధులకు హాజరు కావాలని ఆదేశించారు. హాస్పిటల్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని,ఎప్పుడు పాడి రైతులకు అందుబాటులో ఉండి పాడి పశువుల సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించి వైద్య సేవలు అందించాలని సూచించారు.కలెక్టర్ వెంట పశు వైద్య అధికారి, సిబ్బంది తదితరులు ఉన్నారు .



“

ఏరో ఇంజన్ రాజధానిగా తెలంగాణను తీర్చిదిద్దుతాం. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్య సాధనలో ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలదే కీలక పాత్ర. ఇప్పటికే 25కు పైగా 'ఏ &డీ' సంస్థలు, 1500కు పైగా ఎంఎస్ఎంఈలు ' టీజీ బ్రాండ్'ను విస్తరించాయి. రూ. 800 కోట్లతో జేఎస్ డబ్ల్యూ డిఫెన్స్ 'యూఏవీ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్', రూ500 కోట్లతో ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ డిఫెన్స్ ఫెసిలిటీ వస్తున్నాయి.

- మంత్రి శ్రీధర్‌బాబు

ప్రాంతీయం





మత్స్య సంపద అభివృద్ధికి పెద్ద అడుగు

- మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి
- హుస్నాబాద్‌లో ఉచిత చేప పిల్లల పంపిణీ

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 15: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఎల్లమ్మ చెరువులో 5.17 లక్షల రూపాయల ఖర్చుతో 3 లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి వాకిటి శ్రీహరి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ పాల్గొన్నారు. ఉచిత చేప పిల్లల పంపిణీ ద్వారా 253 మంది మత్స్యకారుల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. నియోజకవర్గంలోని మొత్తం 165 చెరువుల్లో 38.92 లక్షల ఉచిత చేప పిల్లలను విడుదల చేయనున్నారు. ఈ పథకం ద్వారా మొత్తం 4,144 మంది మత్స్యకారుల కుటుంబాలకు మద్దతు లభిస్తుంది. చెరువుల వద్ద చేపల రకం, సంఖ్య తదితర వివరాలను స్పష్టంగా తెలియజేసే సైన్ బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా పంపిణీని పారదర్శకంగా నిర్వహిస్తారని అధికారులు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హుస్నాబాద్‌లో వెటర్నరీ హాస్పిటల్ నూతన భవనం నిర్మించడం, అసంపూర్ణంగా ఉన్న మోడర్న్ చేపల మార్కెట్‌ను పూర్తి చేయడం, వెటర్నరీ డాక్టర్ పోస్టులను మంజూరు చేయడం, గోపాల మిత్ర సమస్యలను పరిష్కరించడం వంటి అభివృద్ధి చర్యలను సూచించారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ హుస్నాబాద్ పశువైద్యశాల ఆధునీకరణ, చేపల మార్కెట్, స్టోరేజ్ సెంటర్, పాల శీతలీకరణ కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే గురుకులల్లో కూడా చేపలను మెనూలో చేర్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సంవత్సరం 26,000 చెరువుల్లో 84 కోట్ల చేప పిల్లలు, 10 కోట్ల రొయ్యలు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 5 లక్షల మంది మత్స్యకారుల కుటుంబాలు ప్రత్యక్ష లబ్ధి పొందుతాయని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ప్రమాదాల వలన మత్స్యకారులు మరణించిన సందర్భంలో కుటుంబాలకు 5 లక్షల రూపాయల గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పాలసీ ద్వారా భరోసా ఇవ్వబడుతుంది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమవతి, మార్కెట్ కమిటీ చైర్మన్లు, మత్స్య సహకార సంఘాల నాయకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ట్రాలీ బోల్తా 20 మంది కూలీలకు గాయాలు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 15: వ్యవసాయ కూలీలు ప్రయాణిస్తున్న ట్రాలీ జమ్మికుంట మండలం తనుగుల పెట్రోల్ బంక్ క్రాస్ వద్ద బోల్తా పడింది. వీణవంక మండలం ఎలబాక గ్రామానికి చెందిన 20 మంది కూలీలు గాయపడ్డారు. అతి వేగంతో అదుపు తప్పడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ఎనిమిది మందికి కాళ్లు, చేతులు విరిగినట్లు సమాచారం. క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తరలించారు.

లారిని ఢీకొన్న ఆర్టీసీ బస్సు .. పలువురికి గాయాలు

కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం సదాశివపల్లి వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టిసి బస్సు లారీని వెనుక నుంచి ఢీ కొట్టడంతో 15 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలు అయ్యాయి. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న మానకొండూర్ సిఐ సంజీవ్ క్షతగాత్రులను108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో బస్సు లో 60 ప్రయాణికులు ఉన్నారు. ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



పత్తి తీసుకు రావద్దు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్ (పెద్దపల్లి,) నవంబర్-15: నవంబర్ 17 నుంచి జిల్లాలోని మార్కెట్ యార్డులు, సీసీఐ ప్రైవేట్ కేంద్రాలకు పత్తి తీసుకొని రావద్దని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రైతాంగానికి విజ్ఞప్తి చేస్తూ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారత పత్తి సంస్థ పత్తి జిన్నింగ్ మిల్లుల విషయంలో విధించిన నిబంధనలు సడలించే వరకు నవంబర్ 17 నుండి రాష్ట్ర వ్యాప్తంగా సీసీఐ కొనుగోలు, ప్రైవేటు కొనుగోలు పూర్తిగా నిలుపుదల చేస్తున్నట్లు జిన్నింగ్ మిల్లు యాజమాన్యం తెలిపారు. ఈ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు రైతులు మార్కెట్ కు గాని లేదా జిన్నింగ్ మిల్ వద్దకు పత్తి తీసుకొని రావద్దని అన్నారు. ఆ సీసీఐ కు పత్తి అమ్ముకునే రైతులు తమ యొక్క స్లాట్ బుకింగ్ అయినా కూడా పత్తి తీసుకు రావద్దని తెలిపారు. కొనుగోళ్ల విషయంలో తదుపరి ఆదేశాలు వచ్చేవరకు రైతులు పత్తిని అమ్మకానికి తీసుకొని రావద్దని కలెక్టర్ స్పష్టం చేశారు.

మధ్యాహ్నం భోజన కార్మికుల వేతనాలు చెల్లించాలి

- కార్మికుల యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి శ్రీధర్

ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల, నవంబర్ 15: మధ్యాహ్న భోజన నిర్వహణ కార్మికుల 6 నెలల బిల్లులు, వేతనాలు, 10, నెలల గుడ్ల బిల్లులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. మధ్యాహ్నం భోజన కార్మికులకు గత ఆరు నెలలుగా వేతనాలు, నిర్వహణ బిల్లులు, 10, నెల ల కోడిగుడ్ల బిల్లులను వెంటనే చెల్లించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా మధ్యాహ్నం భోజన కార్మికుల యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి గురి జాల శ్రీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయము విద్యాశాఖ అధికారి గారికి కార్మికుల సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. అనంతరం శ్రీధర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులకు గత ఆరు నెలలుగా వేతనాల నిర్వహణ బిల్లులు మరియు 10 నెలల కోడిగుడ్ల బిల్లును చెల్లించడం లేదని, ప్రభుత్వం గుడ్లకు ఇచ్చే బడ్జెట్ కి రెండు గుడ్లు కూడా రావడంలేదని పైగా మూడు కోడిగుడ్లు పెట్టాలని అధికారులు స్కూల్ సిబ్బంది ఒత్తిడి చేస్తున్నారని



పెట్టిన వాటికే పది నెలల నుండి బిల్లులు పెండింగ్లో ఉంటే కార్మికులు ఎంతకాలం అప్పుచేసి పెడతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పెండింగ్ వేతనాలు, బిల్లులు చెల్లించాలని అధికారుల చుట్టూ కార్మికులు చెప్పులు అరిగేలా తిరిగిన ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మీ బిల్లులు యూక్లియర్లో ఉన్నాయని మాకు సంబంధం లేదని అధికారులు చేతులు దులుపుకుంటున్నారని మధ్యాహ్న భోజన నిర్వహణ సక్రమంగా సాగాలంటే బకాయి వేతనాలు బిల్లులు తక్షణమే చెల్లించాలని యూ కుబేర్, మధ్యాహ్న భోజన బిల్లులు మధ్యాహ్న భోజన బిల్లులు విదులను మినాయించి గ్రీన్ ఛానల్ ద్వారా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం కార్మికుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో జమ చేయాలని అన్నారు. కేటాయించిన బడ్జెట్ పాత మెనుకే సరిపోవడంలేదని కొత్త మెనూ ఎలా పెట్టాలని అన్నారు. కొత్త మెనూకి అదనంగా బడ్జెట్ కేటాయించి కార్మికులకు అదనపు పనికి అదనపు వేతనం చెల్లిస్తేనే నిర్వహణ చేయడం సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. దసరా పండుగ రోజున కూడా కార్మికులు తమ కుటుంబాలను పస్తులించిన పరిస్థితి దాపురించిందని, ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి బిల్లులు వారి ఖాతాలో వెయ్యాలని లేనిపక్షంలో మధ్యాహ్న భోజన కార్మికులు నిరావాదిక సమ్మెలో వెళ్లడానికి కూడా వెనకాడబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మధ్యాహ్న భోజనకార్మిక యూనియన్ కార్యదర్శి గురజాల శ్రీధర్, జిల్లా సిపిఎం నాయకులు మల్లారపు అరుణ్ కుమార్,కోనరావుపేట మండల మధ్యాహ్న భోజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గొట్టే బాలమని, పులి వసంత, వెంకట లక్ష్మీ,గడ్డం పద్మ, మ్యకాలా, కవిత, బుజ్జి గౌరవ్వ, లింగు రాధా తదితరులు మధ్యాహ్న భోజన కార్మికులుపాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఫలితం ఊహించిందే

- సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి



ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల, నవంబర్ 15: జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల ఫలితం తాము ఊహించిందేనని, ఈ ఉప ఎన్నిక ఫలితం చూసి కేటీఆర్ తన బీఆర్ఎస్ పార్టీని రద్దు చేసుకుంటారా లేక రాజకీయాల నుంచి తప్పుకుంటారా? అని సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేకే మహేందర్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీ పైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన దక్షిత పైన విశ్వాసం ఉంచారని జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితం తాము ఊహించిందేనని రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కేకే మహేందర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితం చూసి కేటీఆర్ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్నారని తన బిఆర్ఎస్ పార్టీని రద్దు చేసుకుంటారా అని అన్నారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా కేటీఆర్ అవాకులు చేవాకులు పేలుతూ తనకు సంబంధించిన యూట్యూబ్ ఛానెల్స్, సోషల్ మీడియాలో విష ప్రచారాలను చేస్తూ ఉత్తరప్రగల్బాలు పలికారని జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రెఫరండమని ప్రజా ప్రభుత్వానికి కనువిప్పు అని అన్నాడని కేటీఆర్ అన్నట్లుగా రెఫరెండం ఐతే రాజకీయాల నుండి తప్పుకుంటారా అని అన్నారు. కేటీఆర్ ఇకనైనా తన అహంకారం తగ్గించుకోవాలని రాజకీయాల్లో తండ్రి చాటు కొడుకుగా వచ్చిన వ్యక్తి కేటీఆర్ అని కేసీఆర్ లేకపోతే కేటీఆర్ ఎక్కడివాడని ఈ సందర్భంగా అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం వెలువడిన అనంతరం కేటీఆర్ చెల్లె కవిత ట్విట్టర్ లో కర్మ సిద్ధాంతం రిపీట్ అనే పోస్ట్ చేసిన వైనం ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేటీఆర్ ఇకనైనా రాజకీయాల్లో హుందాతనంగా మసులు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ కాంగ్రెస్ నాయకులు ఆకునూరి బాలరాజు సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్మన్ వేముల స్వరూప రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ముంపు భూముల రైతులకు
రూ. 23.50 కోట్ల పరిహారం మంజూరు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 15: శ్రీపాద సాగర్ ఎల్లంపల్లి ప్రాజెక్టు స్టేజ్ 2 భాగంగా గంగాధర మండలం నారాయణపూర్ జలాశయం, కెనాల్ ముంపు భూముల రైతులకు పరిహారం ప్రభుత్వం విడుదల చేసింది. రూ.23 కోట్ల 50 లక్షల నిధులను మంజూరు చేస్తూ ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీపాద సాగర్ ఎల్లంపల్లి ప్రాజెక్టు స్టేజి 2 ద్వారా నారాయణపూర్, స్తంభంపల్లి చెరువుల విస్తరణ, నారాయణపూర్ నుండి వేములవాడ, స్తంభంపల్లి చెరువులకు గ్రావిటీ కెనాల్ నిర్మాణం కోసం భూములను సేకరించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక కృషి తో పరిహారం చెల్లింపునకు ప్రభుత్వానికి విన్నవించడంతో ఈ నిధులు మంజూరు అయ్యాయి. భూములు కోల్పోయిన వారికి పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం ఈ నిధులను మంజూరు చేసింది.



రూ. 20 లక్షల సొత్తు స్వాధీనం

- 15 కేసుల మిస్టరీ ఛేదన,- 6గురు అరెస్టు
- ఏసీపీ, పోలీసు బృందం కృషిని అభినందించిన సీపీ

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 15: కరీంనగర్ జిల్లా గ్రామీణ ప్రాంత పరిధిలో గత కొన్ని నెలలుగా రైతులు, పౌరుల ఆస్తులకు నష్టం కలిగించిన దొంగతనాల కేసులను జిల్లా పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ప్రధానంగా 12 కాపర్, కరెంట్ మోటార్ వైర్ దొంగతనాలు, మరియు 3 పశువులు, పందులు, గొర్రెలుమేకల దొంగతనాల కేసుల (మొత్తం 15 కేసులు) మిస్టరీని ఛేదించి, ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు.చొప్పదండిలోని గుమ్లాపూర్ చౌరస్తా వద్ద పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీలలో అనుమానాస్పదంగా వెళ్తున్న ఒక బొలెరో క్యాంపర్ మరియు ఒక అశోక లేల్యాండ్ వాహనాలను ఆపి తనిఖీ చేయగా, ఈ దొంగతనాలలో పాల్గొన్న నిందితులు పట్టుబడ్డారు. దొంగల ముఠా సభ్యులు, రిసీవర్ల అరెస్టు చేశారు. పట్టుబడిన నిందితులు గతంలో పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన 15 కేసుల్లో పాల్గొన్నట్లు దర్యాప్తులో తేలింది. వీరి నుండి దొంగిలించిన సొత్తును కొనుగోలు చేసిన స్క్రాప్ వ్యాపారి (రిసీవర్) కూడా పట్టుబడ్డాడు. 1 మనుపాటి శేఖర్, 2 మనుపాటి సంజీవ్ 26, 3 ఉండాటి మహేశ్ 27, 4 బోదాసు కుమార్ 33, 5 సాగర్ల రంజీత్ | (36 yrs), 6 బొడిగే సంపత్ (రిసీవర్) 42,నిందితుల్లో ప్రధానమైన మనుపాటి శేఖర్ దొంగిలించిన సొమ్మును వాహనాల కిస్తీలు కట్టుటకు జల్సాలకు ఖర్చు చేసినట్లు అంగీకరించాడు. వారి నుండి స్వాధీనం చేసుకున్న ఆస్తుల వివరాలు మొత్తం విలువ రూ. 20 లక్షలు ఉంటుందని పోలీసులుపేర్కొన్నారు.



పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ వర్ధంతి పోస్టర్ ఆవిష్కరణ

- డిసెంబర్ 1న బైక్ ర్యాలీ

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 15: సిద్దిపేట జిల్లా ప్రెస్ క్లబ్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో మలిదశ తొలి అమరుడు పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ 16వ వర్ధంతి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పోలీస్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడి శ్రీశైలం ముదిరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన కుటుంబాన్ని సైతం పక్కనపెట్టి, ప్రజలపై జరుగుతున్న ఉద్యోగ, విద్యా అన్యాయాలను తట్టుకోలేక డిసెంబర్ 1న కామారెడ్డి జిల్లా సెల్ టవర్ పై నుంచి తన సర్వీస్ తుపాకీతో ఆత్మ బలిదానం చేసిన కృష్ణయ్య ముదిరాజ్ నిజమైన ఉద్యమ యోధుడు అని పేర్కొన్నారు. కృష్ణన్న చేసిన త్యాగాన్ని నేటి తరాలు స్మరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

డిసెంబర్ 1న బైక్ ర్యాలీ..

కృష్ణయ్య ముదిరాజ్ వర్ధంతి సందర్భంగా సిద్దిపేట జిల్లా పోలీస్ ఫోరం ఆధ్వర్యంలో డిసెంబర్ 1న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రంగధాంపల్లి అమరవీరుల స్తూపం వద్ద నివాళులతో ప్రారంభమయ్యే బైక్ ర్యాలీ, రూరల్ పోలీస్ స్టేషన్ వరకు సాగనుంది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర పోలీస్ రిటైర్డ్ ఉన్నతాధికారులు, విధుల్లో ఉన్న పోలీసులు, సామాజిక ఉద్యమకారులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, యువత పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కిసాన్ సెల్ వైస్ ప్రెసిడెంట్ కొండం శ్రీనివాస్, జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షులు పల్లె రాజు, న్యాయ సేవ ప్రజా పరిరక్షణ సమితి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు చల్లా రవీందర్ రెడ్డి, చిన్నకోడూరు మండల్ ఎన్హెచ్ఆర్సి అధ్యక్షుడు దానబోయిన శంకర్, ఆర్. సంతోష్ కుమార్, రవి, శ్రీకాంత్, కలీం, స్వామి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇండ్ల నిబంధనలు సడలించాలి

- కన్స్యూమర్ అసోసియేషన్ గ్రేటర్ హైదరాబాద్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు రమేష్
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కు బక్కికి వినతిపత్రం అందజేత

ప్రతిపక్షం, భూంపల్లి/- అక్బరుపేట, నవంబర్ 15: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో విధించిన నిబంధనలను సడలించాలని కన్స్యూమర్ అసోసియేషన్ గ్రేటర్ హైదరాబాద్ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు వనం రమేష్ అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో 400 స్కేర్ ఫీట్స్ కన్నా తక్కువగా ఉన్నా పర్మిషన్ ఇవ్వాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కోరడం జరిగిందని వారు తెలిపారు. శనివారం భూంపల్లిలో బక్కి వెంకటయ్యని కలిసి వనం రమేష్, బీఎల్పి రాష్ట్ర నాయకులు దబ్బెట ఆనంద్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో 400 నుండి 600 స్క్వేర్ ఫీట్ల నిబంధనతో బడుగు, బలహీన వర్గాలు దళిత, గిరిజనులు నిబంధన ప్రకారం కంటే తక్కువ స్థలం ఉన్నా కూడా ఇల్లు నిర్మించుకోవడానికి వీల్లేకుండా పోయిందని తెలిపారు. రెండు మూడు గజాలు తక్కువ ప్లాట్ ఉన్నా కూడా ప్రభుత్వం పర్మిషన్ ఇచ్చేటట్లుగా ఎస్సీ ఎస్టీ కమిషన్ ద్వారా పేదలకు న్యాయం చేయాలని కోరడం జరిగిందన్నారు. కమిషన్ చైర్మన్ సానుకూలంగా స్పందించి విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని తెలిపినట్లు వారు అన్నారు.



"ఏపీఎస్ఆర్టీసీని బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇకపై డీజిల్ బస్సులను కొనబోమని, రాబోయే మూడేళ్లలో ఎలక్ట్రిక్ బస్సులను మాత్రమే కొనుగోలు చేస్తాం. భవిష్యత్తులో గ్రామీణ ప్రాంతాల్లోనూ ఏసీ బస్సులు నడిపేలా చర్యలు తీసుకుంటాం. స్త్రీ శక్తి పథకం బాగా నడుస్తోంది. దీనిపై తప్పుడు ప్రచారం చేసిన వాళ్లు ఇప్పుడు మౌనం వహించారు.

-ఏపీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రాంతీయం



సుదర్శన్ రెడ్డిని సన్మానించిన ఉద్యోగ సంఘాలు

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 15 : రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయానికి (కలెక్టరేట్)కు శనివారం విచ్చేసిన బోధన్ శాసన సభ్యులు పి.సుదర్శన్ రెడ్డిని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికాయి. రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, రోడ్ల నిర్మాణాలు, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డితో కలిసి ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి కలెక్టరేట్ లో ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ్ రెడ్డి నేతృత్వంలో ఆ సంఘం ప్రతినిధులు ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డికి స్వాగతం పలికారు. పూల మొక్కలు అందించి శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. రెవెన్యూ శాఖ ద్వారా ప్రజలకు సమర్థవంతంగా సేవలు అందించాలని ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి సూచించారు. కాగా, టీఎన్జీఓల సంఘం అధ్యక్షుడు సుమన్ ఆధ్వర్యంలో కూడా ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ప్రశాంత్, శ్రీనివాస్, ప్రభు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన చేప పిల్లలతో మత్స్య కార్మికులకు మెరుగైన ఉపాధి

- ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి వెల్లడి
- కలెక్టర్ తో కలిసి అశోక్ సాగర్ లో చేప పిల్లల విడుదల



ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 15 : మత్స్య కార్మిక కుటుంబాల ఉపాధిని మెరుగుపర్చి, వారిని ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు గాను నాణ్యమైన చేప పిల్లల పెంపకంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించామని ప్రభుత్వ సలహాదారు, బోధన్ శాసన సభ్యులు పి.సుదర్శన్ రెడ్డి తెలిపారు. మత్స్య అభివృద్ధి పథకం కింద 2025 2026 సంవత్సరానికి గాను వంద శాతం సబ్సిడీపై చెరువులు, రిజర్వాయర్లలో చేప పిల్లలను విడుదల చేసే కార్యక్రమంలో భాగంగా శనివారం ఎడపల్లి మండలం జానకంపేట్ లోని అశోక్ సాగర్ చెరువులో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డితో కలిసి ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి చేప పిల్లలను లాంఛనంగా వదిలారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యుల సమక్షంలో చేప పిల్లల రకాలను, సైజును, నాణ్యతను పరిశీలించి, బరువును తూకం వేస్తూ, ఒక్కోటిగా వాటి సంఖ్యను క్షుణ్ణంగా లెక్కించిన మీదట చెరువులో వదిలారు. జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్ లో 4.54 కోట్ల చేప పిల్లలను పెంపకం నిమిత్తం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే అశోక్ సాగర్ చెరువులో బొచ్చ, రోహు, బంగారు తీగ జాతికి చెందిన 1,14,600 చేప పిల్లలు వదలడం జరిగిందని వివరించారు. ప్రతి చోట చెరువులు, ఇతర జలాశయాలలో చేప పిల్లలను వదిలే ముందు మత్స్య కార్మిక సంఘాల సభ్యులు తప్పనిసరిగా వాటి నాణ్యతను పరిశీలించాలని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి హితవు పలికారు. నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగానే చేప పిల్లలు కేటాయించబడినాయా? లేదా? అన్నది జాగ్రత్తగా నిర్ధారించుకోవాలని సూచించారు. ఎక్కడైనా తేడా జరిగినా, క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు ఉన్నా, వెంటనే జిల్లా అధికారుల దృష్టికి తేవాలని అన్నారు. చెరువులలో వదులుతున్న ప్రతి చేప పిల్ల బతికేలా నాణ్యమైన చేప విత్తనాలను ఉత్పత్తి చేయిస్తున్నామని అన్నారు. నాణ్యమైన చేప పిల్లలను పెంచినట్లయితే మత్స్యకారుల ఉపాధి అవకాశాలు బాగుంటాయనే ఉద్దేశ్యంతో అన్ని దశలలోనూ పకడ్బందీ పర్యవేక్షణ జరిపిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఆంజనేయ స్వామి, మత్స్య కార్మిక సంఘాల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.



స్కానింగ్ సెంటర్లకు అనుమతులు తప్పనిసరి

- డీఎంహెచ్ వో రాజశ్రీ

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 15 : జిల్లాలో ప్రతి స్కానింగ్ కేంద్రం తప్పకుండా పీసీపీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం రిజిస్టర్ అయి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజశ్రీ అన్నారు. శనివారం డీఎంహెచ్ చాంబర్లో వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజశ్రీ అధ్యక్షతన జిల్లాస్థాయి సలహా సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజశ్రీ మాట్లాడుతూ స్కానింగ్ యంత్రాల మోడల్, సీలింగ్ నంబరు సర్టిఫికెట్ లో నమోదు చేసుకోవాలని, ఒకవేళ వైద్యుడు చిరునామా మరి నట్లయితే తప్పకుండా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో విధిగా తెలుపాలని సర్టిఫికెట్ మార్చు కోవాలని సూచించారు. స్కానింగ్ కేంద్రాలకు వచ్చేవారి కోసం తాగునీటి సదుపాయం, శౌచ లయాలు ఏర్పాటు చేయాలన్నారు. రీఫెరల్ పత్రం లేకుండా స్కానింగ్ చేయరాదని, అలాగే అన్ని వివరాలు రిజిస్టర్లు లో నమోదు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఈ సమావేశంలో పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ప్రసన్న, డా. ఇందు, శ్వేత , డా॥ సుప్రియ, డా. శిర, వేణుగోపాల్, సురేషి పాల్గొన్నారు.



నిషేధిత గుట్కా పట్టివేత

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 15: నిందితుడు మిర్జా సరీముల్లాహ్ బేగ్ తన యాక్టివ్ మోటార్ సైకిల్ మీదా నిషేధిత గుట్కా ప్యాకెట్స్ తరలిస్తుండగా ఎస్సై కిషోర్ మరియు బ్లూ కోల్ట్స్ టీం పట్టుకొని అతని దగ్గర నుండి 13 వేల రూపాయల విలువగల గుట్కాలను సీజ్ చేసి కేసు నమోదు చేయడం జరిగిందని సి ఐ తెలిపారు.




'ఐరన్ మ్యాన్' విజేత డా.నరసింహ రెడ్డికి సన్మానం

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 15 : ఇటీవల గోవాలో నిర్వహించిన ఐరన్ మ్యాన్ టైటిల్ విజేతగా నిలిచిన నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ న్యూరో వైద్యులు బి ఎల్ నరసింహ రెడ్డిని వినాయక్ సాగర్ స్విమ్మింగ్ గ్రూప్ సభ్యులు శనివారం శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు.64 దేశాలకు చెందిన పలువురు ఈ పోటీల్లో పాల్గొన్నారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం ఎనిమిది గంటల వ్యవధిలో 21కి.మీ.రన్నింగ్,90 కి.మీసైక్లింగ్,1.9.కి.మీ,ఈత పోటీల్లో విజేతగా నిలిచానని అన్నారు. రన్నింగ్, సైక్లింగ్, కష్టం కాలేదుకాని అరేబియా సముద్రంలో అలలు,నిర్దేశించిన రూట్ మ్యాప్ లక్ష్యాన్ని చేరుకోవడం సులభం కాదన్నారు. కఠోర దీక్షతో ఈవిజయాన్ని సాధిన్చానని అన్నారు. సీనియర్ సిటిజన్ వెంకటరమణ మాట్లాడుతూ డా.,నరసింహ రెడ్డి ఐరన్ మ్యాన్ విజేతగా గెలుపొందడం చాల అభినందనీయమని,నిర్మల్ జిల్లా కు గర్వకారణం అని కొనియాడారు. నేటి యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లో, ఈత పోటీల్లో ముందుకెళ్లాలని సూచించారు., నేను 72సం,, వయస్సు లోకూడా ప్రతిరోజు వినాయక సాగర్ లో ఈత కొడుతానని అన్నారు.ప్రతి ఒక్కరు ఈత నేర్చుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో స్విమ్మింగ్ సభ్యులు గుమ్మల అశోక్, బోడ శ్రీనివాస్, ఈదన్నగారి రాజేశ్వర్, ఆర్కారి రాజేందర్, బోజన్న, సల్ల శ్రీనివాస్ తోపాటు పలువురు పాల్గొన్నారు.



సీనియర్ ఫోటో గ్రాఫర్ షరీఫ్ మృతికి సంతాపం

ప్రతిపక్షం ప్రతినిధి, ములుగు, నవంబర్ 15: భద్రాచలం పట్టణానికి చెందిన ప్రముఖ సీనియర్ ఫోటోగ్రాఫర్, ఎన్నో అవార్డులు అందుకున్న ఎస్.కే. షరీఫ్ ఆకస్మిక మరణం ఫోటోగ్రఫీ రంగానికి తీరని లోటని పలువురు ఫోటోగ్రాఫర్లు ఆయనకు నివాళులర్పించారు. ములుగు జిల్లా (నూగూరు) వెంకటాపురం మండల కేంద్రంలో స్పందన ఫోటో & వీడియో గ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సంతాపం సభ ఏర్పాట్లు నిర్వహించబడించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఫోటోగ్రఫీ వర్గాలు, కళా ప్రేమికులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయన స్మృతికి నివాళులు అర్పించారు. దశాబ్దాలపాటు ఫోటోగ్రఫీ ప్రపంచంలో అనేక కళాత్మక క్షణాలను సృష్టించిన ఆయనను అందరూ గౌరవంతో గుర్తు చేసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు శ్రీరాముల సధశివరావు, రాగం సాంబ, చెన్నం రాజు, వంకాయల రాము, వేల్పుల కిశోర్, చిట్యాల రవీందర్, బంధ రవి తదితరులు పాల్గొని షరీఫ్ గారి సేవలను స్మరించారు.



భూభారతి అర్జీలను వేగంగా పరిష్కరించాలి

- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 15 : భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను, సాదా బైనామా దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సబ్ కలెక్టర్లు, ఆర్డీఓ, తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఒక్కో మండలం వారీగా భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి చేపట్టిన చర్యల గురించి ఆరా తీశారు. పెండింగ్ దరఖాస్తుల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, రెండు రోజుల్లో అర్జీలు పరిష్కారం కావాలని అన్నారు. సాదాబైనామా ద్వారా భూములు కొనుగోలు చేసిన వారికి యాజమాన్య హక్కులు కల్పించాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం తెచ్చిన భూభారతి చట్టం లక్ష్యం నెరవేరేలా అర్హత కలిగిన ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. చిన్నచిన్న కారణాలతో సాదా బైనామా అర్జీలు తిరస్కరించకూడదని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలు తు.చ తప్పకుండా అమలు చేయాలని, దరఖాస్తులు తిరస్కరణకు గురైతే అందుకు గల కారణాలు స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. సాదాబైనామా దరఖాస్తులను వెంటనే సబ్ కలెక్టర్, ఆర్డీఓ కార్యాలయాలకు ఫార్వర్డ్ చేయాలని ఆదేశించారు. కాగా, ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సన్నాహక ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాల మ్యాపింగ్ ను తప్పిదాలకు తావు లేకుండా సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.



బిర్సా ముండాకు బీజేపీ నేతల నివాళులు

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 15 : గిరిజన నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీజేపీ నాయకులు వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ గిరిజనుల హక్కుల కోసం, బ్రిటిషర్లను ఎదిరించిన గొప్ప మహనీయుడు బిర్సా ముండా అని కొనియాడారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందరో నిజమైన స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను బయటికి రాకుండా చేసిందని అన్నారు. నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతి చరిత్రకారునికి, స్వాతంత్ర్య సమరయోధులకు గుర్తు చేసుకుని ఘనంగా నివాళులర్పిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, మెడిసిమ్మ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శిలు కరిపే విలాస్, చిన్నా రెడ్డి, జిల్లా కార్యదర్శి, పుస్పూర్ నర్సారెడ్డి, పట్టణాధ్యక్షులు ఆకుల కార్తీక్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్, పట్టణ ప్రధాన కార్యదర్శి కొండాజి, శ్రావణ్, కార్యదర్శి గంజి రాజు, ఉపాధ్యక్షుడు, జాప, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో బిర్సా ముండా జయంతి

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 15 : కలెక్టరేట్ లో శనివారం బిర్సా ముండా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకలలో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ పాల్గొని, బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఆదివాసుల హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి బిర్సా ముండా అని కొనియాడారు. ప్రతి ఒక్కరూ బిర్సా ముండా ఆశయ సాధనకు కృషి చేయాలని చెప్పారు. ఆదివాసుల హక్కుల నిరంతరం కోసం ఎన్నో ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. బిర్సా ముండా వంటి మహనీయుల జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయం అని తెలిపారు. ఈ జయంతి వేడుకలలో సిపిఓ జీవరత్నం, బిసి, మైనారిటీ సంక్షేమ అధికారులు శ్రీనివాస్, మోహన్ సింగ్, గిరిజన సంక్షేమ కార్యాలయ అధికారులు శివాజీ, పలువురు కుల సంఘాల నాయకులు , ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఓబీ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయండి

- ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి
- కలెక్టర్ తో కలిసి అధికారులతో సమీక్ష
- ఆర్.ఓ.బీలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని వెల్లడి



ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 15 : జిల్లాలోని వివిధ ప్రాంతాలలో కొనసాగుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం ఆయన కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డితో కలిసి ఆర్.ఓ.బీ పనుల పురోగతి, ధాన్యం కొనుగోళ్ళు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. నిజామాబాద్ రూరల్ మండలం మాధవనగర్, మాక్లూర్ మండలం అడవిమామిడిపల్లి, నిజామాబాద్ అర్బన్ పరిధి లోని అర్సపల్లి ఆర్ ఓ బీల నిర్మాణ పనులపై చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆర్.ఓ.బీల నిర్మాణాల కోసం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నిధులను సైతం విడుదల చేసిందని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. మాధవనగర్ ఆర్.ఓ.బీకి రూ. 3.15 కోట్లు, అర్సపల్లి ఆర్.ఓ.బీ పనుల కోసం రూ. 7.46 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు రవాణా పరంగా మరింత సౌలభ్యం కలిగేలా పనులను సకాలంలో పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. పనులు నాణ్యతతో సకాలంలో పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని, పనులను సకాలంలో పూర్తి చేయకుండా అలసత్వం ప్రదర్శించే కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. నిర్దేశిత గడువును ఏర్పర్చుకుని యుద్ధప్రాతిపదికన పనులను చేపట్టి పూర్తి చేయించేలా చొరవ చూపాలని అధికారులకు హితవు పలికారు. అడివిమామిడిపల్లి వద్ద బీ.టీ రోడ్డు తదితర పనులను పూర్తి చేసి, డిసెంబర్ 15 నాటికి వంతెనను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. కాగా, జిల్లాలో గోదావరి పరీవాహక ప్రాంత రైతులు ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల వరి పైరు నీటి మునిగి పంట దెబ్బతిన్నందున బాధిత రైతులను ఆదుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. రంగు మారిన, దెబ్బతిన్న ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చూడాలన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోళ్ళు జరిగాయని, ఇప్పటికే 4 లక్షల మెట్రిక్ టన్నుల పైచిలుకు ధాన్యం సేకరణ పూర్తయ్యిందని, మరో 2.5 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం దిగుబడులు కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశాలు ఉన్నాయని అంచనా వేశామని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా, వారికి నష్టం వాటిల్లకుండా కొనుగోళ్ళ ప్రక్రియను సాఫీగా జరిగేలా చూడాలని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సూచించారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఏఐ మానవాళికి ముప్పుకాదు. అది హ్యూమానిటీని పెంచుతుంది. ప్రతి పారిశ్రామిక విప్లవం అధిక ఉద్యోగాలను కల్పిస్తుంది.. కానీ తొలగించదు. ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్‌లో పారిశ్రామికవేత్తలు పురోగతి సాధిస్తున్నారు. వీరితో పనిచేసేందుకు ప్రభుత్వం ఉత్సాహంగా ఉంది. నిర్మాణాత్మక సంస్కరణలు తెచ్చేందుకు సిద్ధం.
- సీఐఐ సదస్సులో ఏపీ మంత్రి లోకేశ్

బిహార్ ఫలితాలు 'ఇండి' కూటమికి గుణపాఠం

- తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వ్యాఖ్యలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, చెన్నై, నవంబర్ 15 : యావత్ దేశం ఆసక్తి కనబరిచిన బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో ఎన్డీయే కూటమి ప్రభంజనం సృష్టించింది. 202 స్థానాలలో జయభేరి మోగించింది. మహా గఠ్ బంధన్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గత ఎన్నికలలో సాధించిన సీట్లలో సగం కూడా దక్కించుకోలేక చతికిలపడింది. 34 స్థానాలతోనే సరిపెట్టుకుంది. ఈ నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. బిహార్ ఫలితాలు ఇండియా కూటమికి ఓ పాఠం అని పేర్కొన్నారు. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు అభినందనలు తెలియజేశారు. ఎన్నికలలో విజయం కోసం తీవ్రంగా కృషి చేసిన ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌కు కూడా అభినందనలు తెలిపారు. 'ఎన్నికల ఫలితాలు సంక్షేమ కార్యక్రమాలు, సామాజిక, సైద్ధాంతిక సంకీర్ణాలు, రాజకీయ సందేశం మీద ఆధారపడి ఉంటాయి. ఇండియా కూటమిలో అనుభవజ్ఞులైన రాజకీయ నాయకులు ఉన్నారు. సవాళ్లను పరిష్కరించేందుకు వ్యూహాత్మకంగా ప్రణాళిక వేయగల సామర్థ్యం కలిగిన నాయకులు ఉన్నారు. ఈ ఫలితాలు ఇండియా కూటమికి ఓ పాఠం లాంటివి. దీంతో ఎంతో నేర్చుకోవాలి' అని స్టాలిన్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఎన్నికల సంఘంపై కూడా స్టాలిన్ విమర్శలు చేశారు. ఈ ఫలితంలో ఈసీపై వచ్చిన ఆరోపణలను పూర్తిగా కొట్టిపారేయలేమని అన్నారు. ఈసీ ప్రతిష్ట దిగజారిపోయిందన్నారు.



విశ్వ వీక్షణం



ఆర్జేడీకే ఎక్కువగా పోలైన ఓట్లు

- బీజేపీ, జేడీ (యూ)కు దక్కిన సీట్లు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, పాట్నా, నవంబర్ 15 : బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో మహా గఠ్ బంధన్ కూటమికి నేతృత్వం వహించిన రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ)కే ఎక్కువ ఓట్లు పోలయ్యాయి. అయితే, ఎన్డీయేకు చెందిన బీజేపీ, జేడీ (యు)కు అత్యధిక సీట్లు దక్కాయి. 243 అసెంబ్లీ స్థానాలకుగాను ఎన్డీయే 202 స్థానాలు గెలుచుకున్నది. చెరో 101 స్థానాలలో పోటీ చేసిన బీజేపీ 89 సీట్లు, నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీ(యు) 85 సీట్లు గెలుచుకున్నాయి. కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ 19 సీట్లు, కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ నేతృత్వంలోని హిందుస్తానీ అవామ్ మోర్చా ఐదు సీట్లు, రాజ్యసభ ఎంపీ ఉపేంద్ర కుష్వాహా నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్ మోర్చా నాలుగు సీట్లలో విజయం సాధించాయి. కాగా, మహా గఠ్ బంధన్ కూటమికి నేతృత్వం వహించిన ఆర్జేడీ 144 స్థానాలలో పోటీ చేసి, 25 సీట్లలో మాత్రమే విజయం సాధించింది. కాంగ్రెస్ పార్టీ 61 సీట్లలో పోటీ చేయగా ఆరు స్థానాల్లో గెలుపొందింది. సీపీఐ (ఎంఎల్) రెండు సీట్లు, సీపీఐ(ఎం) ఒక సీటు దక్కించుకోగా సీపీఐ ఏదీ గెలుచుకోలేదు. దీంతో కూటమి 35 సీట్లకే పరిమితమైంది. ఓటు శాతాన్ని పరిశీలిస్తే బిహార్ ప్రజలు ఆర్జేడీకే ఎక్కువ ఓట్లు వేశారు. ఆ పార్టీ 23 శాతం ఓట్లు సాధించింది. గత ఎన్నికలలో 23.11 శాతం ఉండగా ఈసారి స్వల్పంగా తగ్గింది. 144 స్థానాలలో పోటీ చేసిన ఆర్జేడీకి 1,15,46,055 ఓట్లు పోలయ్యాయి. అయితే, 25 సీట్లలోనే ఆ పార్టీ గెలిచింది. 42 సీట్లు స్వల్ప తేడాతో కోల్పోయింది. బీజేపీ ఓట్ల శాతం పెరిగింది. 2020లో 19.46 శాతం ఉండగా ఈసారి 20.07 శాతానికి పెరిగింది. 1,00,81,143 మంది ఓటర్లు బీజేపీకి ఓటు వేశారు. జేడీ(యు)కు 19.25 శాతం ఓట్లు పోలయ్యాయి.

సింగిడి

హైదరాబాద్ | ఆదివారం 16.11.2025 | 11

ప్రతిపక్షం
Prathipaksham.in





'టోల్ ప్లాజా' రెట్టింపు నిబంధన సడలింపు

- ఫాస్టాగ్‌లేనివారు అదనపు రుసుము చెల్లిస్తే చాలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 15 : ఫాస్టాగ్ లేకుండా జాతీయ రహదారుల మీద ప్రయాణించే వాహనదారులకు కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. ఫాస్టాగ్‌లేనివారికి టోల్ ప్లాజాల వద్ద విధిస్తున్న రెట్టింపు చార్జీలను రద్దు చేసింది. ఇక నుంచి 25 శాతం అదనపు రుసుము చెల్లిస్తే సరిపోతుందని స్పష్టం చేసింది. కొత్త నిబంధన శనివారం నుంచి అమలులోకి వచ్చింది. జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులు ఫాస్టాగ్ తప్పనిసరిగా తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఫాస్టాగ్ లేనివారు టోల్ రుసుముకు రెండింతలు చెల్లిస్తున్నారు. నగదు రూపంలో అయినా యూపీఐ ద్వారా చెల్లించినా ఇదే నిబంధన వర్తిస్తోంది. నేషనల్ హైవేలపై టోల్ ఫీజుగా రూ.100 చెల్లించాల్సి ఉంటే, రూ.200 వరకూ వసూలు చేసే వారు. అయితే, ఆ నిబంధనలను కేంద్రం తాజాగా సడలించింది. తాజా నిబంధనల ప్రకారం ఫాస్టాగ్‌లేని వాహనదారులు యూపీఐ ద్వారా టోల్ చార్జీ చెల్లిస్తే 25 శాతం అదనంగా చెల్లిస్తే సరిపోతుంది. రూ.100కు 25 శాతం అదనంగా అంటే రూ.125 చెల్లించి వెళ్లొచ్చు. నగదు రూపంలో చెల్లిస్తే మాత్రం రెట్టింపు ఛార్జీ కట్టాల్సిందే. డిజిటల్ పేమెంట్స్‌ను ప్రోత్సహించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

లేడీ బ్లూ కోల్ట్స్

మహిళలా మజాకా

దడ పుట్టిస్తున్న మహిళా పీసీలు

రౌడీ, హిస్టరీ షీటర్ల గుండెల్లో రైళ్లు

ఆత్మ స్థైర్యానికిర్యానికి మరో పేరు

వడ్లకొండ సదానందం
ప్రతిపక్షం బ్యూరో, ఉమ్మడి కరీంనగర్

నేరాల నియంత్రణ, సమాచారం అందిన వెంటనే నేరస్థలానికి చేరుకొని సత్వర సేవలందించడం కోసం కరీంనగర్ కమీషనరేట్ లో మహిళా బ్లూ కోల్ట్స్ అందరి కంటే ముందుంటున్నారు. రోజురోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాలు వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఒకవేళ నేరానికి గురైతే వెంటనే మొదటి గంటలోపే (గోల్డెన్ అవర్ లో) 1930 కి ఫోన్ చేసి తస్కరించబడిన సొమ్మును ఫ్రీజ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం వలన కలిగే నష్టాలూ , రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వలన కలిగే నష్టాలూ, మహిళల భద్రత, ఒంటరిగా ప్రయాణ సమయాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సోషల్ మీడియా వేదికగా జరిగే మోసాలపై, నేరాల నియంత్రణ చర్యలలో చురుకుగా పాల్గొంటున్నారు.నేరాల నిరయంత్రణ మరియు ఛేదనలో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను స్థానిక ప్రజలకు వివరించడం, వాటి ఏర్పాటుకు కృషి చేస్తారు. పోలీసు స్టేషన్లో నిర్వహించే విధులతోపాటూ, క్షేత్రస్థాయిలో సైతం విధులు నిర్వహిస్తున్నారు. గత సెప్టెంబర్ నెల 26వ తేదీ నుండి కమీషనరేట్ వ్యాప్తంగా మహిళా పోలీసులను బ్లూ కోల్ట్స్ విధుల్లో వినియోగించే కార్యక్రమాన్ని సీపీ అధికారికంగా ప్రారంభించారు. అయితే మహిళా బ్లూ కోల్ట్స్ పోలీసులు విధుల్లో భాగంగా నిర్వహిస్తున్న స్థానిక సమావేశాలు సత్ఫలితాలిస్తున్నవని, అన్నీ వర్గాల ప్రజలు పోలీసులకు సహకరిస్తున్నారనే పేరు మహిళా పోలీసు కానిస్టేబుళ్లకు ఉంది. పాయింట్ బుక్ చెకింగ్స్ , రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల కదలికలపై ఆరాతీయడం, విలేజ్ పోలీసు అధికారిణిగా రాణించడం, గ్రామ పంచాయితీల వద్ద పబ్లిక్ ప్లేసుల్లో పోలీసుల ద్వారా పొందే సేవలను గోడపత్రికలు అతికించి స్థానిక ప్రజలకు తెలియజేయడంలో తొలి వరసలో ఉంటున్నారు.సీపీఆర్ విధానం పై శిక్షణ పొందారు. అకస్మాత్తుగా గుండెపోటు సంభవించిన వ్యక్తికి ప్రథమ చికిత్సలో భాగంగా సీపీఆర్ నిర్వహించే



విధానంపై పూర్తి స్థాయిలో శిక్షణ పొందారు. మహిళల కానిస్టేబుళ్లు, బ్లూ' కోల్ట్స్ రంగంలో కి రావడంతో మహిళలు, విద్యార్థినీలు,గృహిణి లకు ఎంతో భరోసా వచ్చింది. మరింత ధైర్యంగా తమ, తమ పనుల్లో నిమగ్నం అవుతూ ఊపిరి పీల్చుకుంటున్నారు. రానున్న రోజుల్లో కమీషనరేట్ ప్రజలకు మరింత నాణ్యమైన పోలీసు సేవలు అందించేందుకు మరింత కృషి చేస్తామని సీపీ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

బ్లూ కోల్ట్స్ ప్రత్యేకతలు

కరీంనగర్ కమీషనరేట్ లో నేర నియంత్రణ, తక్షణ సేవలు అందించడంలో మహిళా బ్లూ కోల్ట్స్ ముందుంటున్నారు. నేర సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని తక్షణ సేవలు అందిస్తున్నారు.

సైబర్ నేరాల నివారణ

సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.నేరం జరిగితే, గోల్డెన్ అవర్ (మొదటి గంటలోపే) 1930కి కాల్ చేసి దొంగిలించబడిన సొమ్మును ఫ్రీజ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

ట్రాఫిక్ & మాదక ద్రవ్యాలపై అవగాహన

రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియమాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ నష్టాలపై అవగాహన.మాదక ద్రవ్యాల దుర్వినియోగం వలన కలిగే నష్టాలపై అవగాహన.

మహిళా భద్రత

మహిళల భద్రత, ఒంటరి ప్రయాణ సమయాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చురుకైన పాత్ర.సోషల్ మీడియా వేదికగా జరిగే మోసాలపై అవగాహన.

సీసీ కెమెరాల ప్రాముఖ్యత

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ఆవశ్యకతను స్థానికులకు వివరిస్తూ, వాటి ఏర్పాటుకు కృషి చేస్తున్నారు.

సీపీఆర్ శిక్షణ

అకస్మాత్తుగా గుండెపోటు సంభవించిన వ్యక్తికి ప్రథమ చికిత్సలో భాగంగా సీపీఆర్ నిర్వహించే విధానంపై పూర్తి స్థాయిలో శిక్షణ పొందారు.

విధి నిర్వహణలో

బ్లూ కోల్ట్స్ పనితీరు

మహిళా పోలీసులు 2024 సెప్టెంబర్ 26వ తేదీ నుండి బ్లూ కోల్ట్స్ విధుల్లో ఉన్నారు.వీరు నిర్వహిస్తున్న స్థానిక సమావేశాలు సత్ఫలితాలనిస్తున్నాయి. అన్ని వర్గాల ప్రజల నుంచి సహకారం అందుతోంది.

క్షేత్రస్థాయి విధులు

పాయింట్ బుక్ చెకింగ్స్, రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల కదలికలపై నిఘా పెట్టుతున్నారు.. విలేజ్ పోలీస్ అధికారిణిగా పాత్ర: గ్రామ పంచాయతీలు, పబ్లిక్ ప్లేసుల్లో పోలీసు సేవలను గోడపత్రికల ద్వారా ప్రజలకు తెలియజేయడంలో ముందున్నారు.

భరోసా:

మహిళా బ్లూ కోల్ట్స్ రంగంలోకి రావడంతో మహిళలు, విద్యార్థినులు, గృహిణులు మరింత ధైర్యంగా, భరోసాతో తమ పనుల్లో నిమగ్నమవుతున్నారు.



మహిళా బ్లూ కోల్ట్స్ బెటర్!

సీపీ గౌస్ ఆలం అభిప్రాయం

కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మహిళా బ్లూ కోల్ట్స్ పనితీరును మెచ్చుకున్నారు, "పురుషులకంటే 'మహిళా బ్లూ కోల్ట్స్ ' బెటర్!" అని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అభిప్రాయపడ్డారు. పురుషులతో సమానంగా రాణింపు: మహిళా పోలీసు కానిస్టేబుళ్లు పురుష పోలీసులతో సమానంగా, మెరుగ్గా రాణిస్తున్నారని పేర్కొన్నారు. ప్రాణాలు కాపాడే నైపుణ్యం: సీపీఆర్ శిక్షణ ద్వారా వారు అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడే నైపుణ్యం కలిగి ఉన్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. మెరుగైన సేవలు: రానున్న రోజుల్లో కమీషనరేట్ ప్రజలకు మరింత నాణ్యమైన పోలీసు సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.









'మహా' కూటమి ఓటమిలో 'జన సురాజ్' కీలకం

- విపక్ష కూటమి ఓట్లను భారీగా చీల్చిన పీకే పార్టీ


ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, పాట్నా, నవంబర్ 15 : బిహార్ లో నితీశ్ కుమార్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమైంది. అయితే, మహా గఠ్ బంధన్ ఘోర ఓటమిలో ప్రశాంత్ కిషోర్ జనసురాజ్ పార్టీ ప్రభావం కీలకంగా కనిపిస్తోంది. 238 సీట్లకు పోటీపడిన జన సురాజ్ ఒక్క సీటూ గెలవకపోయినా, దాని 34 శాతం ఓటు షేర్ ఆర్జేడీ కూటమి అవకాశాలను గణనీయంగా దెబ్బ తీసింది. ప్రధానంగా యువత, ఓబీసీలు, కుల ఓట్లను విభజించి ఎన్డీయేకు పరోక్షంగా లాభం చేకూర్చింది. ఆ పార్టీ 40కి పైగా నియోజకవర్గాలలో పది వేలకు పైగానే ఓట్లను సాధించింది. ఈ స్థానాలు ఆర్జేడీ బలంగా ఉన్న ఉత్తర బీహార్, మగధ ప్రాంతాలలోనే ఉన్నాయి. కానీ, ఒక్క సీటు కూడా గెలవ లేదు. 68 నియోజకవర్గాలలో నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. కానీ, కూటమి అవకాశాలను దెబ్బతీశాయి. జన సురాజ్ ప్రధానంగా 'మార్పు' నినాదంతో యువత, ఓబీసీలు, ఈబీసీల ఓట్లను లక్ష్యంగా చేసుకుంది. ఇది ఆర్జేడీ, యాదవ్, ముస్లిం కోర్ ఓటు బ్యాంకుకు ఐదు నుంచి పది శాతం వరకు కోతపెట్టింది. ఫలితంగా మహా గఠ్ బంధన్ ఓటు షేర్ 37 శాతం నుంచి 30 శాతానికి పడిపోయింది. ప్రశాంత్ కిషోర్ నితీశ్ ను ఓడించాలని లక్ష్యంగా పెట్టుకున్నా, జన సురాజ్ ఓట్లు ఆర్జేడీ నుంచే వచ్చాయి ఎన్డీయేకు పరోక్ష సహాయం చేశాయి.




ఆర్‌కే సింగ్‌పై బీజేపీ వేటు

- పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపణ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 15 : క్రమశిక్షణా చర్యలలో భాగంగా బీజేపీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర మాజీ మంత్రి, బిహార్‌కు చెందిన సీనియర్ నేత ఆర్‌కే సింగ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. ఎన్నికలలో బీజేపీ విజయం సాధించిన మరుసటి రోజే ఈ చర్య తీసుకోవడం రాజకీయ వర్గాలలో చర్చనీయాంశంగా మారింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో ఆయనపై వేటు వేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కొంతకాలంగా ఆర్‌కే సింగ్ ఎన్డీయే నాయకత్వంపైనా, నితీశ్ కుమార్ ప్రభుత్వంపైనా తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. 'మీరు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇది క్రమశిక్షణ ఉల్లంఘన కిందకు వస్తుంది. దీనితో పార్టీకి నష్టం వాటిల్లింది. అందుకే మిమ్మల్ని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నాం. వారం రోజులలోగా, మిమ్మల్ని పార్టీ నుంచి ఎందుకు బహిష్కరించకూడదో వివరణ ఇవ్వాలి' అని నోటీసులో స్పష్టం చేసింది. గతంలో దౌత్యవేత్తగా, మన్మోహన్ సింగ్ హయాంలో కేంద్ర హోమ్ సెక్రటరీగా పనిచేసిన ఆర్‌కే సింగ్, 2013లో బీజేపీలో చేరారు. బిహార్‌లోని ఆరా లోక్‌సభ స్థానం నుంచి 2014, 2019లో రెండుసార్లు ఎంపీగా గెలిచారు. 2017లో మోడీ కేబినెట్‌లో కేంద్ర విద్యుత్ శాఖ మంత్రిగా పని చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికలలో ఓటమి పాలయ్యారు.









144 పరుగులతో వైభవ్ సూర్యవంశీ దూకుడు

- **యూఏఈపై భారత్- 'ఎ' జట్టు అద్భుత విజయం**

ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టీ20 టోర్నీలో జితేశ్ శర్మ సారథ్యంలోని భారత్ 'ఎ' జట్టు శుభారంభం చేసింది. శుక్రవారం యూఏఈతో జరిగిన తొలి మ్యాచ్‌లో సూర్యవంశీ చెలరేగడంతో 148 పరుగుల తేడాతో గెలుపొందింది. వైభవ్ ఈ మ్యాచ్‌లో 42 బంతులలోనే 144 పరుగులు చేయడం విశేషం. 11 ఫోర్లు, 15 సిక్సర్లతో దాదాపు సునామీ సృష్టించాడు. అతని అసాధారణ బ్యాటింగ్‌తో మ్యాచ్ పూర్తిగా ఏకపక్షంగా సాగింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ వైభవ్ దూకుడుతో 20 ఓవర్లలో నాలుగు వికెట్లకు 297 పరుగుల రికార్డ్ స్కోర్ సాధించింది. కెప్టెన్ జితేష్ శర్మ 83 (నాటౌట్) పరుగులు చేయడం విశేషం. అనంతరం బ్యాటింగుకు దిగిన యూఏఈ 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 149 పరుగులే చేసి ఓడిపోయింది. షోయబ్ ఖాన్ 63 పరుగులు చేయగా, మిగతా బ్యాటర్లు అంతగా రాణించలేదు. భారత బౌలర్లలో గుర్జన్‌పీత్ సింగ్ మూడు వికెట్లు తీశాడు. రమణ్‌దీప్ సింగ్, యశ్ ఠాకూర్ కు చెరో వికెట్, హర్ష్ దూబేకు రెండు వికెట్లు దక్కాయి. ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య (10) రాణించకున్నా నమన్ ధీర్ (34)తో కలిసి వైభవ్ ధాటిగా ఆడాడు. రెండో వికెట్‌కు 163 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. 17 బంతులలోనే అర్ధశతకం సాధించి, 32 బంతులకే సెంచరీ చేశాడు. 13వ ఓవర్‌లో క్యాచ్ ఔటయ్యాడు. దాంతో యూఏఈ బౌలర్లు ఊపిరి పీల్చుకున్నారు. ఆదివారం జరిగే తమ మ్యాచ్‌లో పాకిస్తాన్ షహీన్స్‌తో భారత్ 'ఎ' తలపడనుంది.

కోల్‌కతా టెస్టులో టీమిండియా దూకుడు

- **దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 159 పరుగులకు ఆలౌట్**

కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టులో భారత స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా తన స్పిన్ మాయాజాలంతో సత్తా చాటాడు. రెండో ఇన్నింగ్స్‌లో సఫారీ టాపార్డర్‌ను కుప్పకూల్చి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పాడు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా కేవలం 68 పరుగులకే 5 కీలక వికెట్లు కోల్పోయి పీకలలోతు కష్టాలలో పడింది. రెండో ఇన్నింగ్స్‌లో అద్భుతంగా బౌలింగ్ చేసిన జడేజా 22 పరుగులిచ్చి ఏకంగా 4 వికెట్లు పడగొట్టాడు. మార్క్రమ్ (4), ముల్డర్ (11), డి జోర్జి (2), స్టబ్స్ (5) వంటి కీలక బ్యాటర్లను పెవిలియన్ చేర్చాడు. మరో వికెట్‌ను కుల్దీప్ యాదవ్ తన ఖాతాలో వేసుకున్నాడు. దీంతో సఫారీ జట్టు స్వల్ప ఆధిక్యంలో ఉన్నప్పటికీ, మ్యాచ్‌పై టీమిండియా పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. అంతకుముందు, దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 159 పరుగులకు ఆలౌట్ అయింది. బదులుగా భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 189 పరుగులు చేసి 30 పరుగుల ఆధిక్యాన్ని సంపాదించింది. ప్రస్తుతం క్రీజులో కెప్టెన్ బవుమా (24), కైల్ వెరైన్ (3) ఉన్నారు. దక్షిణాఫ్రికా జట్టు 38 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. జడేజా ఇదే ఊపును కొనసాగిస్తే మూడో రోజు సఫారీలను తక్కువ స్కోరుకే కట్టడి చేసి, భారత్ సునాయాసంగా విజయం సాధించే అవకాశాలున్నాయి.



ఐపీఎల్ జట్లలో భారీగా మార్పులు, చేర్పులు

- **అధికారిక జాబితా ప్రకటించిన బీసీసీఐ**

ఐపీఎల్ ఫ్రాంచైజీల ట్రేడింగ్ వివరాలను బీసీసీఐ శనివారం నాడు అధికారికంగా ప్రకటించింది. అందరూ అనుకున్నట్టుగానే సంజూ శాంసన్ చెన్నై సూపర్ కింగ్స్‌లోకి, ఆ జట్టు నుంచి రవీంద్ర జడేజా, సామ్ కరణ్ రాజస్థాన్ రాయల్స్ జట్టులోకి వచ్చారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ లో ఉన్న మహమ్మద్ షమీని లక్నో సూపర్ జెయింట్స్ తీసుకుంది. కేకేఆర్‌కు నుంచి మయాంక్ మార్కండేను ముంబై ఇండియన్స్ కొనుగోలు చేసింది. అయితే, సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్‌ను లక్నో సూపర్ జెయింట్స్ తీసుకోవడం విశేషం. రాజస్థాన్ రాయల్స్ నుంచి నితీశ్ రాణాను ఢిల్లీ క్యాపిటల్స్ కు వచ్చాడు. ఆల్‌రౌండర్ డోనోవన్ ఫెర్రీరాను కూడా ఆర్ఆర్ తీసుకుంది. ఈ వ్యవహారంలో కొందరి ధరలు తగ్గగా మరికొందరికి పెరిగాయి. 18 కోట్లతో సీఎస్కేలో ఉన్న రవీంద్ర జడేజాను రాజస్థాన్ రాయల్స్ రూ.14 కోట్లకు తీసుకుంది. సంజూ శాంసన్‌ను తన పాత ధర రూ.18 కోట్లకే సీఎస్‌కే కొనుగోలు చేసుకుంది. సీఎస్‌కే నుంచి సామ్ కరన్‌ను రాజస్థాన్ రాయల్స్ తన పాత ధర రూ.2.4 కోట్లకే తీసుకుంది. సన్‌రైజర్స్ నుంచి షమీని రూ.10 కోట్ల పాత ధరకే లక్నో ట్రేడ్ చేసుకుంది. లెగ్ స్పిన్నర్ మయాంక్ మార్కండేను రూ.30 లక్షలకు ముంబై తీసుకుంది. ఆల్‌రౌండర్ అర్జున్ టెండూల్కర్‌ను అతని ధర రూ.30 లక్షలకే లక్నో తీసేసుకుంది. నితీశ్ రాణాను ఢిల్లీ 4.2 కోట్ల ధరకే ట్రేడ్ చేసుకుంది. ఫెర్రీరాను కోటి రూపాయలకు రాజస్థాన్ రాయల్స్ తీసుకుంది.



జాతీయ పికిల్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ

- **పోటీలకు స్పాన్సర్ గా వ్యవహరించిన 'సబల' మిల్లెట్స్'**

జాతీయ పికిల్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ విజేతగా నిలిచింది. ఆరోగ్యకర జీవనశైలి ఉత్పత్తుల సంస్థ ప్రియా 'సబల' మిల్లెట్స్' స్పాన్సర్‌గా వ్యవహరించిన పోటీలలో పురుషుల 40+ విభాగంలో తెలంగాణ ద్వయం గెలుపును అందుకుంది. కర్ణాటక జట్టును ఓడించి టైటిల్ సాధించింది. మహిళల సింగిల్స్‌లో మహారాష్ట్రకు, అండర్ 14 బాలుర విభాగంలో గుజరాత్‌కు ట్రోఫీలు దక్కాయి. 30 యేండ్ల మహిళల విభాగంలో కర్ణాటక జోడీ విజయం సాధించింది. విజేతలకు భారత పికిల్‌బాల్ సమాఖ్య (ఐపీఏ) అధ్యక్షుడు సూర్యవీర్ సింగ్ తన చేతుల మీదుగా పతకాలు అందజేశారు. కాగా, 'సబల మిల్లెట్స్'కు సంబంధించిన ఉత్పత్తులు క్రీడాకారులతో పాటు అక్కడ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించాయి. 'సబల' స్టాల్ వద్ద సందడి నెలకొంది. ఈ టోర్నీకి అతిథిగా వచ్చిన కర్ణాటక రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు గుణరంజన్ శెట్టి మాట్లాడుతూ శరీరానికి సమతుల ఆరోగ్యం అందించేందుకు సబల ఉత్పత్తులు ఉపయోగపడతాయని అన్నారు. ఆరోగ్యకర, రుచికర, ఆకర్షణీయ ఆహారాన్ని అందించడం దీని లక్ష్యం. భారతీయ ఆహార పరిశ్రమలో అత్యంత విశ్వసనీయ బ్రాండ్లలో ఒకటైన సబల, జాతీయ పికిల్‌బాల్ టోర్నీకి స్పాన్సర్‌గా వ్యవహరించడం విశేషం.

టాప్ క్లాస్ సినిమా తీసినందుకు ప్రౌడ్‌గా ఉంది

'కాంత' ప్రెస్ మీట్ లో రానా దగ్గుబాటి

దుల్కర్ సల్మాన్ లేటెస్ట్ రెట్రో బ్లాక్ బస్టర్ 'కాంత'. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించారు. రానా, సముద్రఖని కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్. దుల్కర్ సల్మాన్ 'వేఫేర్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్', రానా దగ్గుబాటి 'స్పిరిట్ మీడియా' సంయుక్తంగా నిర్మించారు. నవంబర్ 14 విడుదలైన ఈ సినిమా అన్ని చోట్ల అద్భుతమైన రెస్పాన్స్ తో బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్ లో రానా దగ్గుబాటి మాట్లాడుతూ.. కాంత సినిమాకి ఆడియన్స్ నుంచి వచ్చిన రెస్పాన్స్ చాలా ఆనందాన్నిచ్చింది. ముఖ్యంగా పెర్ఫార్మెన్స్ లకు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. దుల్కర్ గారి కెరీర్ ఫైనెస్ట్ పెర్ఫార్మన్స్ ఇచ్చారు. మ్యూజిక్, విజువల్స్ టెక్నికల్ వాల్యూస్ గురించి చాలా మంచి ప్రశంసలు వస్తున్నాయి. టాప్ క్లాస్ ప్రొడక్షన్ వాల్యూ వున్నా సినిమా ఇది. మీ అందరి సపోర్ట్ కి థాంక్యూ. చాలా అద్భుతమైన ఫీడ్బ్యాక్ వస్తుంది. జోనర్ బెండింగ్ సినిమా గా వచ్చిన ఫస్ట్ ఫిలిమ్ కాంత . ఆడియన్స్ నుంచి వచ్చిన రెస్పాన్స్ అద్భుతంగా ఉంది. మద్రాస్ నేపథ్యంలో జరిగే కథ కావడం, ఎలాంటి అంచనా లేకుండా చూడటంతో మద్రాస్ ఆడియన్స్ ఇంకా అద్భుతంగా కనెక్ట్ అయ్యారు. అనంతరం విలేకరులు అడిగిన ప్రశ్నలకు రానా, భాగ్యశ్రీ సమాధానాలు ఇచ్చారు.

రానా ఈ సినిమాని మీరు దుల్కర్ నిర్మించడానికి కారణం ?

నాకు కొలాబరేషన్ అంటే చాలా ఇష్టం. ఇద్దరు ఆర్టిస్టులు రెండు కంపెనీలు ఒకచోట కలిసినప్పుడు అన్ని డిఫరెంట్ గా ఉంటాయి. ఇండిపెండెంట్ ఆర్ట్ సినిమా నాకు దుల్కర్ గారికి ఇద్దరికి ఇష్టం. ఈ సినిమా చేసినందుకు చాలా గర్వంగా ఉంది. చాలా గ్యాప్ తర్వాత నేను స్క్రీన్ మీద కనిపించాను. నా క్యారెక్టర్ కూడా చాలా మంచి అప్లాజ్ వచ్చింది. దుల్కర్ అమేజింగ్ పెర్ఫార్మన్స్ ఇచ్చారు. బేసిగ్గా హీరో అంటే ఇన్ సెక్యూర్ అవ్వకూడదు అనే ఫీలింగ్ ఉంటుంది. కానీ దుల్కర్ ఆ ఎమోషన్ ని చాలా అద్భుతంగా ప్రదర్శించారు. భాగ్యశ్రీ క్యారెక్టర్ కి చాలా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తనకి బిగ్ కంగ్రాజులేషన్స్.

రానా ఈ సినిమా సెట్స్ దానికోసం ఎలాంటి రీసెట్ చేశారు?

చాలావరకు రిఫరెన్సులు వాహిని స్టూడియోస్ ఏవీఎం స్టూడియోస్ నుంచి చాలా వరకు రిఫరెన్స్ లు తీసుకున్నాం. ఆ టైంలో సెట్లు ఎలా చేసేవారు అనేది ప్రతిదీ డీటైలింగ్ గా డిజైన్ చేయడం జరిగింది. అలాగే డైరెక్టర్ సెల్వ ప్రతి విషయంలో చాలా పర్టికులర్ గా ఉంటారు. దాని ప్రతి ఫ్రేమ్ ని ఒక పెయింటింగ్ ల చూపించాడు.

ఇది బయోపిక్ కాదు అన్నారు.. మరి ఎంజీఆర్, ఎంఆర్ రాజా లాంటి ప్రముఖ నటుల్ని ఎందుకు చూపించారు?

ఇది ఆ టైం కి సంబంధించిన కథ. దానికి రిలవెంట్ గా ఉంటుందని అలా చూపించడం జరిగింది. 50, 60 దశకాల్లో నుంచి తీసుకున్న సినిమాల రిఫరెన్స్ లు ఇందులో చూపించడం జరిగింది.

భాగ్యశ్రీ ... ఇది మీ ఫస్ట్ తమిళ్ సినిమా కదా.. ఆ భాషలో పెర్ఫార్మ్ చేయడం ఎలా అనిపించింది?

ముందుగా ఈ సినిమా అవకాశం రావడం అనేది అదృష్టంగా భావిస్తున్నాను. అంత మంచి అవకాశం వచ్చినప్పుడు తప్పకుండా 100% ఇవ్వాలి. డైరెక్టర్ సెల్వ గారి సపోర్ట్ తో ప్రతి లైన్ ని క్షుణ్ణంగా నేర్చుకున్నాను. ద బెస్ట్ ఇవ్వడానికి ప్రయత్నించాను. నా పర్ఫార్మెన్స్ ఆడియన్స్ కి నచ్చడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా కోసం ఆరు నెలలు చెన్నైలోనే ఉన్నాను. ఈ సినిమా కోసం సావిత్రి, శ్రీదేవి చేసిన చాలా సినిమాలు చూశాను. అలాగే నాకు చిన్నప్పటి నుంచి సినిమాలు అంటే ఇష్టం. అందులోనూ పాత సినిమాలు ఇంకా ఇష్టం. అవన్నీ కూడా దీనికి ఉపయోగపడ్డాయి. తమిళ్లో తెలుగులో రెస్పాన్స్ చాలా అద్భుతంగా ఉంది. ఇంత మంచి రెస్పాన్స్ ని నేను ఊహించలేదు

రానా ఇందులో మీ క్యారెక్టర్ కోసం ఏదైనా రిఫరెన్స్ ఉందా?

లేదండి. డైరెక్టర్ సెల్వ కి ఒక పర్టికులర్ విజన్ ఉంది. ఆ క్యారెక్టర్ ఎలా బిహేవ్ చేయాలి? తను ముందే అనుకున్నాడు. నాకు అక్కడ ఉన్న ఏ పాత్ర మీద ఎలాంటి రెస్పెక్ట్ ఉండదు. ఈ అలాగే ఉండాలని తన ముందే ఫిక్స్ అయ్యాడు.

మీరు రొటీన్ కమర్షియల్ సినిమాలు చేయకపోవడానికి కారణం? .

నేను మొదటి నుంచి ఒక విభిన్నమైన దారిని ఎంచుకున్నాను.నేను చూడని సినిమా ఇవ్వాలనే ఉంటుంది. అది నాకు చాలా ఎక్సైటింగ్ గా అనిపిస్తుంది

భాగ్యశ్రీ వరుసగా రెండు వారాల్లో మీరు వచ్చి రెండు సినిమాలు వస్తున్నాయి ఎలా అనిపిస్తుంది?

చాలా హ్యాపీ. కాంత రెస్పాన్స్ చాలా ఆనందం ఇచ్చింది. రెండు డిఫరెంట్ సినిమాలు. ఈ రెండిటి నేపథ్యం సినిమా అయినప్పటికీ కథపరంగా దేనికవి ప్రత్యేకమైన సినిమాలు.





'మై డియర్ సిస్టర్' ఫస్ట్ లుక్ రిలీజ్

అరుళ్ నిధి-మమత మోహన్‌దాస్ ప్రధాన పాత్రల్లో "మై డియర్ సిస్టర్" చిత్రాన్ని అద్భుతమైన విజువల్ ప్రోమోతో ప్రకటించారు. ఈ అన్‌స్క్రిప్టెడ్ టగ్‌ఆఫ్‌వార్ వీడియో ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్యాషన్ స్టూడియోస్ ఎప్పటిలానే విభిన్న జానర్స్‌లో కుటుంబం మొత్తం చూడగలిగే నాణ్యమైన సినిమాలను అందిస్తూ తమ ప్రత్యేకతను మరొకసారి చాటుకుంది. అన్నాచెల్లెళ్ళ బంధం ఎన్నాళ్లుగానో ముఖ్యమైన భావోద్వేగ అంశం. పాసా మలర్ నుంచి వేదాళం వరకూ అన్నాచెల్లెల్ల అనుబంధం తరతరాలుగా ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తూనే ఉంది. ఈ ఎమోషన్ ని మరోసారి ముందుకు తీసుకువెళ్తూ, ప్యాషన్ స్టూడియోస్ "మై డియర్ సిస్టర్" పేరుతో ఓ మనసుని తాకే భావోద్వేగపూరితమైన కథను అందిస్తోంది. ఈ చిత్రాన్ని ప్యాషన్ స్టూడియోస్ సుధన్ సుందరం , గోల్డ్‌మైన్స్ టెలిఫిలిమ్స్ మనీష్ షా కలిసి నిర్మిస్తున్నారు. ఎన్నంగా సార్ ఉంగా సట్టంతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న ప్రభు జయరామ్ ఈ చిత్రానికి దర్శకుడు. కంటెంట్ బేస్డ్ పాత్రలతో ప్రత్యేకత సాధించిన అరుళ్ నిధి, మల్టీ టాలెంటెడ్ మమత మోహన్‌దాస్ అన్నాచెల్లెళ్ళుగా కనిపించబోతున్నారు. వీరి అనుబంధం సినిమా భావోద్వేగానికి కేంద్ర బిందువుగా ఉండనుంది. ఇటీవల బైసన్ తో సంగీత ప్రపంచంలో మంచి విజయాన్ని సొంతం చేసుకున్న నివాస్ ప్రసన్న ఈ చిత్రానికి సంగీత దర్శకుడు. "మై డియర్ సిస్టర్"లో మొత్తం ఏడు పాటలు ఉండగా ఇవన్నీ సంగీత ప్రేమికులను ఆకట్టుకునేలా వుంటాయి.

'12A రైల్వే కాలనీ' నా క్యారెక్టర్ గుర్తుండిపోతుంది



కామాక్షి భాస్కర్ల

హీరో అల్లరి నరేష్ అప్ కమింగ్ థ్రిల్లర్ '12A రైల్వే కాలనీ' ఎక్సయిటింగ్ ప్రమోషనల్ కంటెంట్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. నూతన దర్శకుడు నాని కాసరగడ్డ దర్శకత్వంలో, శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాసా చిట్టూరి నిర్మించారు. పవన్ కుమార్ సమర్పణలో పోలిమేర మూవీ సిరీస్ తో పాపులరైన డాక్టర్ అనిల్ విశ్వనాథ్ షోరన్నర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ రాశారు. కామాక్షి భాస్కర్ల హీరోయిన్ గా నటిస్తున్నారు. నవంబర్ 21న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో కామాక్షి భాస్కర్ల ఈ సినిమా విశేషాలు పంచుకున్నారు.

అనిల్ చేసిన ప్రతి సినిమాలో మీరు ఉంటున్నారు?

పొలిమేరతో మా జర్నీ స్టార్ట్ అయింది. నిజానికి నాకు యాక్టింగ్ తో పాటు రైటింగ్ కూడా ఇష్టం. పొలిమేర జరుగుతున్నప్పుడే డైరెక్షన్ డిపార్ట్మెంట్లో వర్క్ చేస్తానని ఆయనని రిక్వెస్ట్ చేశాను. అలా ఆయన ప్రతి సినిమాలో జర్నీ కొనసాగుతుంది.పొలిమేర సినిమాలో నా పెర్ఫార్మెన్స్ ని అందరూ అభినందించారు. ప్రత్యేకంగా నాకోసం ఒక పేరాగ్రాఫ్ రాశారు. మంచి పర్ఫార్మెన్స్ ఉన్నప్పుడు ఎందుకు పాత్రలు ఇవ్వకూడదనేది అనిల్ గారి ఉద్దేశం. ఇప్పుడు వరకు చేసింది రెండే సినిమాలు. ఆ రెండు సినిమాల్లో కూడా నేను ఉన్నాను.

ఈ సినిమాలో మీ క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది?

ఇందులో నరేష్ కి జోడిగా కనిపిస్తాను. నా క్యారెక్టర్ పేరు ఆరాధన. నా క్యారెక్టర్ ఎక్కడ నుంచి వచ్చింది ఏం చేస్తుందనేది చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంటుంది. తన పని మీదే శ్రద్ధ పెట్టే క్యారెక్టర్. అలాంటి లైఫ్ లో వచ్చిన ప్రేమ స్టోరీ ఎలా ముందుకెళ్ళింది అనేది చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంటుంది. ఆరాధన క్యారెక్టర్ ఈ సినిమాకి చాలా ఇంపార్టెంట్ . తన క్యారెక్టర్ లేకపోతే ఈ కథ లేదు. సినిమా చూసిన తర్వాత నా క్యారెక్టర్ గుర్తుండిపోతుంది.

నరేష్ తో వర్క్ చేయడం ఎలా అనిపించింది?

నరేష్ తో ఇంతకుముందు ఇట్లు మారేడుమిల్లి సినిమా చేశాను. నాకు చిన్నప్పటినుంచి నరేష్ పర్సనల్ గా తెలుసు. నరేష్ చాలా సైలెంట్ పర్సన్. మేము ఎప్పుడు కూడా సినిమాలు గురించి మాట్లాడుతుంటాము. ఆయన అద్భుతమైన నటుడు. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను.

మీరు హీరోయిన్ తో పాటు అన్ని రకాల పాత్రలు చేస్తున్నారు కదా?

లైలా, డెకాయిట్ ఈ సినిమా సైన్ చేయడానికి ముందు చేసినవే. నవీన్ చంద్ర గారితో చేసిన షో టైం అనేది తర్వాత చేశాను. అయితే ముందు షో టైం రిలీజ్ అయింది. నిజానికి బయట నుంచి చూసేవాళ్ళకి ఒక సినిమాలో హీరోయిన్ గా చేస్తుంది మరోసినిమాలో ఇంపార్టెంట్ క్యారెక్టర్ చేస్తుందనే అనే ఫీలింగ్ ఉండొచ్చు. కథలో కీలకమైన పాత్రలు చేయాలనే భావిస్తున్నాను. డెకాయిట్ లోనా క్యారెక్టర్ చాలా ఇంపార్టెంట్ . ఆ క్యారెక్టర్ లేకపోతే ఆ కథ ముందుకు వెళ్ళదు. శ్రీ విష్ణు, సుహాస్, విజయ్ సేతుపతి ఇలా చాలామంది హీరోలు అన్ని రకాల పాత్రలు చేసుకుంటూ వచ్చారు. అయితే ఫిమేల్ యాక్ట్రెస్ కి ఆ యాక్సెప్టెన్సీ లేదు. అలా ఎందుకు ఉండకూడదు అని ఒక ఛాలెంజ్ గా తీసుకుని ఒక రిస్క్ తీసుకునే ఇలా పాత్రలు చేస్తున్నాను. ఐదేళ్లు నా కెరియర్ లో విరూపాక్ష పొలిమేర చిత్రాలు చాలా మంచి పేరు తీసుకొచ్చాయి. నిజానికి లైలా సినిమాలో నా క్యారెక్టర్ చాలా కీలకం, ఆ క్యారెక్టర్ చుట్టే కథ ఉంటుంది. ఆ సినిమా వర్కౌట్ అయి ఉంటే మంచి పేరు వచ్చేది. అయితే నేను ఏదైనా సరే ఒక క్రియేటివ్ యాంగిల్ లోనే చూస్తాను.

మీరు డాక్టర్ కదా.. ఇప్పటికీ ప్రాక్టీస్ చేస్తున్నారా?

నేను జనరల్ ఫిజీషియన్ ని. అపోలో లో ప్రాక్టీస్ చేశాను. అయితే కోవిడ్ కి ముందు ఆపేశాను. ఇప్పుడు పూర్తిగా నటనతోనే బిజీగా ఉన్నాను. అయితే నేను పనిచేస్తున్న సినిమా సెట్ లో నన్ను డాక్టర్ గా యూజ్ చేస్తుంటారు (నవ్వుతూ) ఇండియన్ సినిమాలో పారామెడికల్ కల్చర్ తక్కువ. అలాంటి పారామెడికల్ కల్చర్ ని తెలుగు సినిమాలో తీసుకురావాలనే ఆలోచన ఉంది.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at H.No. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200